తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం : fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101 పేజీలు: 8+16 వెల: 6.50



SHOWROOM: TELANGANA: RENAULT KHAMMAM Ph: 8527234093.

# కొత్త విద్యావిధానం

>> 1.5 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. తెలంగాణలో 17 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారని వెల్లడించారు. 12 వేల ప్రైవేట్ స్కూల్స్ ఉంటే 38 లక్షల మంది చదువుతున్నారని చెప్పారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఉన్న గొప్పతనం ఏమిటీ.. ప్రభుత్వ స్కూళ్లలో ఉన్న లోపం ఏమిటో..? పరిశీలించుకోవాలని అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో 8 శాతం నిధులను విద్య కోసం కేటాయించామని తెలిపారు. వచ్చే ఏడాది విద్యకు అధికంగా నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. 15 శాతానికి క్రమంగా పెంచుతామని వివరించారు. 25 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను విద్యావిధానం పరిశీలనకు ఫిన్లాండ్ దేశానికి పంపించామని ప్రస్తావించారు. అలాగే, అత్యుత్తమ ప్రదర్శన కనపరిచిన ఉపాధ్యాయులను ఎంపిక చేసి 500 మందిని విదేశాలకు పంపిస్తామని అన్నారు. విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను గుర్తించే టీచర్లను అభినందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని ఉద్ఘాటించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున టీచర్లను సన్మానిస్తామని చెప్పుకొచ్చారు. పేద విద్యార్థులు ఆర్థాకలితో పాఠశాలలకు వస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన భోజనం అందిస్తామని స్పష్టం చేశారు. పాఠశాల విద్యార్థులకు పాలు, రాగిజావ అందిస్తామని ప్రకటించారు. కొడంగల్‌లో ఫైలెట్ ప్రాజెక్టుగా పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాల్లో చదివే విద్యార్థులు తమ పిల్లలతో సమానమని, తల్లిదండ్రుల్లా తమ ప్రభుత్వం విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

200 శాతం కాస్మోటిక్ ఛార్జీలు, 40 శాతం డైట్ ఛార్జీలు పెంచామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రేపటి తెలంగాణ ప్రభుత్వ పాఠశాల గదుల్లోనే ఉందని తాము భావిస్తున్నామని, విద్యాశాఖపైన పెట్టే ఖర్చును భవిష్యత్తు తరాల పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. యూనివర్శిటీలల్లో సదుపాయాల కల్పన కోసం వందలాది కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నామని వివరించారు. 100 నియోజకవర్గాల్లో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను రూ.20 వేల కోట్లతో నిర్మిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణలోని పేదల బిడ్డలు ధైర్యంగా గుండెపైన చేయి వేసుకుని యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లలో చదువుకున్నామని చెప్పాలన్నదే తన ధ్యేయమని ఉద్ఘాటించారు. తామంతా ప్రభుత్వ స్కూళ్లలో చదువుకున్నామని.. ప్రభుత్వ పాఠశాలలు అనాథ శరణాలయాలు కాదని.. అభివృద్ధి వేదికలని వ్యాఖ్యానించారు. పాఠశాలల్లో కఠిన నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తామని, పాఠశాలలు టీచర్లు, ఐఏఎస్‌లు, రాజకీయ నాయకుల కోసం కాదని...పేద విద్యార్థుల కోసమని పేర్కొన్నారు. పేదలకు మేలు జరిగే ఏ నిర్ణయమైనా తాము వెనకడుగు వేయకుండా తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఇచ్చే ఎడ్యూకేషన్ కిట్ నాణ్యతను తానే స్వయంగా పరిశీలించానని ప్రస్తావించారు. పుస్తకాలు, నోట్ పుస్తకాలు సరైన సమయంలో విద్యార్థులకు చేరాలని సూచించారు. పాఠశాల ప్రారంభమయ్యే రోజే విద్యార్థులకు ఒక జత స్కూల్ డ్రెస్‌ను అందజేస్తున్నామని.. మరో జత నెలాఖారున ఇస్తామని అన్నారు. ఎడ్యూకేషన్ కిట్ కోసం రూ.1000 కోట్లు ఖర్చు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన వస్తువులు రాకపోతే తక్షణమే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. నాణ్యత లేని వస్తువులను సప్లై చేసే ఆయా కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టి చర్యలు తీసుకునే బాధ్యత తనదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూటికి నూరు శాతం మార్కులు రావాలన్నదే తన కల అని చెప్పుకొచ్చారు. టీచర్లకు మొదటి తేదీన జీతంతో పాటు మౌలిక సదుపాయలు కల్పించే బాధ్యత తనదని తెలిపారు. ప్రభుత్వ టీచర్లు బాధ్యతతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. 19 లక్షల మంది విద్యార్థుల కుటుంబాల భవిష్యత్తు ప్రభుత్వ ఉపాధ్యాయుల చేతిలో ఉందని అన్నారు. పేద తల్లిదండ్రుల కళ్లలో ఆనందం చూడాలంటే టీచర్లు ఒక గంట అదనంగా పని చేయాలని సూచించారు. తెలంగాణ విద్యావిధానాన్ని దేశానికే ఆదర్శంగా నిలబడేలా ముందుకు సాగుదామని ఉద్ఘాటించారు. విద్యాశాఖకు మంత్రి లేరని కొందరు బుర్ర లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. సమీక్షా సమయంలో తనను ముఖ్యమంత్రిగా కాకుండా విద్యాశాఖ మంత్రిగా చూడాలని సూచించారు. కావాలనే తాను విద్యాశాఖను తన దగ్గర పెట్టుకున్నానని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యను అందించి.. బాధ్యత కలిగిన పౌరులను దేశానికి అందించాలన్నదే తన ఉద్దేశమని ఉద్ఘాటించారు. త్వరలోనే విద్యా శాఖలో మరిన్ని మంచి నిర్ణయాలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తర్వాత అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు.

# మోడీ మాటలు సబబు కాదు

>> చేరుకోవడానికి కేంద్రంతో కలిసి నడుస్తామని, ఎన్నోసార్లు కలిసినా కేంద్రం నుంచి ఆశించినంత మద్దతు రాలేదని, ప్రధాని 2 గంటల పాటు సమయం ఇస్తే తమ ప్రణాళికలను వివరిస్తామని చెప్పారు. బిజెపిని బ్రిటిష్ జనతా పార్టీగా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని..అక్కడికే వస్తుందని విమర్శించారు. అయితే కాంగ్రెస్ హయాంలోనే బిజెపి ఎదిగిందని. తాము బిజెపిని ఖతం చేయలేదని, తాము ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తామన్నారు. మనుషులను చంపడం పరిష్కారం కాదని.. ముస్లింలు, మావోయిస్టులు కూడా ఈ దేశ భాగస్వాములేనని అన్నారు. దేశంలో ఐక్యత పెంచేలా ప్రధాని మాట్లాడాలని, విడదీసేలా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని, ఇది బీజేపీ వివక్ష రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు. బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. యూరియా కేంద్రం ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం పంచాలని తెలిపారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై ఇప్పటికే మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. మహారాష్ట్ర సీఎం స్పందించేలా చూడాలని ప్రధాని మోదీకి కూడా లేఖ పంపినట్లు చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య సమస్యలు వచ్చినప్పుడు ప్రధాని పెద్దరికం వహిస్తే మంచిదని వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా కూడా చర్చలు జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# లీకేజీ కలకలం

>> యుజీ-2026 పరీక్షలో అవకతవకలకు సంబంధించి తమకు "అనుమానాస్పద సమాచారం" అందిందని, దర్యాప్తు సంస్థలకు డేటాను అందించామని ఎన్‌టీఏ పేర్కొంది. దేశంలోని అన్ని కేంద్రాలలో పరీక్ష ప్రక్రియ సాధారణంగానే కొనసాగిందని కూడా ఎన్‌టిఏ స్పష్టం చేసింది. ప్రస్తుతం దర్యాప్తు కొన సాగుతున్నట్టు విచారణ అధికారులు ప్రకటించారు. స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్(ఎస్ఓజీ) అధికారులు విచారణ చేపట్టగా రాజస్థాన్, డెహ్రాడూన్‌లలో 13 మంది అనుమానితులను అరెస్ట్ చేశారు. పరీక్షకు ముందే 400కు పైగా ప్రశ్నలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయని.. వాటిలో చాలాప్రశ్నలు నీట్ పరీక్షతో సరిపోలుతున్నాయని అధికారులు తేల్చారు. అందులోని 100కు పైగా జీవశాస్త్ర, రసాయనశాస్త్ర ప్రశ్నలు.. పరీక్షకు సారూప్యంగా ఉన్నాయని ఎస్ఓజీ అధికారులు ప్రకటించారు.

# తెలంగాణకు ప్రమాదం

>> లేఖ రాశారు. ఫేజ్-2లో 45.72 మీటర్ల పూర్తి నీటి మట్టం వరకు నీటిని నిల్వ చేయాలనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలు తెలంగాణలో ముంపుతోపాటు వరద ప్రభావిత సమస్యలను మరింత పెంచే ప్రమాదం ఉన్నదని లేఖలోపేర్కొన్నారు. ముఖ్యంగా భద్రాచలం, మణుగూరు ప్రాంతాలతోపాటు కిన్నెరసాని, ముర్రేడు వాగుల పరివాహక ప్రాంతాల్లో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, గోదావరి జల వివాద ట్రైబ్యునల్ (జిడబ్ల్యూడిటి) నిబంధనల ప్రకారం ముందుగా సంయుక్త సర్వే చేసి, ముంపు ప్రాంతాల గుర్తింపు, రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎపి చర్యలతో తెలంగాణలో 954 ఎకరాలకు పైగా ముంపు ప్రభావం ఉండే అవకాశం ఉందని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

అదేవిధంగా.. గోదావరిలో కలిసే 36 వాగులు, స్థానిక ప్రవాహాలపై బ్యాక్‌వాటర్ ప్రభావం, వరద జలాల నిల్వ సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తికాకముందే ఫేజ్-2 పనులు చేపట్టొద్దని పిపిఎను టి. ఈఎన్‌సి డిమాండ్ చేశారు. గతంలో నిలిపివేసిన పోలవరం లిఫ్ట్ స్కీమ్ పనులను కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, సెంట్రల్ వాటర్ కమిషన్, పిపిఎ అనుమతులు లేకుండా మళ్లీ ప్రారంభిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. 2021-22లోనే ఈ పనులు నిలిపివేయాలని కేంద్రం ఆదేశించిందని గుర్తుచేశారు. పోలవరం ప్రాజెక్టు అంతర్రాష్ట్ర అంశాలతో ముడిపడి ఉందని, ఒక భాగంలో మార్పులు చేస్తే ఇతర అంశాలపై ప్రభావం ఉంటుందని కేంద్ర జలశక్తిశాఖ ఇప్పటికే ఎపి ప్రభుత్వానికి తెలిపిందని లేఖలో టి. ఈఎన్‌సి ప్రస్తావించారు. ముంపు ప్రాంతాల గుర్తింపు, రక్షణ చర్యలు పూర్తయ్యే వరకు పోలవరం ఫేజ్-2 పనులు, లిఫ్ట్ స్కీమ్ పనులు చేపట్టకుండా ఆంధ్రప్రదేశ్‌ను నియంత్రించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

## వారం - వర్జ్యం

12-05-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
దశమి మ.2.46
పూర్వాభాద్ర రా.1.13
వర్జ్యం : ఉ.7.46-ఉ.9.21
దు.ఉ.8.11-ఉ.9.02, 2) రా.11.38-రా.12.29
శుభసమయం : ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** బాధ్యతల వెనుక ఉన్న క్లిష్టమైన సమస్యలు ఒక్కొక్కటిగా మీ ముందుకు వస్తాయి. వాహన యోగం కలదు.

**వృషభం:** సంతాన పురోగతిపై పునః పరిశీలన చేసి కొన్ని కొత్త నిర్ణయాలు అమలు చేస్తారు. కుటుంబ గౌరవానికి హాని ఉండదు.

**మిథునం:** ప్రతిష్ఠ పెరుగుతుంది. కొనుగోలు, అమ్మకాలు విషయాలు లాభిస్తాయి. అప్రయత్నంగా పనులు పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** కొద్దిపాటి ఒడిదుడుకులు మినహా ఈ రోజు సాఫీగా సాగుతుంది. ఆప్తుల నుండి శుభవార్తలు అందుకుంటారు.

**సింహం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా వుంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**కన్య:** కుటుంబ విషయములో ఇతరుల జోక్యం అధిక మౌతుంది. పోటీ పరీక్షలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు.

**తుల:** ఓర్పు బాగా అవసరము. ఋణ యత్నము ఫలిస్తుంది. మీకు రావలసిన ప్రతిఫలము కొద్దికొద్దిగా చేతికి అందుతుంది.

**వృశ్చికం:** విదేశీ వస్తువుల ఆకర్షణనుండి బయట పడుటకు జాగ్రత్త వహించండి. స్థిరాస్తి విషయములో ఒక నిర్ణయమునకు వస్తారు.

**ధనుస్సు:** శ్రేయోభిలాషుల సలహాలు సంప్రదింపులు పాటించడం మంచిది. స్వయంగా వాహనాలు నడపకపోవడం మంచిది.

**మకరం:** చికాకులు ఉన్నప్పటికీ బాధ్యతలు సక్రమంగా నిర్వహించ గలుగుతారు. సంఘంలో గౌరవ మర్యాదలు పొందుతారు.

**కుంభం:** అస్తవ్యస్తంగా ఉన్న చాలా వ్యవహారాలను మీ ప్రతిభతో అనుకూలంగా మలచుకుంటారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**మీనం:** శుభకార్యములకు బహుమతులకు చందాలను, ధనమును అధికంగా ఖర్చు చేయవలసి వస్తుంది. మిత్రుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ అమృతోత్సవాలలో పాల్గొన్న ప్రధాని మోడీ

# భారత్ తలవంచదు

>> ప్రతీక అని అన్నారు. "జై సోమనాథ్", "హర హర మహాదేవ్" నినాదాలతో తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ, "ప్రభాస్ పటాన్ ప్రాంతం ఒక ప్రత్యేకమైన ఉత్సాహంతో నిండిపోయింది. దైవిక కాంతితో వెలిగిపోతోంది" అని కొనియాడారు. "ఈ మహాదేవుని ఈ దివ్య సాన్నిధ్యం, ఈ సౌందర్యం, భూమి, ఆకాశం నుండి కురుస్తున్న పుష్ప వర్షం, కాషాయ జెండాల కాంతి, కళ, సంగీతం, నృత్యాల అద్భుత ప్రదర్శనలు, వేద మంత్రాల పఠనం, గర్భగుడిలో నిరంతరం జరుగుతున్న శివ పంచాక్షరీ పారాయణం, వీటన్నిటితో పాటు సముద్రపు అలల ఘోష... సృష్టి అంతా ఏకమై "జై సోమనాథ్! జైజై సోమనాథ్" అని పలుకుతున్నట్లు అనిపిస్తోంది!" అని ప్రధాని మోడీ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. భారత ఆధ్యాత్మిక శక్తి, సాంస్కృతిక చైతన్యాన్ని ఈ అమృతోత్సవం ప్రతిబింబిస్తుందని అన్నారు. పునర్నిర్మించిన ఆలయంలో మహాదేవుని ప్రతిష్ఠ జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగిందని, ఇది 'వెయ్యేళ్ల అమరత్వ ప్రయాణాన్ని' ప్రతిబింబిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

"తన మూలాలకు కట్టుబడి ఉంటూనే, ఆధునికత శిఖరాలను చేరుకోవడానికి సిద్ధంగా ఉండే భారతదేశాన్ని నిర్మించాలనే సంకల్పానికి సోమనాథ్ అమృత్ మహోత్సవం ప్రతీక" అని అన్నారు.

"సత్యాన్ని అణచివేయవచ్చు కానీ తుడిచివేయలేమని ఈ సోమనాథ్ ఆలయం మనకు బోధిస్తుంది. విశ్వాసాన్ని సవాలు చేయవచ్చు కానీ ఓడించలేము" అని ఆయన వ్యాఖ్యాంచారు. పవిత్ర పుణ్యక్షేత్రం వారసత్వానికి గుర్తుగా ఒక స్మారక తపాలా బిళ్లను, నాణేన్ని కూడా విడుదల చేశారు.

**పోఖ్రాన్ అణు పరీక్షల ప్రస్తావన**

1998లో భారతదేశం నిర్వహించిన పోఖ్రాన్ అణు పరీక్షలను దేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం అనుసంధానించారు. పోఖ్రాన్ అణు పరీక్షల వార్షికోత్సవం సోమనాథ్ వేడుకలతో ఒకే సమయంలో రావడం విశేష ప్రాముఖ్యతను కలిగి ఉందని ప్రధాని మోడీ అన్నారు. "ఈ రోజు మరొక కారణం వల్ల కూడా ప్రత్యేకమైనది. సరిగ్గా ఇదే రోజున, అంటే 1998 మే 11న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో ప్రోఖ్రాన్-2 పేరుతో అణు పరీక్షలను నిర్వహించింది" అని పేర్కొన్నారు. "మన శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు భారతదేశ బలాన్ని, సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ప్రపంచవ్యాప్తంగా అలజడి రేగింది. ప్రపంచ అగ్రరాజ్యాలు వ్యూహరచన చేయడం ప్రారంభించాయి. అనేక ఆంక్షలు విధించబడ్డాయి, ఆర్థిక అవకాశాలకు దారితీసే అన్ని మార్గాలూ మూసివేయబడ్డాయి" అని ఆయన అన్నారు. ఈ పరీక్షల తర్వాత భారతదేశం తీవ్రమైన అంతర్జాతీయ ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, రెండు రోజుల తర్వాత అదనపు అణు పరీక్షలను నిర్వహించి ముందుకు సాగిందని ప్రధానమంత్రి తెలిపారు. "మే 11న శాస్త్రవేత్తలు తమ పనిని పూర్తి చేశారు, కానీ మే 13న మరో రెండు అణు పరీక్షలు నిర్వహించబడ్డాయి. భారతదేశ రాజకీయ సంకల్పం ఎంత దృఢమైనదో అప్పుడు ప్రపంచం గ్రహించింది" అని ఆయన అన్నారు. "ఆ సమయంలో, ప్రపంచం మొత్తం భారతదేశంపై ఒత్తిడి తెస్తోంది. కానీ అటల్ జీ నాయకత్వంలో, మాకు దేశమే సర్వస్వం అని బిజెపి ప్రభుత్వం నిరూపించింది. ప్రపంచంలో ఏ శక్తి కూడా భారతదేశాన్ని తలవంచేలా చేయలేదు, లేదా ఒత్తిడికి లొంగేలా బలవంతం చేయలేదు. "శివుడితో పాటు శక్తిని ఆరాధించడం ఎప్పటి నుంచో మన సంప్రదాయంగా వస్తోందని, అందుకే ఈ అణు పరీక్షలకు "ఆపరేషన్ శక్తి" అని పేరు పెట్టారని ప్రధాని మోడీ తెలిపారు. "అర్ధనారీశ్వరుడైన శివుడు కూడా శక్తితోనే పరిపూర్ణమవుతాడు" అని ఆయన అన్నారు. ఈ అంశాన్ని భారతదేశ చంద్రయాన్ యాత్రతో కూడా ప్రధానమంత్రి అనుసంధానించారు. "చంద్రయాన్ యాత్ర విజయవంతమైనప్పుడు, చంద్రునిపై భారతదేశ రోవర్ దిగిన ప్రదేశానికి "శివ శక్తి పాయింట్" అని పేరు పెట్టడం మీకు గుర్తుండే ఉంటుంది" అని ఆయన అన్నారు. "ఎందుకంటే మన విశ్వాసంలో, చంద్రుడు శివునితో, శివుడు శక్తితో ముడిపడి ఉన్నారు. ఈ జ్యోతిర్లింగాన్ని సోమ అంటే చంద్రుడు అనే పదం నుండి సోమనాథ్ అని పిలవడం ఎంత ఆహ్లాదకరమైన విషయం. "శివశక్తి" తత్వం భారతదేశ శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉండాలని ప్రధాని మోడీ అన్నారు. "శివశక్తి ఆరాధన అనే ఈ తత్వం దేశ శాస్త్రీయ పురోగతికి స్ఫూర్తినిస్తూనే ఉండాలి" అని ఆయన అన్నారు. ఆపరేషన్ శక్తి వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పరీక్షలను భారతదేశ సంకల్పానికి, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తికి నిదర్శనంగా అభివర్ణించారు. 1951లో పునర్నిర్మించిన ఆలయ ప్రారంభోత్సవానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమనాథ్ అమృత్ మహోత్సవ వేడుకల్లో భాగంగా, ప్రధాని మోడీ సోమవారం సోమనాథ్ ఆలయంలో కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన సూర్య కిరణ్ ఏరోబాటిక్ బృందం ప్రదర్శించిన వైమానిక ప్రదర్శనను వీక్షించారు.

# బైక్ రేసర్ల రాక్షస క్రీడ

>> మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. హైదరాబాద్‌కు చెందిన యువకులు స్పోర్ట్స్ బైక్‌పై అత్యంత వేగంగా ప్రయాణిస్తూ మహబూబ్ నగర్ బైపాస్ రోడ్డులో రేసింగ్ చేస్తున్న సమయంలో ఎదురుగా వెళ్తున్న కారును ఢీకొట్టారు. ప్రమాద సమ యంలో బైక్ సుమారు 140 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఢీకొన్న ప్రభావం అంత తీవ్రంగా ఉండటంతో బైక్ పూర్తిగా ధ్వంసమై, కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మహబూబ్నగర్ పట్టణంలోని ప్రేమ్ నగర్ కు చెందిన ఒకే కుటుంబం బైపాస్ రోడ్డులోని పిస్తా హౌస్ వద్ద బర్త్‌డే పార్టీ ముగించుకొని అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో ప్రేమ్ నగర్ కు వెళ్లేందుకు బైపాస్ రోడ్డు మార్గాన బయలుదేరారు. బైపాస్ రోడ్డు లోని పాలకొండ జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో హైదరాబాద్ కు చెందిన యువకులు స్పోర్ట్స్ బైక్ తో అతివేగంగా వచ్చి కారును వెనుక భాగంలో ఢీ కొట్టారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన అర్షియా బేగం (30), ఉజేఫ్ (7), చిన్నారి అమర్ (2) అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే బైక్‌పై ఉన్న హైదరాబాద్‌కు చెందిన యువకులు యాకుబ్ (25), అవేజ్ కూడా ప్రాణాలు కోల్పోయాడు. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో బైపాస్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డుపై రాత్రివేళల్లో యువకులు తరచూ బైక్ రేసింగ్‌లు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



న్యూఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో పశ్చిమ ఆసియాపై ఏర్పాటైన మంత్రుల బృందం సమావేశంలో ప్రసంగిస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్. చిత్రంలో కేంద్ర మంత్రులు నడ్డా, రామ్మోహన్‌నాయుడు తదితరులు

# ధాన్యం కొనుగోళ్లు నత్తనడక

>> లోడింగ్ చేసి మిల్లులకు తరలిస్తున్నారు. తూకాలు వేసిన బస్తాలు కేంద్రాల్లోనే పేరుకుపోతున్నాయి. ధాన్యం సేకరణలో సమస్యలు పరిష్కరించాలని కర్షకులు రోడ్డెక్కుతున్నా ఫలితం లేకుండాపోతోంది. రాష్ట్రంలో ఈ యాసంగిలో దాదాపు 8500కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనూ కొనుగోళ్లు సక్రమంగా సాగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో కల్లాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయి. దీంతో రైతులు అనివార్య పరిస్థితుల్లో సమీపంలోని రహదారులపై ధాన్యం ఆరబోయాల్సి వస్తోంది. రహదారులపై ధాన్యం ఆరబోసి, రాశిపోసినా తూకం వేయడంలో విపరీతంగా జాప్యం జరుగుతుండడంతో రోడ్లపైనే ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి. రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులను పోలిసులు వేధిస్తుండడంతో అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. రోడ్డుపై ధాన్యం ఆరబోసిన రైతులపై మహబూబ్‌నగర్ పోలిసులు కేసులు కూడా నమోదు చేస్తుండడం గమనార్హం. అదే సమయంలో అకాల వర్షాల భయంతో పగలు, రాత్రి ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెలరోజులు వేచి చూసినా కొనుగోలు చేయని దుస్థితి నెలకొంది. జాప్యం కారణంగా వడ్లు బాగా ఎండి బరువులో తేడాలొస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో రైతులు చేసేదేమి లేక మిల్లర్లను, ప్రయివేటు వ్యాపారులకు నేరుగా ధాన్యాన్ని అమ్మాల్సిన పరిస్థితులు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే మిల్లర్లకు ఏజెంట్లుగా మారినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల ఆశక్తత, వాతావరణ మార్పులను ఆసరగా చేసుకుంటున్న వ్యాపారులు, మిల్లర్లు నిలువుదోపిడికి పాల్పడుతున్నారు. క్వింటా వడ్లను రెండు కిలోల తరుగు చొప్పున కేవలం రూ.1,300కే కొనుగోలు చేస్తూ రైతులను నిండా ముంచుతున్నారు. ఇక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించిన రైతులను తరుగుపేరిట మిల్లర్లు దోచుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో తరుగు పేరిట కోతలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నా తరుగు తీస్తేనే కాంటాలు వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మరోవైపు పలు కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగుల కొరత ఉంది. బస్తాలు లేకపోవడంతో తూకం ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. ఓ అకాల వర్షాలు రైతులను భయపెట్టిస్తుంటే గన్నీ సంచులు అందుబాటులో లేకపోవడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. తేమ శాతం విషయంలో కూడా మిల్లర్లు కొర్రీలు పెడుతున్నట్లు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో ఎలాంటి తరుగు తీయవద్దని మంత్రులు, కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులు చెప్పినా మిల్లర్లు లెక్క చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ యాసంగి సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 25 లక్షలు సేకరించింది. అందులో 9 లక్షల మెట్రిక్ టన్నులు సన్నధాన్యమని అధికారులు చెబుతున్నారు. ఇక మిగతా 16 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకాన్ని కొనుగోలు చేసింది. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటాకు రూ.2,389, కామన్ గ్రేడ్ ధాన్యాన్ని రూ.2,369 చొప్పున కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ కూడా ఇస్తామని చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,575 కొనుగోలు కేంద్రాలకు అందుబాటులోకి తీసుకురాగా జూన్ 30 వరకు ధాన్యం కొనుగోళ్లు జరిగేలా ఏర్పాట్లు చేసింది. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కర్షకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# విచారణకు సిట్

>> అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిసిపి రితిరాజ్ మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసుకు సంబంధించి సర్కారు నియమించిన సిట్‌కు బాస్‌గా వున్న నేపథ్యంలో తాను పోలీసు స్టేషన్‌కు వచ్చి అన్ని వివరాలను పరిశీలించానని, దీనికి సంబంధించి స్థానిక అధికారులతో మాట్లాడానని తెలిపారు. ఈ కేసులో బాలిక వాంగ్మూలం నమోదు చేస్తామని, ఆమె తల్లిదండ్రులను వి చారిస్తామని తెలిపారు. ఒకవేళ ఫోక్సో కేసులో సాయి భగీరథ్ దోషిగా తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని డిసిపి వెల్లడించారు. చట్టం ముందు అందరు సమానమేనని ఆమె వెల్లడించారు. ఈ కేసులో అన్ని కోణాల్లో విచారణ వుంటుందని, సాక్షుల వాంగ్మూలం వుంటుందని ఆ మె వెల్లడించారు. ఈ కేసు విచారణ పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువు అంటూ ఏమీలేదని, వీలైనంత త్వరలో దర్యాప్తు పూర్తి చేసి ఉన్నతాధికా రులకు నివేదిక సమర్పిస్తానని డిసిపి రితిరాజ్ తెలిపారు. పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసును మా త్రమే తాను విచారిస్తానని, ఈ కేసుకు సంబంధించి మాత్రమే సిట్ ఏర్పాటయ్యిందని, ఇదే సమయంలో బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్, నిర్మల్‌లో నమోదైన మరో రెండు కేసులు దీనితో సంబంధం వుంటే పరిశీలిస్తామని డిసిపి తెలిపారు.

**ఫోక్సో కేసు విచారణకు సిట్ ఏర్పాటు**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసు విచారణకు సిట్ ఏర్యాటయ్యింది. ఈ మేరకు డిజిపి సి.వి ఆనంద్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసుకు సంబంధించి అంతకు ముందు సిఎం రేవంత్ రెడ్డి, డిజిపి ఆనంద్‌తో సచివాలయంలో భేటీ అయి విస్తృతంగా చర్చించారు. ఈ కేసుపై ఇంతవరకు ఎందుకు విచారణ చేబట్టలేదని, కేసు విచారణలో జాప్యం జరగడం వల్ల ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయని సిఎం అస ంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి ఆనంద్ బదులిస్తూ ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో పోలీసులు బిజీగా వుండడం వల్ల విచారణ కొంత ఆలస్యం అయ్యిందని తెలిపారు. దీనిపైనా సిఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారని తెలిసింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా వెంటనే విచారణ ప్రా రంభించి ఇందులోని నిజానిజాలను వెలికి తీయాలని డిజిపి ఆనంద్‌ను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సిఎం ఆదేశాల దరిమిలా సాయి భగీ రథ్‌పై నమోదైన ఫోక్సో కేసు విచారణకు సిట్‌ను ఏర్పాటు చేస్తూ డిజిపి ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సిట్‌కు అధిపతిగా కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్‌ను నియమించారు. ఆమెతో పాటు పేట్ బషీరాబాద్ ఎసిపి, ఇన్‌స్పెక్టర్, మహిళా ఇన్‌స్పెక్టర్ తదితరులు ఇందులో సభ్యులుగా వున్నా రు. ఈ కేసులో బాధిత బాలిక వాంగ్మూలాన్ని మరోసారి నమోదు చేయాలని, దీంతో పాటు ఆ బాలికపట్ల సాయి భగీరథ్ అసభ్యకరంగా ప్రవ ర్తించినట్లుగా చెబుతున్న చేవెళ్లలోని ఆలూరు వద్ద గల ప్రైవేటు ఫాం హౌస్‌ను సిట్ సందర్శించనుంది. గత డిసెంబర్ 31వ తేదీన నూతన స ంవత్సర వేడుకల సందర్భంగా జరిగిన పార్టీలో పాల్గొన్న వారిని కూడా సిట్ విచారించనుంది. దీంతో పాటు ఫాం హౌస్‌లో వున్న సిసి ఫుటే జిలను పరిశీలించి, ఒకవేళ ఫుటేజిలు అందుబాటులో వుంటే వాటిని జప్తు చేయనుంది. ఫాం హౌస్ నిర్వాహకులను, నూతన సంవత్సర వేడు కలు జరిపిన వారిని కూడా సిట్ విచారించి వారి వాంగ్మూలం తీసుకోనుంది. దీని తరువాత నిందితుడుగా వున్న సాయి భగీరథ్‌ను విచారించడ ంతో పాటు బాధిత బాలిక, ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్‌లో సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసు వివరాలను కూడా సిట్ విచారి ంచనుంది. దీని తరువాత బాధిత బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై నిర్మల్ జిల్లాలలో నమోదైన మరో కేసు వివరాలను కూడా సిట్ సేకరించనుంది. ఈ కేసులో ఫిర్యాదిదారులను కూడా సిట్ విచారించనుంది. ఈ కేసును అన్ని కోణాల్లో విచారించిన తరువాత సిట్ బృందం డిజిపికి నివేదిక ఇవ్వనుంది.

**స్పందించిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్**

మరోవైపు సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసుపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. కమిషన్ ఛైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి ఈ ఘటనకు సంబంధించి సైబరాబాద్ పోలీసుల నుంచి ఆమె వివరాలు తెప్పించుకున్నారు. ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేశారు.

12-5-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 101
పేజీలు: 8+16 వెల: 6.50
WWW.VAARTHA.COM
epaper.vaartha.com

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

విబిజి రామ్‌జీ చట్టం జూలై 1 నుంచి అమలు
నేడు అసోం సిఎంగా హిమంత ప్రమాణం 5


సోమవారం సోమనాథ్ అమృతోత్సవాలలో ప్రధాని మోడీ

స్టాలిన్‌తో సిఎం విజయ్ భేటీ
మాజీ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్త సిఎం సాదర ఆహ్వానంతో సత్కరించిన డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్



8 'కేరళ సిఎం'పై కాంగ్రెస్‌లో తెగని పంచాయతీ



# ఇక కొత్త విద్యావిధానం

## వచ్చే యేడాది విద్యకు 15% నిధులు పెంచుతా
## కుల వివక్ష నిర్మూలనకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు
## 500 మంది టీచర్లను విదేశాలకు పంపుతాం
## విద్యా వారోత్సవాలను ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి
## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన


సోమవారం హైదరాబాద్‌లో యంగ్ ఇండియా ఇంటెగ్రేటెడ్ స్కూళ్లకు శంకుస్థాపన చేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు పొంగులేటి, వివేక్, శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, పొన్నం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే11:** తెలంగాణలో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తామని, ప్రభుత్వ విద్యలో తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబట్టడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. దేశానికి ఆదర్శంగా నూతన విద్యావిధానం ఉండాలన్నదే తమ ప్రయత్నమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రవేశపెడుతున్నామని వివరించారు. పదోతరగతి పాస్ అయిన తర్వాత ఇంటర్‌లో డ్రాపౌట్స్ పెరుగుతున్నాయని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉందని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎల్‌బి స్టేడియంలో రూ.1011 కోట్లతో క్యూర్ ప్రాంతంలో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. విద్యాశాఖ స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం సిఎం ప్రసంగిస్తూ ఈనెల 17వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా విద్యావారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని, టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్ల పది తర్వాత డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్ల బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని, కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. అవుటర్‌రింగ్ రోడ్డు లోపల విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కోసం రూ.1700 కోట్లతో అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.1969 తొలి తెలంగాణ ఉద్యమం, 2009 మలి తెలంగాణ ఉద్యమంలో యూనివర్శిటీల విద్యార్థులు ఉవ్వెత్తున ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని ప్రస్తావించారు. తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, నిధులు, నియామకాలు, రాజకీయ ప్రాతినిధ్యంపైన ఉస్మానియా, కాకతీయ విద్యార్థులు ఉద్యమ బాటన నడిచారని గుర్తు చేశారు.యూనివర్శిటీలు, విద్యను నిర్లక్ష్యంచేస్తే తెలంగాణ సమాజం బలహీనపడుతుందని అన్నారు. పేదలకు న్యాయమైన విద్య, సాంకేతిక నైపుణ్యాన్ని అందించడం తమ ప్రభుత్వ బాధ్యత అని వ్యాఖ్యానించారు.. తెలంగాణలోని తండాలు,గూడాలు, మారుముల గ్రామాల్లోని పేదలు, దళితులు, గిరిజనులకు విద్యను అందించాలని విద్యాశాఖను తనదగ్గరే ఉంచుకుని అడుగులు ముందుకు వేస్తున్నామని తెలిపారు. 11,000 ఉపాధ్యాయ నియామకాలను 60 రోజుల్లో పూర్తిచేశామని పేర్కొన్నారు. 22 వేల టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చాం. టీచర్ల బదిలీలు అంత ఆషామాషీ కాదని, 36 వేల మంది ఉపాధ్యాయుల బదిలీలు ఎలాంటి వివాదం లేకుండా చేశామని వివరించారు. నీతి ఆయోగ్ విద్యాశాఖలో మన రాష్ట్రం సాధించిన విజయాలను అభినందించిందని చెప్పారు. విద్యాశాఖ ఉద్యోగులు, టీచర్లను అభినందిస్తున్నానని అన్నారు. 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 19 లక్షల పేద విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. >>2

# భారత్ తలవంచదు

## దేశ అభేద్య స్ఫూర్తికి సోమనాథ్ ప్రతీక
## మన 'ఆపరేషన్ శక్తి' దుర్భేద్యం
## పోఖ్రాన్ అణు పరీక్షలతో భారత్ శక్తి ప్రపంచానికి వెల్లడి
## సోమనాథ్ అమృతోత్సవాలలో 'మహాపూజ'లు నిర్వహించిన ప్రధాని మోడీ
## ప్రత్యేక పోస్టల్ స్టాంప్, నాణెం విడుదల

**గిర్ సోమనాథ్(గుజరాత్), మే 11:** గుజరాత్‌లోని ప్రభాస్ పటాన్‌లో సోమవారం నిర్వహించిన "సోమనాథ్ అమృత్ మహోత్సవ్" వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, సోమనాథ్ ఆలయాన్ని భారతదేశపు "అభేద్య స్ఫూర్తికి" "నాగరిక చైతన్యానికి" ప్రతీకగా అభివర్ణించారు.శతాబ్దాలుగా విధ్వంసాలు, దండయాత్రలు ఎదురైనా పదేపదే పుంజుకునే దేశ సామర్థ్యానికి ఈ ఆలయం >>2


బండి భగీరథ్ పోక్సో కేసు విచారణ నిమిత్తం పేట్ బషీరాబాద్ స్టేషన్‌కు వచ్చిన సిట్ డిసిపి రితి రాజ్

# బండి భగీరథ్ కేసు విచారణకు సిట్

## భగీరథ్ దోషిగా తేలితే చర్యలు: సిట్ బాస్ రితిరాజ్

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు విచారణకు సర్కారు నియమించిన సిట్ దర్యాప్తు మొదలు పెట్టింది. ఈ కేసు విచారణకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం మధ్యాహ్నం కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్‌ను సిట్ బాస్‌గా డిజిపి ఆనంద్ నియమించారు. వెనువెంటనే దీనికి సంబంధించిన ఆదేశాలు వెలు వడ్డాయి. దీని తరువాత డి సిపి రితిరాజ్ తన బృందంలో వున్న అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సాయి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసు ఫైల్‌ను తెప్పించుకుని అందులోని వివరాలను పరిశీలించారు. ఈకేసు విచారణాధికారిగా వున్న పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్‌తో పాటు స్థానిక ఎసిపి శంకర్ రెడ్డి, ఇతర అధికారులతో డిసిపి రితిరాజ్ భేటీ అయి కేసు పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుగా వున్న మైనర్ బాలిక తల్లిదండ్రుల వివరాలను, బాలిక వివరాలను డిసిపి >>2

# మోడీ మాటలు సబబు కాదు



## దేశంలో ఐక్యత పెంచేలా ప్రధాని మాట్లాడాలి
## 'సర్'ను బిజెపి ఆయుధంగా వాడుతోంది
## విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలం
## ముస్లింలు, మావోయిస్టులు కూడా దేశ ప్రజలే
## తెలంగాణ కోసం కేంద్రంతో సమన్వయం తప్పనిసరి: మీడియాతో సిఎం రేవంత్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే11:** రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని వ్యాఖ్యానించారు. సోమవారం జూబ్లీ హిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్ వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిరక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు.2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.విజన్ 2047... 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాలను >>2

# నీట్ ప్రశ్నపత్రం లీకేజి కలకలం

## పరీక్షకు ముందు రాజస్థాన్‌లో గెస్ పేపర్ పేరుతో పంపిణి
## కొనసాగుతున్న విచారణ, 13 మంది అనుమానితుల అరెస్టు



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 11:** ఈనెల 3న జరిగిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) యుజీ-2026 ప్రశ్నాపత్రం ముందుగానే లీకేజీ వ్యవహారం కలకలం సృష్టిస్తోంది. మే 3న జరిగిన నీట్ (యూజీ) 2026 పరీక్షకు ముందే మే 1న ఒక "గెస్ పేపర్" పేరుతో రాజస్థాన్‌లో ప్రశ్నాపత్రం బయటికి రావడంపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ గెస్ పేపర్‌లో అసలు ప్రశ్నపత్రంలోని సుమారు 140 ప్రశ్నలు సరిపోలి ఉన్నాయి. దీంతో మే 3న నిర్వహించిన నీట్ ప్రశ్నాపత్రం ముందుగానే పేపర్ లీక్ అయిందన్న ఆరోపణలపై రాజస్థాన్ పోలీస్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ దర్యాప్తు చేస్తోంది. గెస్ పేపర్‌లో సుమారు 140 ప్రశ్నలు అసలు ప్రశ్నపత్రంతో సరిపోలాయి. ఈ అంశంపై విచారనకు తమ సహకరిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) దర్యాప్తు అధికారులకు స్పష్టం చేసింది. "గెస్ పేపర్" రాజస్థాన్‌లోని సికార్‌లో మే 1న ప్రచారంలోకి వచ్చిందని, దీనిని రూ.20వేల నుంచి రూ.5 లక్షల వరకు ధరలకు విక్రయించారనే ప్రచారం జరుగుతోంది. మే 3న జరిగిన అసలు నీట్ (యూజీ) 2026 పేపర్‌లోని 720 మార్కులకు గాను 600 మార్కులకు సమానమైన సుమారు 140 ప్రశ్నలు ఆ పేపర్ ద్వారా వ్యాప్తిచెందినట్లు విచారణ అధికారులు అనుమానిస్తున్నారు. ఇప్పటి వరకు రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లలో సోదాలు నిర్వహించారు. పరీక్ష జరిగిన నాలుగు రోజుల తర్వాత నీట్ >>2

బంగ్లాదేశ్‌తో సరిహద్దు కంచె 8
బెంగాల్ సిఎం సువేందు

# బైక్ రేసర్ల రాక్షస క్రీడ


మహబూబ్‌నగర్‌లో ప్రమాదానికి గురైన కారు, స్పోర్ట్స్ బైక్

## కారును ఢీకొన్న స్పోర్ట్స్ బైక్‌లు
## ఓ కుటుంబంలోని ఐదుగురు దుర్మరణం
## మృతుల్లో ఇద్దరు చిన్నారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 11 ప్రభాతవార్త:** బైక్ రేసర్ల రాక్షసక్రీడకు ఓ కుటుంబం బలైంది. అతివేగంతో నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతో ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిన ఘటన >>2



# పోలవరం లిఫ్ట్‌తో తెలంగాణకు ప్రమాదం

## ప్రాజెక్ట్ అథారిటీకి ఇఎన్‌సి లేఖ

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** పోలవరం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ విషయమై తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్‌సి రమేశ్‌బాబు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పిపిఎ) సిఇఒకు తాజాగా >>2

# ధాన్యం కొనుగోళ్లు నత్తనడక

## లక్ష్యం 90లక్షల మెట్రిక్ టన్నులు
## నెల రోజులుగా సేకరణ 30 శాతమే
## కొనుగోలు కేంద్రాలు, రహదారులపై ధాన్యం రాశులు



## తీవ్రంగా వేధిస్తున్న లారీలు, గోనె సంచుల కొరత

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** ఆరుగాలం కష్టపడి పండించిన యాసంగి వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా సకాలంలో కొనుగోళ్లు జరగకపోవడం, గోనె సంచుల కొరత కారణంగా ధాన్యాన్ని రాశులుగా పోసి రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు రైతులు ఎదుర్కొంటున్నారు. నిబంధనల మేరకు 17శాతం వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబోసి రాశిపోసి పక్షం రోజులు గడుస్తున్నా తూకం కావడం లేదు. ఒకవేళ తూకం అయినా లోడింగ్‌కు మరో 15 రోజులు పడుతోందని అన్నదాతలు వాపోతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు ఇదిగో వస్తున్నాయి, అదిగో వస్తున్నాయి అని చెబుతూ కాలం వెళ్లదీయడమే తప్ప క్షేత్రస్థాయి అధికారులు కొనుగోళ్లను వేగిరం చేసే చర్యలకు ఉపక్రమించడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఐకేపీ కేంద్రాల్లో లారీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. రోజుకు ఒక్కటెండు లారీలు మాత్రమే >>2

వార్త

ఇద్దరి మధ్య వైరం సంభవించిందంటే అందుకు వారిలో ఒక్కరే కారణం కావచ్చు. కాని అది దీర్ఘకాలం కొనసాగిందంటే ఇద్దరూ బాధ్యులే.

-థామస్ ఫుల్లర్

# దేశహితమే సమ్మతం!


నిన్నటివరకు రాజకీయ హితం గురించి మాట్లాడిన ప్రధాని మోడీ ఒక్కసారిగా తన గొంతు సవరించుకొని అభివృద్ధి సంక్షేమాల తాళింపుతో దేశహితోపదేశం చేశారు. అదీ తెలంగాణ గడ్డమీద. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభంలో ఇంధన సమకూర్పుకు ఎన్ని విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నామో ఏకరువు పెడుతూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసుకోవడమెలాగో హితవు పలికారు. నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా! అంటూనే తెలుగు ప్రజలతో మమేకమై ఎంతో ప్రియాతిప్రియమైన హితవచనాలు వారి చెవికెక్కేలా ప్రసంగాన్ని పండించారు. సంక్షోభం తలెత్తినప్పుడు దేశహితం కోసం పనిచేయడానికి ప్రతీపౌరుడు కట్టుబడి ఉండటం ఈ దేశానికి శ్రేయస్కరమన్న పలుకులు ఆయన నోటంట వినిపించాయి. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రతి భారతీయుడు సంకల్పం చెప్పుకోవాల్సిన అవసరముందని చెప్పగానే జనం జేజేలు పలికారు. ప్రపంచంలో పెట్రోలు ధరలు బాగా పెరిగాయి. వాటి కొనుగోలుపై ఖర్చయ్యే విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయాలి. ప్రస్తుతానికిది మోడీ మంత్రంగానే పనిచేస్తుంది. దేశంలో వంటనూనె కోసం పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని వ్యయపరుస్తున్నాం. నూనెల వినియోగాన్ని కనీసం పది శాతాన్ని తగ్గిస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం, దేశానికి లాభం కలుగుతుంది. మానవాళి సౌభాగ్యం కోసం పండించే 'పంట సిరి'లను కూడా అధిక ఎరువుల వినియోగం ద్వారా వృథా చేయవద్దని ఆయన అభిలాష. కొన్నిటి విషయమై శాస్త్రజ్ఞులు చెబితే ఎంత ఆతృతంగా వింటామో అంతే ఆతృతగా ప్రధాని స్వయంగా చెప్పారంటే వినని, వినిపించుకోని జనం ఉండనే ఉండరు. దేశ సౌభాగ్యానికి ప్రతీక రైతు. అలాంటి రైతు నుంచి ప్రధాని ఆశిస్తున్న అంశాలేవైనా ఉన్నాయంటే అది రసాయనిక ఎరువుల వినియోగం రెట్టింపైపోతుండగా వాటి దిగుమతులకు హెచ్చు వ్యయం జరుగుతోంది. క్షేత్రీయ అవసరాలను నియంత్రించుకుని 25, 30, 40, 45 శాతం తగ్గించుకోవాలి. రసాయనిక ఎరువులు అతిగా వాడితే పంట నాశనమౌతోంది. భూమిని కాపాడుకోవడమూ కష్టమే. అందుకే మితిమీరిన ఎరువుల వినియోగం ఆపాలి. సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారిస్తే మేలు. తద్వారా నేచురల్ ఫామింగ్‌తో భూసారాన్ని వ్యవసాయ క్షేత్రాలను, రక్షించుకోవాలని రైతుల్ని కోరారు. డీజిల్ పంపుల బదులు సోలార్ పంపుల వినియోగంపై దృష్టి పెట్టాలి. ఇంటి ఇల్లాలికి పనిపెట్టారు. విదేశీ దిగుమతులను ఆపడం ద్వారా విదేశీ మారకద్రవ్యాన్ని తగ్గించుకోవచ్చని ప్రధాని ఉవాచ. ప్రత్యేకించి మహిళలు ఒక ఏడాది పాటు బంగారు కొనుగోళ్లు ఆపేస్తే కూడా మారకద్రవ్యం నిలబడుతుందన్నారు. ఇంధన ఉత్పత్తుల విషయంలో ప్రపంచమంతటా సప్లై చైన్ ఇబ్బందులు ఏర్పడినందున పెట్రోలు, డీజిల్ వినియోగాన్ని కూడా తగ్గించుకోవడంలో సంయమనం పాటించాలి. ఉక్రెయిన్, రష్యా యుద్ధంలో ఆహారం, ఎరువులు, ఇంధనం ధరలు ప్రపంచవ్యాప్తంగా బాగా పెరిగిపోయాయి. కరోనా కారణంగా సరఫరావ్యవస్థలన్నీ చిన్నాభిన్నం అయిపోయాయి. ఇలా ప్రపంచ పరిస్థితుల్ని చెబుతూనే ప్రజల్ని కార్యోన్ముఖుల్ని చేయడం స్వాగతించదగిన విషయం. రాజకీయ ప్రసంగాన్ని ఒక్కసారిగా కట్టడిచేసి తెలంగాణలో అడుగుపెట్టగానే అభివృద్ధి గణాంకాలను వల్లె వేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చినట్లు అభివృద్ధి నిధులు కావాలంటే తెలంగాణకు పెద్దగా నిధులు సమకూరవని, గణాంకాలు మార్చుకుని 'డబుల్ ఇంజన్ అభివృద్ధి సాధించడంలో కేంద్రప్రభుత్వానికి సహకరించాలని స్థానిక ప్రభుత్వాన్ని కోరారు. గతంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై సుంకాలు రుద్దగానే ఒక్కసారిగా ప్రధాని 'స్వదేశీ నినాదాన్ని ఎత్తుకున్నారు. స్వదేశీ ఉద్యమం ఈనాటిది కాదు. కొత్తగా వచ్చింది కాకపోయినా స్వావలంబన సిద్ధాంతాన్ని, స్వయం సమృద్ధి ఆవశ్యకతను ఆయన పలికారు. ఇళ్లల్లో వాడే టూత్‌పేస్ట్, బ్రష్, దువ్వెన వంటి నిత్య వినియోగ వస్తువులు కూడా విదేశాల్నించి తెచ్చుకోవడాన్ని ఆయన నిరసించారు. అయితే వీధి గుమ్మం దాటి వంటింట్లోకి చేరిన విదేశీ వస్తు నియంత్రణకు మహిళల సహకారం ఎంతో అవసరమన్నది ప్రధానంగా చాటి చెప్పారు. స్వదేశీ అనగానే దీపావళి దివ్వెలను వాడుతున్నాం కదా! అని సరిపెట్టుకోరాదని ప్రధాని వివరించారు. తాను చెప్పినవన్నీ ప్రతి పౌరుడు, రాజకీయ పార్టీ, ప్రతిసంస్థ పాటించాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరడం విశేషం. భారత దేశాభివృద్ధిలో సంక్షోభాలను జయించడం కూడా ఒక భాగమేనన్నారు. ప్రపంచమార్కెట్‌లో ఎరువుల బస్తా రూ.3వేలు ఉండగా భారత్ కేవలం రూ.300లకే అందించగలుగుతోందని వెల్లడించారు. భారత్‌లో పెద్ద పెద్ద పెట్రోలు బావులు లేనందున దిగుమతులు తప్పడం లేదని, వాటి వలన సామాన్యులపై భారం పడకుండా కేంద్రమే భరిస్తోంది. వీటన్నిటినీ క్రోడీకరించుకుంటే విదేశీ మారకద్రవ్య నిల్వలు భారీగా తగ్గిపోతున్నందున వ్యయకర్తనం తప్పదన్నది ఆయన ఆందోళనకు కారణం. ఇంధన వినియోగం తగ్గించే పరిష్కార మార్గంలో సాధ్యమైనంతవరకు రైల్వే సరుకు రవాణాను మాత్రమే వినియోగించాలి. ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని ఆయన సూచిస్తున్నారు. ఓ యేడాదిపాటు విదేశీ పర్యటనలను ఆపేయాలి. భారత్‌లో గల అనేక పర్యాటక ప్రాంతాలను మాత్రమే సందర్శించాలి. భారత్‌ను ఆత్మనిర్భర్ కాకుండా అడ్డుకునే అన్ని అంశాల్లోనూ అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత భారతీయులదేనన్నారు. అటు పార్టీ శ్రేణులను ఎంతగా తట్టిలేపారో, ఇటు సామాన్య ప్రజానీకాన్ని ప్రధాని నరేంద్రమోడీ తన చైతన్యవంత ప్రసంగం ద్వారా స్ఫూర్తి కలిగించారు.

సంకల్పబలం ఉన్నవారు అన్నిటినీ తనకు అనుకూలంగా మలచుకోగలరు. సంకోచించే మనస్సుతో పనిచేసే వాడికి కార్యనాశనం తప్పదు.



సోక్రటీస్

సత్యమనేది మహావృక్షం లాంటిది. దానికి మనం నీళ్లుపోసి పెంచితే అది ఎన్నో పూలు, పండ్లు మనకు ఇస్తుంది.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు



### ఆచరణలేని ప్రధాని మాటలు

నిన్న హైదరాబాద్‌లో ప్రధాని మోడీ మాట్లాడుతూ ప్రజలు ఖర్చు తగ్గించుకోవాలి అని చెప్పారు. సంతోషం. ఐతే తాము చెప్పేదాన్ని ఎవరైతే ఆచరిస్తారో, వెనుకవారు అనుసరిస్తారు. చెప్పేదోకటి చేసేదోకటిగాఉంటే ఎవరూ నిన్ను అనుసరించరు. ఇది ప్రధానమంత్రి తెలుసుకోవాలి. పటేల్ విగ్రహం మూడువేల కోట్లు పెట్టి నిర్మించడం ఇప్పుడు మన పేద దేశానికి అవసరమా! ప్రధాని నిత్యం ధరించే సూటు ఖరీదు పది పదిహేను లక్షలుంటుంది. ఒక పేద దేశ ప్రధానికి అంత ఖరీదు డ్రెస్ అవసరమా? నెహ్రూ ఎంత సింపుల్‌గా ఉండేవాడు. లాల్‌బహదూర్ శాస్త్రి గారు ఎలాఉండేవాడు? నెలకు 20 రోజులు విదేశాలలో పర్యటిస్తున్నారు. అవసరమా? మనదేశప్రధానులలో ఇంతవరకు ఇన్ని విదేశ ప్రయాణాలు ఎవరూ చెయ్యలేదు. ఇదంతా దుబారాకాదా ఆచరణలేని ప్రకటనలు చెయ్యకూడదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఆప్షనల్ సబ్జెక్ట్‌గా అడ్వర్టైజింగ్

మార్కెటింగ్ వ్యవస్థలో అడ్వర్టైజింగ్ ప్రముఖ పాత్ర వహిస్తుంది. ప్రతిరోజు ప్రతి వ్యక్తి ఏదో ఒక వస్తువును వినియోగిస్తూనేఉంటాడు. ప్రతి మానవుడువినియోగదారుడే. కనుక విద్యార్థులకు ఒక ఆప్షనల్ సబ్జెక్టుగాఇంటర్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అడ్వర్టైజింగ్ సబ్జెక్టు ఉండాలి. పూర్వం డిగ్రీ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు కలిగినవారికి బోధన రంగంలో అవకాశాలు కల్పించాలి. అడ్వర్టైజ్మెంట్ సబ్జెక్టు మీద అవగాహన కల్పించాలి 2026-2027 విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

### అతివేగం ప్రమాదకరం

రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, మితిమీరిన వేగంతో వెళ్తున్న బైకులు, ఆటోలు, కార్లు తదితర వాహనాలు అన్ని ఏమాత్రం ఆలోచించకుండా అతి వేగంతో వెళ్ళడం వలన నిరంతరం ప్రమాదాలు జరుగుతూ ఇంట్లో వాళ్ళని కోల్పోతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ఏక్కడికైన వెళ్ళినప్పుడు నిదానంగా నడుపుతూ, ఇంట్లో వాళ్ళ భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ఉంటే తప్ప ప్రమాదాలనుకొంత వరకైనా నివారించే అవకాశం ఉంది. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల గురించి ఆలోచించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### పాఠశాలలు ప్రగతికి నిలయాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలలు నేడు అద్భుతమైన ప్రగతికి నిలయాలుగా మారుతున్నాయి. ఇటీవల వెలువడిన ఒక స్ఫూర్తిదాయక ప్రకటన ఈపాఠశాలలు కేవలం ప్రత్యామ్నాయాలు మాత్రమే కావు, శ్రేష్ఠమైన విద్యా కేంద్రాలని చాటి చెప్పింది. 'తల్లిలాలాలన, తండ్రిలారక్షణ, స్నేహితుడిలా బోధన' అనే నినాదం అక్కడి ఆత్మీయవాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. కేవలం వసతుల గురించి మాత్రమే కాకుండా, విద్యార్థుల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా ఈ ప్రచారం తల్లిదండ్రుల్లో గొప్పనమ్మకాన్ని కలిగిస్తోంది. నాణ్యమైన విద్యను కోరుకుంటూనే ఆర్థిక భారాన్ని మోయలేని కుటుంబాలకు ఇవి సరైన వేదికలుగా మారాయి. ఈ విద్యా విప్లవంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం. వారు విద్యార్థుల విద్యావృద్ధిని పర్యవేక్షిస్తూ, వారినిఉన్నత శిఖరాలకు చేరుస్తున్నారు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పండ్ల తోటలను పెంచాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరికి బదులుగా వేరే పంటలను ప్రోత్సహించదానికి ప్రయత్నం చెస్తుంది అనే వార్త కొంత ఆశాజనకంగా కనిపిస్తున్నది. ముఖ్యంగా 2014 లో తెలంగాణ లో 68.64 లక్షల ఎకరాలలో వరి సాగు చేస్తే ఇప్పుడు అది 1.34 కోట్ల ఎకరాలలో సాగు చేస్తున్నారు. అంటే నీటి వసతిపెరగడం ఒకవిషయం అయితే వరిసాగు తేలికగా అయిపోవడం ఒక కారణం. ఇకపోతే తెలంగాణ లాంటి రాష్ట్రంలో చిరు ధాన్యాలు సాగు చేయడానికి అనుకూలంగా వాతావసరణం ఉంటుంది. ముఖ్యంగా పండ్ల సాగు, కురగాయల సాగు కందులు పెసలు, మినుములతో సహా మిగిలిన చిరు ధాన్యాల సాగుకీ చాలా అనుకూలమైన వాతావరణం ఉంటుంది. ఇంకా తెలంగాణకు ఉండే చిన్న నీటి పారదల వ్యవస్థ ఉండడం నెల స్వభావం సహకరించడం వల్ల పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు ఉపాధి హామీకి వినియోగించాలి.

- భారత అవినాష్ ,జనగామ

### ఇంటర్ కౌన్సెలింగ్ రెమ్యూనేషన్

ఇంటర్మీడియట్ విద్య శాఖపరిధిలోఉన్న అన్నిజూనియర్ కళాశాల లెక్చరర్‌ల కౌన్సిలింగ్ రెమ్యూనేషన్ ఈవిద్యా సంవత్సరం పెంచాలి. రెగ్యులర్ లెక్చరర్ అందరికి డ్యూటీ లు వేయాలి. సరిపోకపోతే పార్ట్‌టైమ్ లెక్చరర్‌లను విని యోగించుకోవాలి. వికాకలాంగుల లెక్చరర్‌లకు తగిన వసతి కలిపించాలి. నగదు రూపంలో ఇంటర్ కౌన్సిలింగ్ రెమ్యూ నిటేషన్ ఇవ్వాలి. ఇంటర్‌కౌన్సిలింగ్‌కోసం స్పెషల్‌గాసర్క్యులర్‌జి.ఓ తీయాలి..

-రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'విజయ' ఢంకా మోగింది!

**హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారు తాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజిఆర్, ఎన్‌టిఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురు కాపులు కాస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటాయి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు.**



రావులపాటి సీతారాం రావు

తమిళనాడు ఎన్నికలు చరిత్రను తిరగరాసాయి. సినిమా నటుడు విజయ్ విజయం చారిత్రాత్మకంగా మారింది. దానికి కారణం రెండు బలమైన ద్రవిడ పార్టీలను ఎదుర్కోవటమేకాకుండా రెండు జాతీయ పార్టీలు బిజెపి, కాంగ్రెస్‌కు అంతు చిక్కని రీతిలో విజయం సాధించగలిగారు. ఆ విజయం ముఖ్యమంత్రి కుర్చీకి పది సీట్ల దూరంలో ఆగిపోవడం కూడా. మనదేశంలో పాతుకొనిపోయినపార్టీల తీరుతెన్నులను పరిపూర్ణంగా ప్రజలు అర్థం చేసుకోటానికి విధి ఇచ్చిన అవకాశంగా భావించాలేమో! కాలికి వేస్తేమెడకు, మెడకేస్తే కాలికి మెలికలు పెట్టి గవర్నర్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని వాయిదాల మీద వాయిదాలు వేయడం కూడా ఒక విధంగా దేశంలోని ప్రజలందరికీ, నామినేట్ చేయబడ్డ రాజ్యాంగ పదవిలోని వారి పనితనం తెలియచేసినట్లయింది. రామ్‌లాల్ గవర్నర్ గిరీని జ్ఞప్తికి తెచ్చే రీతిలో ఈ ఉదంతం సాగటం ఉత్కంఠను కలిగించింది కానీ ప్రజాస్వామ్యవాదులను తీవ్రంగా నిరుత్సాహపర్చింది. అసామాన్య రీతిలో డబ్బును ఎరజూపకుండా విజయ్ (చాలా ఉచితాలు ప్రకటించడం కూడా ఈ సందర్భంగా విమర్శించవచ్చు) విజయాన్ని దిగ్గజాలను ఢీకొట్టి సాధించడం చరిత్రలో నిలిచిపోతుంది. విజయం తర్వాత తరువాయి భాగం ఏవిధంగా నడుస్తుందో గొప్పగొప్ప రాజకీయ పండితులకూ, విశ్లేషకుల ఊహాలకు అందకుండా ఉండటం కూడా విడ్డూరంగానే ఉంది. 2024లో విజయ్ స్థాపించిన టి.వి.కే పార్టీ అన్యూహంగా రెండు సంవత్సరాలలోనే అధికారాన్ని చేజిక్కించుకోవటం ఇప్పుడు విశేషవార్తగా కొనియాడబడుతుండడంలో ఆశ్చర్యంలేదు. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.ఆర్ తొమ్మిది నెలల్లోనే అనూహ్యంగా రాజ్యాధికారం సంపాదించగలిగారు. ఈ రెండింటికి పోలికలు అనివార్యమని అనుకోవచ్చు. కానీ అప్పటి ఎపి పరిస్థితులువేరు, ఇప్పటి తమిళనాడు పరిస్థితులు వేరు. అప్పుడు ఎపిలో రాజకీయంగా ఖాళీ ఉంది. అంటే కాంగ్రెస్‌తో విసిగిపోయిన ఆంధ్ర ప్రజానీకం మార్పు కోసం అర్రులు చాచిన రోజులవి. ఆధిపత్య ధోరణితో ఢిల్లీ కాంగ్రెస్‌ను దర్బార్ ఇష్టమొచ్చిన రీతిలో ముఖ్యమంత్రులను మార్చి ప్రజల మనోభావాలను పట్టించుకోకపోవడం పతాకస్థాయికి చేరుకున్నప్పుడు ఎన్.టి.ఆర్ రంగప్రవేశం చేసి అప్పటికే నట సార్వభౌముడిగా సినీరంగాన్ని తిరుగులేని రీతిలో ఏలుతుండడంతోపాటు, ప్రచారంలో కొత్తపోకడలతో, చైతన్యరథంతో నవచైతన్యంతోపాటు 'పొగడరా నీ తల్లి భూమి భారతిని అనితెలుగు జాతి గౌరవాన్ని తెలుగు వారి మనోభావాలను దెబ్బతీసిన వైనాన్నినిలువెత్తు అద్దంలోహావభావాలతో డైలాగ్‌లతో చూపిస్తూ కదిలిరా అంటూ నిద్రలో ఉన్న జనాన్ని రాజకీయ రీతిలో మేల్కొల్పగలిగారు. అందువల్లే కాంగ్రెసును ప్రక్కకు నెట్టేసి ఎన్.టి.ఆర్‌కు పట్టకట్టారు. ఇప్పుడు విజయ్ పరిస్థితి రెండు పులులతోనే కాదు, కనపడని మరో అజ్ఞాత వ్యక్తితో పోరాటం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్రవిడ మనోభావాలకు నిలువెత్తు నిదర్శనమైన తమిళజాతిని ప్రాణం పోసిన డియంకే, ఎడియంకెలతోపాటు ఇతర బిజెపి, లెఫ్ట్ పార్టీలను చివరకు కాంగ్రెసును కూడా ఒక్కడంటే ఒక్కడిగా ఓడించి విజయం సాధించడం అపూర్వం. కారణాలు అందరికీ కనపడినవే. నిజాయితీకి, అవినీతిరహిత ఎన్నికలలో పాల్గొన్న విధానానికి విజయ్‌ని నిదర్శనంగా అక్కడి ప్రజలు భావించారు. పెరియార్, కామరాజ్, అంబేద్కర్‌లతో తమిళులకు ఆదర్శులైన మరో ఇద్దరు, నాయకుల వేలు నాచియార్ అంజలాయి అమ్మాల్ విగ్రహాలను ఒక వేదికపై అధిష్ఠింపచేసి, వారే తనకు ఆదర్శప్రాయులని ఆ స్థలాన్ని సందర్శిస్తూ



ఇన్నేళ్లు తమిళులకు తనేమిటో, తన విధానాలూ, ఆదర్శాలు ఆ విధంగా తెలియచెప్పారు. ప్రచారం మొదటి దశలోనే టి.వి.కె నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాటలో దాదాపు నలభైకిపైగా మృత్యువాతపడినప్పుడు ఆ సందర్భంగా అప్పటి ప్రభుత్వం కేసులే కాకుండా ప్రచారంలో ఆ సంఘటనను అస్త్రంగా మల్చుకున్నప్పుడు వెనుకడుగు వేయకుండా ప్రచార శైలిని మార్చుకొని పెద్దఎత్తున బహిరంగ సభలు నిర్వహించకుండా సోషల్ మీడియా మీద ఆధారపడకుండా, ప్రెస్‌మీట్స్ పెట్టకుండా ఎవరినీ అసభ్యకరంగా విమర్శించకుండా హుందాగా ప్రచారాలను విజయవంతంగా ముగించటం ఓటర్లను ఆకట్టుకుంది. నిజానికి 2009లోనే విజయ్ మక్కల్ ఇయ్యాకం (వి.యం.ఐ) ఒక ఆర్గనైజేషన్ స్థాపించారు. (వి.యం.ఐ) పేరిట 80వేలకుపైగా ఉన్న ఫాన్స్ అసోసియేషన్స్‌తో విజయ్ ఓటర్లలోకి చొచ్చుకొని వెళ్లగలిగాడు. 'స్టాలిన్ అంకుల్' అని హ్యూమర్‌తో డియంకే నాయకుడ్ని తిట్ల పురాణం లేకుండా ఏదైనా ఆ పిలుపుతో సద్విమర్శలకు పూనుకోవటం ఓటర్లకు ప్రచారం వీనులవిందుగా మారింది. అందరికీ కొత్తవారికే పార్టీ టికెట్లు ఇవ్వటం ధైర్యంతో కూడుకున్న పని. చివరకు తన డ్రైవర్ కొడుకును కూడా అభ్యర్థిగా ఎంచుకొని ప్రజల మనోభావాలకు ఆప్యాయతకు మరింత దగ్గరయ్యాడు. ఇవి మచ్చుకు కొన్ని కారణాలు మాత్రమే. అయినా ఇవి చాలవా ఓటర్ల హృదయాలలో స్థానం సంపాదించుకోవటమే కాకుండా పోలింగ్ బూతులకు క్యూలు కట్టడానికి ఆడవారికి ఉచితాలు కొన్ని సహేతుకంగా తోచే రీతిలో ఇస్తానని హామీ ఇవ్వటంతోపాటు విద్యార్థులకు 'మీ మామా మిమ్మల్ని అన్నివిధాలా ఆదుకుంటాడని, మీ పేరెంట్స్‌కు చెప్పి నాకు ఓటు వేయమనండి అన్న కొత్త తరహా ప్రచార నిర్వహణ సాగించటం అందర్నీ ఆకట్టుకుంది. చివరకు చిన్నారులను కూడా మీ అమ్మా, నాన్నలకు చెప్పి నాకు ఓటు వేయించండి అని విజ్ఞప్తి చేయడం వారిని కూడా ఉత్సాహంగా విజయ్‌కు చెందిన ప్రచారంలో పాల్గొనేట్లు చేసింది. అన్నిటికంటే మించినది తను హద్దులు మీరకుండా ఇతరులు హద్దు మీరటాన్ని వెలికి తీయటం! వెకిలితనం ఎక్కడా విజయ్‌లో కనపడకపోవడంతో హెచ్చుసంఖ్యలో విజయఢంకా మ్రోగించారు. టి.వి.కె పార్టీ కొత్త రకంగా ఇతర పార్టీలకు భిన్నంగా రాజకీయాలు నడపగలదని ఎన్నికల్లో 108సీట్లతో 35శాతం ఓట్ల షేర్‌తో అందరికంటే మించిన విజయాన్ని తమిళనాడులో సాధించగలిగింది. చివరకు ఎక్కడా ఎవరికీ లొంగకుండా ఓపికతో గవర్నర్ దగ్గర మాటమీరకుండా, ఇతర పార్టీలను ఈ తతంగంలో విమర్శించకుండా పట్టువదలని విక్రమార్కుడు మాదిరి ప్రతిసారీ తనకున్న ఓట్ల బలాన్ని గవర్నర్ అడిగినా అడగకపోయినా వినయంగా ప్రదర్శించటం, అతని రాజనీతిజ్ఞతతోపాటు చతురత, కృత్రిమ ఓటమని ఒప్పుకోకుండా 'జయమ్ము నిశ్చమ్మురా' అన్న ధోరణిలో హీరోలా ప్రవర్తించారు. ప్రజలకు మరింత దగ్గరగా ఆ వైఖరి విజయ్‌ను చేర్చింది. ఇప్పుడు అసలు కథ విజయ్‌కు కానీ, ఇతర పార్టీలకు కానీ కేంద్రానికి కానీ మొదలవుతుంది. ఉత్కంఠ భరితంగా మొదలైన సన్నివేశాలు మరింత ఆసక్తికరంగా ఉంటాయా, విజయ్ వ్యవహారశైలి, ముఖ్యమంత్రిగా ఏ విధంగా ఉండబోతుంది అన్నది, ఈ హీరో విజయాపజయాలను తెరమీద కాదు లైవ్‌లో తమిళనాడే కాదు దేశమంతటా చూడడానికి ఉత్కంఠ భరితంగా ఎదురుచూస్తున్నది. హీరోగా మొదలుపెట్టినవాడు జీరోగా ఎందుకు మారుతాడు అన్న ఆశావాదంతో అతని అభిమానులు ఈలలతో చప్పట్లతో రాబోయే కథను చూడానికి సిద్ధంగా ఉన్నారు. సినిమా హీరోలు రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఆ కథే వేరు అన్నది ఎంజిఆర్, ఎన్‌టిఆర్, హీరోయిన్ జయలలిత నిరూపించగలిగారు. విజయాన్నే పేరులో ధరించిన విజయ్, అపజయాన్ని ఎదుర్కోడన్న నమ్మకంతో అతని ఫాన్స్‌తో బాటు తమిళనాడంతటా సుపరిపాలనతో ప్రజలను ఆకట్టుకోగలడని ఆశలు పెట్టుకొని ఎదురు చూస్తున్నారు. వారే కాదు దేశమంతటా అదే మాదిరి తమిళనాడును ముఖ్య రంగస్థలంగా భావిస్తూ ఏమవుతుందో అని ఎదురుచూపులు చూస్తున్నది. రాజకీయం, క్రికెట్ ఉత్కంఠ భరితంగానే ఉంటా యి. కానీ చివరి మలుపులో గెలుపుతో దోబూచులాట ఉంటుందని అందరికీ తెలుసు. ●

# రహదారి వ్యవస్థలో సాంకేతిక విప్లవం

తిప్పర్తి శ్రీనివాస్

భారతదేశంలో రహదారి మౌలిక వసతులు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో టోల్ వసూళ్ల విధానంలో కూడా సాంకేతిక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ పరిణామంలో భాగంగా మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థను ప్రవేశపెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం అడు గులు వేస్తోంది. ఇది సంప్రదాయ టోల్ ప్లాజాల యుగా నికి ముగింపు పలుకుతూ, వాహనాలు ఆగకుండా ప్రయా ణిస్తూ టోల్ చెల్లించే సరికొత్త విధానంగా భావించబడుతోంది. ఇప్పటి వరకు మనం చూసిన టోల్ ప్లాజాలలో వాహనాలు తప్పనిసరిగా ఆగాలి. ఫాస్టాగ్ వంటి డిజిటల్ చెల్లింపు విధానం వచ్చినప్పటికీ, ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయాల్లో టోల్ ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడటం సహజం. ఇది ఇంధన వ్యర్థాన్ని, సమ య నష్టాన్ని మాత్రమే కాకుండా పర్యావరణ కాలుష్యాన్ని కూడా పెంచుతుంది. ఈ సమస్యలకు పరిష్కారంగా ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ వ్యవస్థను తీసుకురావడం సముచితమైన చర్యగా కనిపిస్తుంది. ఎం ఎల్ ఎఫ్ ఎఫ్ విధానంలోటోల్ ప్లాజాలు ఉండవు. వాటి స్థానంలో హైవే పై గ్యాంట్రీలు (గేట్లు వంటి నిర్మాణాలు) ఏర్పాటు చేస్తారు. ఈ గ్యాంట్రీ లపై ఉన్న సెన్సర్లు, కెమెరాలు వాహన నంబర్ ప్లేట్లను చదివి, సంబంధిత బ్యాంక్ ఖాతా లేదా డిజిటల్ వాలెట్ నుండి టోల్ మొత్తాన్ని ఆటోమేటిక్‌గా డెబిట్ చేస్తాయి. అంటే వాహనం ఎక్కడా ఆగాల్సిన అవసరం లేకుండా నిరంతరంగా ప్రయాణం కొనసాగుతుంది. ఈ విధానం వల్ల ప్రయాణికులకు అనేక ప్రయోజనాలున్నాయి. మొదటగా, సమయం ఆదాఅవుతుంది. ముఖ్యంగా దీర్ఘదూరప్రయాణాల్లో టోల్‌ప్లాజాల వద్ద వృథా అయ్యే సమయం గణనీయంగా తగ్గుతుంది. రెండవది, ఇంధన వినియోగం తగ్గుతుంది. వాహనాలు ఆగి మళ్లీ స్టార్ట్ అయ్యే అవసరం లేక పోవడం తో ఇంధన పొదుపు సాధ్యమవు తుంది. మూడవది కాలుష్యం



తగ్గుతుంది. ట్రాఫిక్ నిలిచిపోవడం తగ్గడం వల్ల కార్బన్ ఉద్గారాలు కూడా తగ్గుతాయి. అయితే, ఈ కొత్త వ్యవస్థపై కొన్ని ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా గోప్యత అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. వాహనాల కదలికలను నిరంతరం ట్రాక్ చేసే అవకాశం ఉండటంతో, వ్యక్తిగత డేటా భద్రతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈడేటా ఎక్కడ నిల్వఅవు తుంది? దాన్ని ఎవరు ఉపయోగిస్తారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలుఅవసరం. ఇంకా ఒక సమస్య - సాంకేతిక లోపాలు. కెమెరాలు తప్పుగా నంబర్ ప్లేట్లుచది వితే? లేదా ఖాతాలో సరిపడా డబ్బు లేకపోతే? ఇలాంటి సందర్భాల్లో వాహనదారులు అన్యాయంగా జరిమానాలు చెల్లించాల్సి రావచ్చు. అందుకే ఈ వ్యవస్థను అమలుచేసే ముందు పటిష్టమైన సాంకేతిక మౌలిక వసతులు, పారద ర్శకమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో లేదా సాంకేతిక అవగాహన తక్కువగా ఉన్న వాహనదారుల విషయంలో కూడా సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందరికీ డిజిటల్ చెల్లింపు వ్యవస్థలు అందు బాటులో ఉండకపోవచ్చు. ఈనేపథ్యంలో ప్రభుత్వం అవ గాహన కార్యక్రమాలు చేపట్టి, అవసరమైన సహాయాన్ని అందించాలి. మరోవైపు, ఈ వ్యవస్థద్వారా ప్రభుత్వానికి ఆదాయం పారదర్శకంగా, సమర్థవంతంగా వసూలు కావ చ్చు. టోల్ ఎగవేత తగ్గే అవకాశం ఉంది. దీంతో రహ దారి అభివృద్ధికి మరింత నిధులు సమకూరుతాయి. సారాంశంగా చెప్పాలంటే, మల్టీ లేన్ ఫ్రీ ఫ్లో టోల్ వ్యవస్థ రహదారి ప్రయాణం లో ఒక సాంకేతిక విప్లవం. ఇది సమయం, ఇంధనం, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించగలదు. అయితే, దీనిని అమలు చేసేక్రమంలో గోప్యత, సాంకేతిక లోపాలు, ప్రజల అవగాహన వంటి అంశాలను సమగ్రంగాపరిష్కరించాల్సిన అవసరం ఉంది. సరైన ప్రణాళిక, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉంటే, ఈకొత్త విధానం భారతదేశ రహదారి వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చగలదు. ●

# బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచి!

సొప్పరి నరేందర్

భారతదేశ చరిత్రలో బెంగాల్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. బెంగాల్ రాజకీయాలకు దేశ రాజకీయ గతిని మార్చేశక్తిగా ఉంటుంది. మమత బెనర్జీ తృణమూల్‌కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ బిజెపి బలంగా పుంజుకోవడం రాష్ట్రంలో అధికారం కోసం జరుగుతున్న హోరాహోరీ పోరు దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ ఆకాంక్షలను ప్రభావితం చేయనుంది. అక్రమ వలసలు జాతీయ పౌరసత్వ అంశాలు బెంగాల్‌లో ప్రధాన ఎన్నికల అంశాలుగా మారాయి. బెంగాల్ ఫలితాలు కేంద్రం తీసుకునే కఠినమైన సరిహద్దు భద్రతా నిర్ణయాలకు పౌరసత్వ బిల్లుల అమలుకు బలమైన సంకేతాన్ని ఇస్తాయి. రాజకీయ విశ్లేషణల ప్రకారం మైనారిటీ ఓట్ల ఏకీకరణ హిందూ ఓట్ల ధ్రువీకరణ బెంగాల్‌లో కొత్త రకమైన రాజకీయ సమీకరణాలకు దారితీస్తున్నాయి. స్వాతంత్ర్య పోరాటం నుంచి సాహిత్యం, సంస్కృతి, రాజకీయాలు, విద్య, ఆర్థిక రంగాల వరకు ప్రతి విభాగంలో బెంగాల్ దేశానికి మార్గదర్శకంగా నిలిచింది. నేడు బెంగాల్ ఆలోచించేదే రేపు భారత్ ఆలోచిస్తుంది అనే నానుడి యాదృచ్ఛికంగా రాలేదు. కాలానుగుణంగా మార్పులను స్వీకరించి దేశానికి దిక్సూచిగా నిలవడం బెంగాల్ ప్రత్యేకత. నేటి పరిస్థితుల్లో కూడా బెంగాల్‌లో జరుగుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక మార్పులు దేశ భవిష్యత్తుపై ప్రభావం చూపుతున్నాయి. బెంగాల్ మార్పు గురించి మాట్లాడితే ముందుగా విద్యా, సాంస్కృతిక రంగాలను ప్రస్తావించాలి. రాజారామమోహన్ రాయ్, ఇశ్వర్ చంద్ర విద్యాసాగర్, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహనీయులు సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. బాల్యవివాహాల నిర్మూలన, మహిళా విద్య, ఆధునిక విద్యా వ్యవస్థ వంటి అంశాల్లో బెంగాల్ ముందడుగు వేసింది. ఆ మార్పులు క్రమంగా దేశమంతటా వ్యాపించాయి. నేటికీ విద్య, సాహిత్యం, కళల విషయంలో బెంగాల్ ప్రత్యేక గుర్తింపును కొనసాగిస్తోంది. రాజకీయ పరంగా కూడా బెంగాల్ ఎప్పుడూ దేశ దృష్టిని ఆకర్షించింది. స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ వంటి నేతలు జాతీయ భావజాలాన్ని బలపరిచారు. అనంతరం వామపక్ష రాజకీయాల కేంద్రంగాబెంగాల్ నిలిచి భూసంస్కరణలు, గ్రామీణ అభివృద్ధి వంటి అంశాల్లో దేశానికి కొత్త నమూనాలను చూపించింది. తరువాత రాజకీయ మార్పులతో ప్రాంతీయ పార్టీల ఎదుగుదల చోటుచేసు



కుంది. ఇది భారతదేశంలో ప్రాంతీయ రాజకీయాల ప్రాధాన్యాన్ని మరింత స్పష్టంగా చేసింది. ఆర్థిక రంగంలో కూడా బెంగాల్ మార్పు గమనించదగ్గది. ఒకప్పుడు జూట్ పరిశ్రమలు, నౌకాశ్రయాలు, వ్యాపార కేంద్రాలతో దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన అండగా ఉన్న బెంగాల్, కొన్ని దశాబ్దాల్లో పరిశ్రమల క్షీణతను ఎదుర్కొంది. అయితే ఇటీవల ఐటీ, సేవా రంగం, స్టార్టప్‌ల అభివృద్ధి ద్వారా కొత్త అవకాశాల వైపు అడుగులు వేస్తోంది. కోల్‌కత్తా వంటి నగరాలు మళ్లీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మార్పు దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఒక పాఠంలా నిలుస్తోంది. కాలానికి అనుగుణంగా మారితేనే అభివృద్ధి సాధ్యమని సూచిస్తోంది. సామాజిక రంగంలో బెంగాల్ ఎప్పుడూ చైతన్యానికి కేంద్రబిందువుగా నిలిచింది. సాహిత్యం, సినిమా, నాటకరంగం ద్వారా ప్రజల్లో సామాజిక అవగాహన పెంచడం బెంగాల్ ప్రత్యేకత. సత్యజిత్ రే సినిమాలు, బెంగాలీ సాహిత్యం దేశవ్యాప్తంగా ప్రభావం చూపాయి. మేధావుల చర్చలు, ప్రజాస్వామ్య భావజాలం, రాజకీయ చైతన్యం అక్కడి సమాజాన్ని ప్రత్యేకంగా నిలబెట్టాయి. ప్రజలలో ప్రశ్నించే ధోరణి ఎక్కువగా ఉండటం కూడా బెంగాల్ ప్రత్యేకతగా చెప్పవచ్చు. అయితే బెంగాల్ ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా విస్మరించలేం. నిరుద్యోగం, రాజకీయ హింస, వలసలు, పరిశ్రమల కొరత వంటి సమస్యలు రాష్ట్ర అభివృద్ధికి అడ్డంకులుగా మారుతున్నాయి. అయినప్పటికీ బెంగాల్ ప్రజలలో ఉన్న సృజనాత్మకత, చైతన్యం, మార్పును స్వీకరించే స్వభావం ఈ సమస్యలను అధిగమించే శక్తిని ఇస్తోంది. అందుకే బెంగాల్ మార్పు దేశానికి దిక్సూచిగా భావించబడుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో కూడా బెంగాల్ కీలక పాత్ర పోషిస్తోంది. జాతీయ పార్టీలకు బెంగాల్ ఒక రాజకీయ పరీక్షా స్థలంగా మారింది. అక్కడి ఎన్నికల ఫలితాలు దేశరాజకీయ ధోరణులపై ప్రభావం చూపుతున్నాయి. సామాజిక సమీకరణాలు, మైనారిటీ రాజకీయాలు, సంక్షేమ పథకాల ప్రభావం వంటి అంశాల్లో బెంగాల్ ఒక ప్రయోగశాలగా కనిపిస్తోంది. ఈ మార్పులను గమనిస్తూ దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. మొత్తానికి బెంగాల్ భారతదేశ ఆలోచనా విధానానికి ప్రతిబింబం. విద్యలో, సంస్కృతిలో, రాజకీయాల్లో, సామాజిక చైతన్యంలో జరిగిన ప్రతి మార్పు దేశవ్యాప్తంగా ప్రభావం చూపింది. నేటి మారుతున్న భారతదేశంలో బెంగాల్ మరోసారి కొత్త దిశను చూపించే స్థితిలో ఉంది. అభివృద్ధి, ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం కలగలిపిన మార్గాన్ని చూపగలిగితే బెంగాల్ నిజంగా దేశానికి దిక్సూచిగా నిలుస్తుంది. 2026 మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం సాధించి రాష్ట్రంలో తొలిసారిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోంది. బిజెపి బెంగాల్ లో తొలి సర్కార్‌తో డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తీసుకొచ్చింది. ●



## జూలై ఒకటి నుంచి 'విబిజిరామ్‌జి' చట్టం అమలు

**న్యూఢిల్లీ, మే 11:** జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్ (వీబీజీరామ్‌జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జూలై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.

## తెలంగాణ ప్రజలను నిరుత్సాహపర్చిన ప్రధాని మోడీ ప్రసంగం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం హైదరాబాద్ బహిరంగ సభలో చేసిన ప్రసంగం తెలంగాణ ప్రజల ఆశలను నీరుగార్చడమే కాకుండా నిరుత్సాహపర్చిందని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ప్రధాని ప్రసంగంలో నీతి సూత్రాలు వల్లించి ఊకదంపుడు ఉపన్యాసం చేశారన్నారు. ఈ రాష్ట్రానికి బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదు? పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదు? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎందుకు అడ్డుకుంటున్నారు? రాష్ట్రానికి ఆర్థికంగా రావాల్సిన నిధులు ఎందుకు తగ్గుతున్నాయి? అనే విషయాలకు సమాధానం చెప్పలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మాతో జట్టుకట్టండని, తమకు అనుకూలంగా వ్యవహరించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పరోక్షంగా మోడీ సంకేతమివ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. పెట్రోల్ వాడకాన్ని నియంత్రించాలని, ప్రజారవాణాలోను, మెట్రోరైల్‌లో వెళ్ళాలని, బంగారం కొనొద్దని, విదేశీ పర్యటనలు చేయొద్దని, నిత్యావసర సరుకుల ధరలు పెరగబోతున్నాయని సంకేతాన్ని ఇచ్చారన్నారు. అయితే ధరలు పెరగడానికి ప్రధానకారణమైన యుద్ధాన్ని ఆపకుండా, అమెరికా అధ్యక్షుడి ముందు మోకరిల్లే వైఖరిని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని జాన్ వెస్లీ మండిపడ్డారు.

## విచారణలో తేలిన నిజాల ఆధారంగా చర్యలు

### కెటిఆర్‌పై నమోదైన కేసు గురించి సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 11:** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫార్ములాఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ కేసులో ప్రభుత్వం ఎవరిపై వ్యక్తిగత కక్షతో వ్యవహరించడం లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన స్పష్టం చేశారు. ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా సుమారు రూ. 55 కోట్ల నిధులను (విదేశీ కరెన్సీలో) హెచ్ఎండీఏ నుంచి మళ్లించారనే ఆరోపణలపై ఇప్పటికే ఏసీబీ సుమారు 250 పేజీలకు పైగా ఉన్న చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. ఆయనతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ (ఏ2), హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.ఎన్ రెడ్డి (ఏ3)లను కూడా నిందితులుగా చేర్చారు. ఈ కేసుపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి... దర్యాప్తులో తాము జోక్యం చేసుకోబోమని వెల్లడించారు. ఎవరిని అరెస్ట్ చేయాలి లేదా ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనేది పూర్తిగా దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాల పరిధిలోని అంశమని ఆయన స్పష్టం చేశారు.

## నాలుగు కొత్త లేబర్‌కోడ్‌ల గెజిట్ నోటిఫికేషన్

### వారానికి 48 గంటలు పని, ఒకరోజు వీక్ఆఫ్

**న్యూఢిల్లీ, మే 11:** వారానికి 48 గంటల పని పరిమితి, తప్పనిసరిగా వారానికొక విశ్రాంతి దినం, ఓవర్‌టైమ్ పనికి అదనపు చెల్లింపుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లను జారీచేసింది. ఈ నోటిఫికేషన్‌తో నాలుగు కార్మిక కోడ్‌లలో చేసిన ఈ ప్రతిపాదనలు ఇక అధికారిక హోదాను పొందాయి. దేశవ్యాప్తంగా కంపెనీలు వీటిని ఇక కచ్చితంగా పాటించాల్సిందే. వాస్తవానికి నాలుగు కార్మిక కోడ్‌లు 2025 నవంబరు 21 నుంచే అమల్లోకి వచ్చాయి. అయితే ఈనెల 8, 9 తేదీల్లో వాటికి సంబంధించిన తుది నిబంధనలు, నియమాలతో కేంద్ర ప్రభుత్వం దాదాపు 30 అధికారిక గెజిట్‌లను ప్రచురించింది. దీంతో ఈ కార్మిక సంస్కరణల ప్రక్రియ పూర్తయింది. కేంద్ర సర్కారు తాజాగా ప్రచురించిన గెజిట్ నోటిఫికేషన్లలోని అత్యంత కీలకమైన కార్మికుల కనీస వేతనం లెక్కింపు సూత్రాన్ని తొలగించింది. దీనికి బదులుగా, కనీస వేతన ప్రమాణాలను భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక లేదా సాధారణ ఉత్తర్వు ద్వారా విడిగా ప్రకటిస్తుందని స్పష్టంచేసింది.

# ప్రశాంతంగా ముగిసిన ఎప్‌సెట్ ఇంజినీరింగ్ పరీక్షలు

### అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్స్ అప్‌లోడ్

### నేడు ఇంజినీరింగ్ పరీక్షల ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎప్) సెట్-2026కి సంబంధించిన ఇంజినీరింగ్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. శనివారం ప్రారంభమైన పరీక్షలు సోమవారంతో ముగిశాయని ఎప్ సెట్-2026 కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. చివరి రోజు జరిగిన పరీక్షలకు 94.17 శాతం విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. పరీక్షలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న సెషన్‌ను 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహించారు. చివరి రోజు ఎప్ సెట్ ఇంజనీ రింగ్ పరీక్షలను ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాల కిష్టారెడ్డి, జేఎన్‌టియు వీసీ ప్రొఫెసర్ కిషనన కుమార్ రెడ్డి, జేఎన్‌టియు రెక్టార్, ఎప్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి క్యాదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, జేఎన్‌టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావు పరిశీలిం చారు. ఇంజినీరింగ్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 125 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చివరి రోజైన సోమవారం ఉదయం సెషన్‌లో 35230 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 33,314 మంది(94.56శాతం) పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్న సెషన్‌లో 35,295 మందికిగానూ 33,099 మంది(93.78) శాతం మంది హాజరయ్యారు. ఎప్ సెట్-2026కి సంబంధించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్‌షీట్స్‌ను సోమ వారం ఉదయం నుంచే వెబ్‌సైట్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉంచినట్లు కన్వీనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాథమిక కీపై రెండు రోజుల్లో అభ్యంతరాలను నమోదు చేయడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇంజనీరింగ్ పరీక్షల ప్రాథమిక కీతోపాటు రెస్పాన్స్‌షీట్స్‌ను నేడు(మంగళవారం) విడుదల చేయనున్నట్లు తెలిపారు. అభ్యంతరాల స్వీకరణకు రెండు రోజుల గడువును ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫైనల్ కీతోపాటు ఫలితాలను వారం, 10 రోజుల్లో విడు దల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 4, 5 తేదిల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీ క్షలు జరగగా.. ఈ నెల 9 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

# ఒడిశా టు మహారాష్ట్ర వయా ఒఆర్ఆర్



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి శ్రీనివాస్ తదితరులు

### అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్టు

### 400 కిలోల గంజాయి స్వాధీనం

**హైదరాబాద్(గచ్చిబౌలి), మే 11, ప్రభాతవార్త:** ఒడిశా రాష్ట్రంలోని మల్కాన్ గిరి నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర గంజాయి సరఫరా ముఠా ఔటర్ రింగురోడ్డు మీదుగా ప్రయాణిస్తూ సైబరాబాద్ పోలీసులకు చిక్కారు. ఈ ముఠాలోని మొత్తం ఏడుగురిని అరెస్టు చేసిన సైబరాబాద్ ఎస్ఓటీ, పటాన్‌చెరు పోలీసులు దాదాపు 2కోట్ల రూపాయల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. లారీలో గంజాయిని తరలిస్తూ, ముందు ఓ కారును ఎస్కార్టుగా పెట్టిన నిందితులు ఔటర్ మీద పోలీసులకు చిక్కారు. పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం శేరిలింగంపల్లి జోన్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి శ్రీనివాస్ వెల్లడించారు. మహారాష్ట్ర పరిధిలోని షోలాపూర్‌కు చెందిన మనీషా పద్వాల్ పలు చట్టవిరుద్ధ వ్యాపారాలు చేసింది. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరిలో గంజాయి సరఫరా చేసే ట్రైబూన్ వద్ద గంజాయి కొనుగోలు చేయాలని నిర్ణయించి సోలాపూర్ సంగోలాకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్(24)ను సంప్రదించింది. ప్రతాప్ పరివార్‌తో ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకుంది. గంజాయి వ్యాపారి ట్రైబూన్‌ను సంప్రదించి సోలాపూర్‌కే చెందిన డీసీఎం లారీ యజమాని ఆనంద్ మయాప్ప హోవల్(34)తో కలిసి గంజాయి రవాణా చేయాలని నిర్ణయించాడు. వీరు డీసీఎం నడిపేందుకు సోలాపూర్‌కు చెందిన డ్రైవర్లు చందన్‌శివ్ అడుంబర్(46), రంజిత్ రాజేందర్ గడిగె(27), మారుతి ఎర్టిగా కారు యజమాని బాలాజీ గణేష్ హోన్‌మణి(35), రోహిత్ హోవల్(27), చందశివ్ సాహిల్(17)లతో కలిసి ఓ ముఠా ఏర్పడ్డారు. ఈనెల 8న వీరంతా ఒడిశాకు వెళ్లి ట్రైబూన్‌ను కలిసి 400 కిలోల గంజాయిని డీసీఎం లారీలో లోడ్ చేసుకొని మహారాష్ట్రకు బయలుదేరారు. ముందు ఎర్టిగా కారు ఎస్కార్టుగా ప్రయాణిస్తూ సమాచారం అందజేస్తుండగా, వెనుక డీసీఎం ప్రయాణించింది. మహారాష్ట్రకు వెళ్లే క్రమంలో నగరంలోని ఔటర్ రింగురోడ్డు మీదుగా ప్రమాణం సాగించేందుకు ఔటర్‌ను ఎక్కారు. కాగా విశ్వసనీయ సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి జోన్ ఎస్ఓటీ, పటాన్‌చెరు పోలీసులు ఔటర్ మీద ఈ ముఠాను పట్టుకున్నారు.

## న్యాయవ్యవస్థలో 'వన్ కేస్ వన్ డేటా' ప్రారంభం

### సహాయ్ చాట్‌బాట్‌ను ప్రారంభించిన చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్



**న్యూఢిల్లీ, మే 11:** న్యాయవ్యవస్థలో కేసుల నిర్వహణను మెరుగుపర్చడానికి వన్ కేస్ వన్ డేటా పేరుతో సరికొత్త డిజిటల్ వ్యవస్థను సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రారంభించారు. సోమవారం ఉదయం సుప్రీం కోర్టు రోజువారీ విచారణలు ప్రారంభమయ్యే సమయంలో వన్ కేస్ వన్ డేటా కార్యక్రమంపై సీజేఐ ప్రకటన చేశారు. బహుళ స్థాయిల్లో హైకోర్టులు, జిల్లా కోర్టులు, తాలూకా కోర్టుల్లో ఉండే కేసుల సమాచారాన్ని ఏకీకృత వ్యవస్థలోకి అనుసంధానిస్తామని, దీనివల్ల దేశ న్యాయ వ్యవస్థలో సమర్థవంతమైన కోర్టు కేసుల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ చెప్పారు. ఫలితంగా దేశవ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాలు అన్నింటిలో కోర్టు కేసులకు సంబంధించిన మరింత సమగ్రమైన, పరస్పరం అనుసంధానితమైన డిజిటల్ డేటాబేస్ ఏర్పడుతుందన్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్లు వేసే వారికి కోర్టు సేవలను మరింత సులభతరం చేసేందుకు, సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌తో అనుసంధానితమై పనిచేసే సు సహాయ్ ఏఐ ఛాట్‌బోట్‌ను సైతం ప్రారంభించినట్లు సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ ప్రకటించారు. ఈ ఛాట్‌బోట్‌ను సుప్రీం కోర్టు రిజిస్ట్రీ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సంయుక్తంగా అభివృద్ధి చేశాయని ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ముఖ్యమైన సేవలను పొందాలని భావించే వారు సు సహాయ్ ఛాట్‌బోట్ ద్వారా సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌కు సంబంధించిన సరళమైన, సౌకర్యవంతమైన ఇంటర్‌ఫేస్‌ను పొందొచ్చన్నారు. సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయడంతో ముడిపడిన ప్రాథమిక మార్గదర్శకాలు, సలహాలను కోరేందుకు అనుగుణంగా ఆ వెబ్ ఇంటర్‌ఫేస్ ఉంటుందని సీజేఐ చెప్పారు.

## నేడు అసోం సిఎంగా రెండోసారి హిమంత బిశ్వశర్మ ప్రమాణస్వీకారం

**గువాహతి, మే 11:** అసోం ముఖ్యమంత్రిగా మంగళవారం ఉదయం 11:40 గంటలకు



ఖానాపారాలోని వెటర్న రీ కళాశాల మైదానంలో హిమంత ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ శాసనసభాపక్ష సమావేశంలో హిమంత బిశ్వ శర్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం జరిగే హిమంత ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు బిజెపి, ఎన్డీయే పాలిత రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులు హాజరవుతారని అస్సోం కాబోయే సీఎం హిమంత బిశ్వశర్మ వెల్లడించారు. అసోం ఎన్నికల ఫలితాలు ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి విధానాలకు ప్రజలు ఇచ్చిన మద్దతుగా కేంద్ర మంత్రి జెపినడ్డా అభివర్ణించారు. కేంద్ర సంక్షేమ పథకాలను అసోంలో సమర్థవంతంగా అమలు చేసినందుకుగాను హిమంత ప్రభుత్వాన్ని ప్రశంసించారు. వచ్చే ఐదేళ్లలో మోడీఅనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెడతారని, వాటిని హిమంత సమర్థంగా అమలు చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు నిర్వహించిన సమావేశంలో హిమంత మాట్లాడారు. ప్రజలు మరోసారి ఎన్‌డీఏపై విశ్వాసం ఉంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ 102 స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ ఒక్కటే 82 సీట్లు గెలుచుకోగా ఏజీపీ, బీపీఎఫ్ చెరో 10 స్థానాల్లో విజయం సాధించాయి. 2021లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన హిమంత బిశ్వ శర్మ, అసోంలో వరుసగా రెండు సార్లు ముఖ్యమంత్రి అయిన తొలి కాంగ్రేసేతర నాయకుడిగా గుర్తింపు పొందారు.

## నేడు ఎడ్‌సెట్ పరీక్ష

### 35,600 మంది దరఖాస్తు

### 59 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బీఈడీ కాలేజీల్లో బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2026 పరీక్ష నేడు(మంగళవారం) నిర్వహించనున్నారు. ఎడ్ సెట్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 35,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలను మంగళవారం రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. ఎడ్ సెట్-2026కి రాష్ట్ర వ్యాప్తంగా 35,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎడ్ సెట్‌కి దరఖాస్తు చేసుకున్న వారిలో 85 శాతానికిపైగా మహిళలే ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రంలో 16 జోనల్ కేంద్రాల్లో మొత్తం 59 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు.

## నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో అడ్మిషన్లను నేటి(మంగళవారం) నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 31 వరకు అడ్మిషన్ల స్వీకరణకు తుది గడువుగా ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ బోర్డును పాఠశాల విద్య శాఖలో విలీనం చేస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో ఈ నెల 4న ఇంటర్ బోర్డు జారీ చేసిన అడ్మిషన్ షెడ్యూల్‌ను అభయన్స్‌లో పెడుతూ ఈ నెల 5న మరో ప్రకటనను ఇంటర్ బోర్డు జారీ చేసింది. అసెంబ్లీలోనూ చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఆదివారం అధికారులకు సీఎం స్పష్టం చేశారు. దీంతో నేటి(మంగళవారం) నుంచి అడ్మిషన్లను చేపట్టాలని నిర్ణయించినట్టు ఇంటర్ బోర్డు సోమవారం అడ్మిషన్ షెడ్యూల్‌ను జారీ చేసింది.



ప్రధాని మోడీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రభుత్వ సలహాదారు విహెచ్, చిత్రంలో పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

## ప్రధాని మోడీపై పోలీసులకు విహెచ్ ఫిర్యాదు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సోమవారం ప్రధాని నరేంద్రమోడీపై ఫిర్యాదు నమోదు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సభలో ప్రధాని మోడీ కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖం డిస్తూ ఆయన ఈ ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీని 'ముస్లింల పార్టీ'గా పేర్కొంటూ చేసిన వ్యాఖ్యలు సామాజిక విభేదాలను రెచ్చగొట్టేలా ఉన్నా యని ఆయన ఆక్షేపిస్తూ ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబంపేట్ పోలీస్‌స్టేషన్ సీఐ కిరణ్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విహెచ్ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు తగినవిధంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## పిఎంజె దోపిడీ కేసులో పురోగతి!

### నిందితుల కోసం గాలింపు ముమ్మరం

**కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త:** కరీంనగర్ పిఎంజె నగల దుకాణం దోపిడి కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు తెలుస్తుంది. వరస ఘటనలతో భద్రత వైఫల్యంపై అప్రతిష్ట మూట కట్టుకున్న కరీంనగర్ పోలీసులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ప్రయత్నించారనే చెప్పుకోవచ్చు..ప్రత్యేక బృందాలతో వివిధ రాష్ట్రాల్లో గాలింపులు చేపట్టిన పోలీసులకు, బెంగాల్‌లో నిందితులు బంగారం విక్రయించేందుకు ప్రయత్నించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఆ క్రమంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు చోరీ సొమ్ము విక్రయించడానికి వచ్చిన ముఠా సభ్యుడు చిక్కినట్లు విశ్వసనీయంగా సమాచారం మేరకు తెలుస్తోంది. అయితే అప్పటికే సొమ్ము అమ్మి నగదు రూపంలో మార్చుకోవడంతో రికవరీ కష్టంగా మారినట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే బాధితులకు న్యాయం జరగాలన్న ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర పోలీసులు, సొత్తు రికవరీ చేస్తున్న ఘటనలు లేకపోలేదు. ఈ క్రమంలోనే నిందితులను పట్టుకోవడం రికవరీ చేయడం ఆలస్యమవుతున్నట్లు తెలుస్తుంది.

## స్త్రీనిధి క్రెడిట్ బ్యాంక్‌లో పోస్టుల భర్తీ

### నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** తెలంగాణలోని నిరుద్యోగులకు రాష్ట్ర సర్కార్ శుభ వార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి, సొంత జిల్లాలోనే పనిచేసే అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ శాఖ పరిధిలో పనిచేసే స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో అసిస్టెంట్ మేనేజర్ (ఫీల్డ్ ఆపరేషన్స్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో ఈ మొత్తం పోస్టులు కేటగిరీల వారీగా చూస్తే రాష్ట్ర వ్యాప్తంగా 123 ఖాళీలు ఉండగా, ఓసీలకు 60, ఈడబ్ల్యూఎస్‌కు 03, బీసీ-ఏ లకు 16, బీసీ-బికి 2, ఓహెచ్‌కు 09, ఎస్సీ గ్రూప్-1కు 4, ఎస్సీ గ్రూప్-2కి 26, ఎస్టీలకు 03 పోస్టులను కేటాయించినట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది. అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి కనీసం 65 మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి ఉండంతో పాటు, తప్పనిసరిగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. కంప్యూటర్‌లో ఎంఎస్ ఆఫీస్ పరిజ్ఞానం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులు సొంతంగా బైక్, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఇక అభ్యర్థుల వయస్సు 25 నుండి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ?ఇందులో బీసీలకు 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 5 ఏళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. అభ్యర్థులు తమదరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేదీ ఈ నెల 29గా నిర్ణయించారు. కాగా దరఖాస్తు ఫీజు కింద ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు రూ.770, ఇతర కేటగిరీల అభ్యర్థులకు రూ.885 చెల్లించాలి. ఆన్‌లైన్ రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపింది.

## ఉపాధి కూలీల్లో కొత్త ఆందోళన

### కూలీలందరికి ఈకెవైసిని తప్పనిసరి చేసిన కేంద్రం...సోమవారంతో ముగిసిన గడువు

### ఇంకా 3.38లక్షల మంది కూలీలకు ఈకెవైసి పూర్తికాని పరిస్థితి

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీల్లో కొత్త ఆందోళన మొదలైంది. కూలీలందరికీ ఈకెవైసి నమోదును తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువు సోమవారం (మే 11)తో ముగిసింది. అయితే తెలంగాణలో ఈ ప్రక్రియను కూలీలందరూ పూర్తి చేయకపోవడంతో కొత్త టెన్షన్ మొదలైంది. రాష్ట్రంలోఇంకా 3.38 లక్షల మంది కూలీలు నమోదు ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్ నెలలో ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టడం, పనుల నమోదు, వేతనాల చెల్లింపులను పారదర్శకం చేయడం కోసం ప్రతి కూలీకి ఈకెవైసిని తప్పనిసరి చేసింది.

**ఈకెవైసి నమోదు**

దీని ద్వారా ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ నిర్ధారణ జరుగుతుంది. రాష్ట్రంలో మొత్తం 49,76,151 మంది ఉపాధిహామీ కూలీలు ఉండగా, ఇప్పటి వరకు 46,37,356 మంది మాత్రమే ఈకెవైసి నమోదు పూర్తి చేశారు. ఇంకా సుమారు 6.78 శాతం మంది 3.38 లక్షలు మిగిలి ఉన్నారు. జిల్లాల వారీగా పరిశీలిస్తే సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 96.71శాతం నమోదు పూర్తయింది.

**ఈకెవైసి నమోదు కాకపోవటానికి కారణాలు ఇవే**

అయితే కామారెడ్డి జిల్లాలో అతి తక్కువగా 90.94శాతం మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఏ ఒక్క జిల్లాలో కూడా 100శాతం నమోదు పూర్తి కాలేదు. నమోదు ఆలస్యానికి కూలీలు ప్రస్తుతం అందుబాటులో లేకపోవడం, ఆధార్‌లో పేరు, ఫొటో, వివరాలు సరిపోకపోవడం, ఐరిస్ (కంటి) వివరాల్లో మార్పులు గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలు ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో లక్షలాది మంది కూలీల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈకెవైసి గడువును కనీసం మరో 15 రోజుల పాటు పొడిగించాలని అటు కూలీలు, ఇటు క్షేత్రస్థాయి అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వేసవి కాలంలో ఉపాధి పనులే ఆధారంగా బతుకుతున్న పేదలకు ఈ సాంకేతిక కారణాల వల్ల నష్టం వాటిల్లకూడదని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి గడువు పొడిగించడమే కాకుండా, వేలిముద్రలు పడని వారి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు.

## ఢిల్లీలో స్కెచ్.. హైదరాబాద్‌లో అమలు

### పథకంలో ఎనిమిది మందికిపైగా ప్రమేయం!

### ముగ్గురిని విచారిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

# మాజీ ఐపిఎస్ ఇంట్లో షాహి ముఠా దోపిడీ

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 11, ప్రభాతవార్త:** మాజీ ఐపీఎస్ వినయ్ రంజన్ రే నివాసంలో దోపిడి, హత్య సంఘటనలో 'షాహ్హి ముఠా పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దోపిడికి పక్కాగా పథకం వేసినట్లు అనుమానిస్తున్నారు. ఢిల్లీలో పథకం వేసి నగరంలో అమలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే కల్పన తల్లిదండ్రులతోపాటు నిందితుల్లో ఒకరికి డబ్బులు పంపిణీ చేసిన మరో వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలుస్తుంది. ఈ దోపిడి వెనుక దాదాపు ఎనిమిది మందికిపైగా ప్రమేయం ఉన్నట్లు పోలీసులు పోలీసులు అనుమానిస్తున్నారు..

**ఢిల్లీ నుంచి ఆపరేషన్**

దోపిడిలో కల్పన అలియాస్ ధర్మ, సుజన్ షాహి అలియాస్ సురేష్ సాయి, గణేష్ సాహి, భరత్ పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తిం చారు. ఇందులో సుజన్ షాహి ఢిల్లీలో ఉండటమే కాకుండా గతంలో ఒక దోపిడిలో అరెస్ట్ అయినట్లు తెలుస్తుంది. ఇతనితోపాటు గణేష్ షాహి, భరత్‌లను పూణేకు చెందిన దేవేంద్ర అనే వ్యక్తి కల్పన నివసించే మాజీ డీజీపీ నివాసానికి పంపినట్లు తెలుస్తుంది. అ క్రమంలోనే సుజన్ షాహికి దోపిడికి ముందు కొంత డబ్బులు సైతం ఖాతాకు బదిలీ చేసినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ వ్యవహారంలో వీరి అయిదుగురితోపాటు మరో ముగ్గురు, నలుగురు ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. నేరం చేసిన అనంతరం ఎవరు ఎక్కడికి ఎలా వెళ్లాలనే పథకాన్ని సైతం ముందుగానే రచించుకున్నారు. నగరం నుంచి రైలులో నాగపూర్ వైపు వెళ్లిన నిందితులు నాగపూర్‌కు ముందుగా వచ్చే స్టేషన్‌లోనే రైలు దిగారు. అక్కడ ఒక మద్యం దుకాణంలోకి వెళ్లి వచ్చిన అనంతరం మరో రైలు ఎక్కినట్లు గుర్తించారు. అనంతరం అక్కడి



ప్రధాన నిందితురాలు కల్పన అలియాస్ ధర్మ

నుంచి మరో ప్రాంతానికి వేర్వేరుగా వెళ్లినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఒక నిందితుడు ఇప్పటికే సరిహద్దు దాటి లోపలికి ప్రవేశిం చినట్లు సమాచారం. అయితే నిందితులు తీసుకెళ్లిన బంగారు ఆభరణాలను పథకంలో భాగస్వాములై ఉన్న వేరే వ్యక్తుల ద్వారా తరలించినట్లు అనుమానిస్తున్నారు.

**గిల్టు నగలుగా భావించి..**

దోపిడి, హత్య రోజున దుండగులు దాదాపు 225 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసుకెళ్లినట్లు పోలీసులకు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. అయితే సంఘటన జరిగిన రాత్రి మాజీ ఐపిఎస్ నివాసంలో మరో ఆభరణాల పెట్టె లభించింది. అందులో ఉన్న దాదాపు 20 తులాల బంగారు ఆభరణాలు గిల్టుగా భావించి నిందితులు చూసినప్పటికి అక్కడే వదిలివెళ్లారు. వాస్తవానికి అవి బంగారు నగలే అయినప్పటికి నిందితులు తప్పుగా అంచనా వేయడంతో ఆయా నగలు బాధితులకు దక్కాయి.

ఇక యేడాది క్రితం పనిలో కుదిరిన పనిమనిషి కల్పన గతంలో మాజీ ఐపీఎస్ తల్లి అనారోగ్యం పాలవ్వడంతో ఆమెకు సహాయకురాలిగా ఉన్నారు. దాదాపు మూడు నెలల తరువాత ఆమె మృతి చెందడంతో వినయ్ రంజన్ రే భార్యకు సహాయ కురాలిగా ఉన్నారు. ఆరు నెలలుగా ఆమె వద్దనే ఎంతో నమ్మకంగా ఉంటున్నారు. యజమానురాలిని నమ్మించిన ఆమె అర్ధరాత్రి దాటిన తరువాత ముందుగా వేసుకున్న పథకం ప్రకారం మరో ముగ్గురితో కలిసి ఈ హత్య, దోపిడికి పాల్పడింది. కల్పన వ్యవహారశైలిపై గతంలో ఆమె లక్నోలో పనిచేసిన ప్రాంతానికి సైతం పోలీసులు వెళ్లి విచారించారు. దేశంలోని ఢిల్లీ, బెంగళూరు, ముంబై, హైదరాబాద్ నగరాల్లో నేపాల్‌కు చెందిన గృహ సహాయకులు నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నా యన్నారు.


తెలంగాణ ప్రభుత్వం-దేవాదాయ ధర్మాదాయ శాఖ
శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానము
సింగపట్నం గ్రామము-కొల్లాపూర్ మండలం-నాగర్ కర్నూల్ జిల్లా
శ్రీ మదనగోపాల స్వామి దేవాలయము - జటప్రోలు
నెం. 3/SLNSD/2026 తేది: 08.05.2026

తలనీలాల సేకరణ కొబ్బరి కాయలు అమ్ముకొను హక్కుల - బహిరంగవేలములు

సదరు దేవస్థానములో "తలనీలాలు సేకరించుకొను హక్కు" కాలపరిమితి తేది: 01.07.2026 నుండి 30.06.2027 (ఒక సం.) వరకు గురించి సీల్డ్ టెండర్-కమ్-బహిరంగవేలం తేది: 27.05.2026 బుధవారం రోజు సింగపట్నం దేవాలయ ప్రాంగణం నందు నిర్వహించబడుచున్నందున అదే రోజు ఉదయం 09.00గం.ల నుండి 11.00ల వరకు టెండర్ షెడ్యూల్ పొంది, ముందుగా డిపాజిటు డిడి రూ.5,00,000/-లు చెల్లించి ఒరిజినల్ ప్రతిని సమర్పించి, పూర్తి చేసిన టెండర్ ఫారంతో పాటు డిడి జిరాక్స్ ప్రతిని అదే రోజు ఉదయం 11.00గం.ల నుండి 11.30గం.ల వరకు టెండర్ బాక్స్ నందు దాఖలు చేసి, 11.30గం.ల నుండి జరుగును బహిరంగ వేలంలో పాల్గొనవలసినదిగా మరియు అదే కాలపరిమితికిగాను శ్రీ మదన గోపాల స్వామి దేవాలయము, జటప్రోల్ నందు "కొబ్బరి కాయలు మరియు పూజా సామాగ్రి అమ్ముకొను హక్కు" గురించి బహిరంగ వేలము తేది: 27.05.2026 మ.3.00గం.లకు నిర్వహించబడుచున్నందున బహిరంగ వేలము నందు పాల్గొనవలసినదిగా కోరనైనది. వివరాలకు Mob.No 9951423875/8247228285/9000126342 సంప్రదించవలెను.

సం/-. ఫౌండర్ ఫ్యామిలి మెంబర్ & చైర్మన్. సం/-. కార్యనిర్వహణాధికారి.

DIPR.NO. 2225-PP/CL/ADVT/1/2026-27 తేది: 11.05.2026

# గ్రామీణ మహిళలకు మెరుగైన జీవనోపాధి

## సెర్ప్, పివిఎన్ఆర్‌టియు మధ్య అవగాహనా ఒప్పందం

### మహిళల ఆదాయ వనరులు పెంచడమే లక్ష్యం : మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారత, పశుసంవర్ధక ఆధారిత జీవనోపాధుల విస్తరణకు మరో కీలక అడుగు పడింది. సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్), పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ (పీవీఎన్ఆర్‌టీయూ) సోమవారం అవగాహన ఒప్పందాన్నికుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలకు పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ వంటి రంగాల్లో సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ అందించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ.. గ్రామీణ పేద కుటుంబాలకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

నైపుణ్య ఆధారిత ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా మహిళల ఆర్థిక స్థితిని బలోపేతం చేయనున్నట్లు చెప్పారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు వెటర్నరీ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, సమాఖ్యలను మరింత బలోపేతం చేసి గ్రామీణ మహిళల్లో స్వావలంబన, సామూహిక భాగస్వామ్యాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద కుటుంబాలకు బ్యాంకు లింకేజీలు, రివాల్వింగ్ ఫండ్లు, సబ్సిడీల ద్వారా ఆర్థిక సౌకర్యాలు అందించనున్నట్లు వెల్లడించారు.

కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్, రుణాల ద్వారా పొట్టేళ్ల యూనిట్లు, గొర్రె, మేక పిల్లల నర్సరీలు, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీ మదర్ యూనిట్లు, పక్షుల యూనిట్ల ఏర్పాటు వంటి కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. అవగాహన ఒప్పందం ప్రకారం పీవీఎన్ఆర్‌టీయూ, సెర్ప్ లబ్ధిదారులకు సాంకేతిక నైపుణ్యాలు, సామర్థ్యాభివృద్ధి శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది. పశు పోషణ, ఆరోగ్య సంరక్షణ అంశాల్లో శాస్త్రీయ మార్గదర్శకత్వం అందించనుంది.

పీవీఎన్ఆర్‌టీయూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ. శరత్ చంద్ర మాట్లాడుతూ... పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ పౌల్ట్రీరంగాల్లో సెర్ప్ మహిళలకు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయి సాంకేతిక సహకారం అందిస్తుందని తెలిపారు. పాల ఉత్పత్తి , పశువుల ఉత్పాదకతను ప్రభావితం చేస్తున్న ప్రధాన సమస్యల్లో పోషకాహార లోపం, ఖనిజాల కొరత ఒకటని పేర్కొన్నారు.

అవసరమైతే పరస్పర సహకారంతో ఆర్థిక మద్దతు కూడా అందించే అవకాశం ఉంటుందని అవగాహన ఒప్పందంలో పేర్కొన్నారు.

కాగా.. గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు పశుసంవర్ధక రంగం బలమైన ఆధారమని, స్వయం సహాయక సంఘాల మహిళలు సంప్రదాయ ఉపాధికి పరిమితం కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ఆదాయ వనరులు పెంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సీతక్క తెలిపారు.



# పూర్తిస్థాయి వైద్యసేవలు అందించేలా సనత్‌నగర్ టిమ్స్‌ను తీర్చిదిద్దాలి

### అధికారులను ఆదేశించిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని సనత్‌నగర్ టిమ్స్‌ను పేషెంట్లకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా తీర్చిదిద్దాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్‌పై మంత్రి సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ పాల్గొన్నారు. ట్రయల్ రన్‌లో భాగంగా అందిస్తున్న వైద్య సేవల వివరాలను, ఎదురవుతున్న ఇబ్బందులు, లోపాలను అధికారులు మంత్రికి వివరించారు. ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ రూమ్‌లు, వెయిటింగ్ ఏరియా, డయాగ్నస్టిక్స్, రేడియాలజీ డిపార్ట్‌మెంట్, ఇన్‌పేషెంట్ డిపార్ట్‌మెంట్లు, వార్డులు, ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూల పనితీరుపై మంత్రి ఆరా తీశారు. ట్రయల్ రన్‌లో భాగంగా 22 డిపార్ట్‌మెంట్లలో ఓపీ సేవలు అందిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. ఆపరేషన్ థియేటర్లు శస్త్రచికిత్సలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక సీటీ స్కాన్, ఎంఆర్ఐ, డిజిటల్ ఎక్స్‌రే మిషన్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. డయాగ్నస్టిక్స్ యంత్రాలు ఇన్‌స్టాలేషన్ పూర్తి అయిందని, ట్రయల్ రన్‌లో భాగంగా టెస్టులు నిర్వహిస్తున్నామని అధికారులు చెప్పారు. సనత్‌నగర్ టిమ్స్‌ను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ కార్డియాక్ కేర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌గా తీర్చిదిద్దాలని గతంలోనే అధికారులకు మంత్రి సూచించారు. ఇందుకు అనుగుణంగా అన్నిరకాల గుండె సంబంధిత ఆపరేషన్లు చేసేలా, అవయవమార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించేలా క్యాథల్యాబ్స్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ థియేటర్ల ఏర్పాటుపై మంత్రి ఆరా తీశారు. క్యాథల్యాబ్ ఏర్పాటు పనులు పూర్తయ్యాయని, ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మెడికల్ సర్వీసెస్‌తో పాటు సానిటేషన్, సెక్యూరిటీ వంటి నాన్ మెడికల్ సర్వీసెస్ విభాగాలు కూడా పటిష్టంగా ఉండాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పేషెంట్లు, వారి అటెండెంట్లకు భోజన సదుపాయం కల్పించాలని, అటెండెంట్ల కోసం ధర్మశాలను సైతం సిద్ధం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

# రేపు పాలిసెట్ పరీక్ష

### 1,06,439 మంది దరఖాస్తు

### 293 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే పాలీసెట్–2026 పరీక్షను రేపు(బుధవారం) నిర్వహించనున్నారు. రాష్ట్రం లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో 3 సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటుగా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమా కోర్సుల ప్రవేశానికై, బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలీసెట్ పరీక్షను నిర్వహించనున్నారు. పాలీసెట్–2026కు రాష్ట్ర వ్యాప్తంగా 1,06,439 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 56,494 మంది బాలురు ఉండగా 49,945 మంది బాలికలు ఉన్నారు. పాలీసెట్ కోసం రాష్ట్రంలో 293 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు సాంకేతిక విద్యశాఖ కమిషనర్, ఎస్‌బిటెట్ ఛైర్‌పర్సన్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను పరీక్ష కేంద్రం లోనికి ఒక గంట ముందుగానే అనుమతిస్తారని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకే పరీక్ష హాలులోకి చేరుకొని ఓఎంఆర్ షీట్ లోని రెండు వైపుల వివరాలను పూర్తి చేసి సంతకం చేయాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట హెచ్‌బి బ్లాక్ పెన్సిల్, ఏరేసర్, బ్లూ, బ్లాక్ బాల్ పెన్ తప్పక తీసుకొని రావాలని సూచించారు. పరీక్ష ప్రారంభం అయిన తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా అభ్యర్థిని పరీక్ష కేంద్రం లోనికి అనుమతించ బడరని స్పష్టం చేశారు. హాల్ టికెట్ మీద ఫోటో ప్రింట్ కానివారు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఐడీ ప్రూఫ్ (ఆధార్ కార్డు) తెచ్చుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ కానీ, ఏ ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. ఇంజనీరింగ్ డిప్లొమా చేయాలనుకునే వారు గణితం 60 మార్కులు, భౌతిక శాస్త్రం 30 మార్కులు, రసాయన శాస్త్రం 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుంది. వ్యవసాయం, ఉద్యానవన, వేటరినరీ డిప్లొమా చేయాలనుకునే వారు అదనంగా జీవశాస్త్రంలో మరో 30 మార్కులకు పరీక్ష రాయవలసి ఉంటుందని శ్రీదేవసేన తెలిపారు.

# రైతులను మోసగించే యత్నం భగ్నం

### షామీర్‌పేట్‌లో నిషేధిత బిటి-3 పత్తి విత్తనాల స్వాధీనం.. అదుపులో అక్రమ రవాణాదారు

**హైదరాబాద్ (నేరేడ్‌మెట్,మల్కాజిగిరి కమిషనరేట్), మే 11, ప్రభాతవార్త:** రైతులను నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలతో మోసం చేసి అక్రమ లాభాలు ఆర్జించాలన్న యత్నాన్ని మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భగ్నం చేశారు. షామీర్‌పేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 100 కిలోల నిషేధిత బీటీ3 (బీజీIII హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, షామీర్‌పేట్ పోలీసులతో కలిసి శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, రెండు సంచుల్లో నిషేధిత బీటీ3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. మొత్తం 100 కిలోల విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



నిషేధిత బిటి3 పత్తి విత్తనాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎస్‌వోటీ, షామీర్‌పేట్ పోలీసులు.

### 16 వరకు బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో

# అడ్మిషన్లకు దరఖాస్తు గడువు

### 30 డిగ్రీ కాలేజీల్లో బిబిఎ, యానిమేషన్‌తో సహా 31 కోర్సులు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని బీసీ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల డిగ్రీ కాలేజీల్లో 2026–27 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం ఈ నెల 16 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు ఎంజేపీ బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగుల సైదులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పాస్ అయిన విద్యార్థులు 2026–27 విద్యా సంవత్సరానికి ఎంజేపీబీసీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 20 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. బీసీ గురుకులాల్లో ఇంటర్ చదివిన విద్యార్థులు తమ సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని సెక్రటరీ సైదులు సూచించారు. ఎంజేపీలో కాకుండా ఇతర విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు బీసీ గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలలో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరం డిగ్రీ కోర్సులో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

దరఖాస్తులను ఈ నెల 10వ తేదీ వరకు స్వీకరించడానికి ఉన్న గడువును కాస్త ఈ నెల 16 వరకు పొడిగించినట్టు సెక్రటరీ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మార్కులను పరిగణలోకి తీసుకుని వారు కోరుకున్న కోర్సులో సీటు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 30 బీసీ డిగ్రీ కాలేజీలు అందుబాటులో ఉన్నాయని వాటిల్లో రెగ్యులర్ కోర్సులు బీఎస్సీ, బీకామ్, బీఏతో పాటు బీఎస్సీ (ఫిజికల్ అండ్ లైఫ్ సైన్సెస్) బీబీఏ, బీఎఫ్‌టీ, యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్‌తోపాటు ఆధునిక కోర్సులు అందిస్తున్నామని సైదులు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 040–23328266లో సంప్రదించాలని కార్యదర్శి సైదులు సూచించారు. విద్యార్థుల, తల్లిదండ్రుల వినతి మేరకు దరఖాస్తు గడువుని పొడిగించామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

# వేగంగా కొహెడ ఇంటెగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

### డిసెంబర్ 9 కల్లా అందుబాటులోకి తేవాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు



**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థను ఆధునీకరించే దిశగా కొహెడ సమగ్ర మార్కెట్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు కొహెడ సమగ్ర మార్కెట్‌కు సంబంధించిన సవరించిన లేఅవుట్‌పై మార్కెటింగ్ అధికారులతో ఈ సచివాలయంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రైతులు, వ్యాపారులు, ఇతర భాగస్వాముల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు రూపకల్పనను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దినట్లు వెల్లడించారు.

ప్రాజెక్టును 3 దశల్లో పూర్తి చేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు. తొలి దశ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి, ఈ ఏడాది డిసెంబర్ 9న మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం బాటసింగారం మార్కెట్‌లో కొనసాగుతున్న లావాదేవీలను కొహెడ సమగ్ర మార్కెట్‌కు సాఫీగా తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా సమన్వయంతో తరలింపు ప్రక్రియను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9 నుంచే కొహెడ మార్కెట్‌లో లావాదేవీలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కొహెడ సమగ్ర మార్కెట్‌ను అత్యాధునిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు. ఓపెన్ ప్లాట్‌ఫారాలు, ట్రక్ డాకింగ్ షెడ్లు, డ్రైయింగ్ యార్డులు, విశాల రహదారులు, రవాణా సౌకర్యాలు, పారదర్శక లావాదేవీల కోసం సాంకేతిక వసతులు, రైతులకు అవసరమైన అన్ని సేవలను అందుబాటులో ఉంచేలా ప్రత్యేక దృష్టి సాస్తు న్నామని పేర్కొన్నారు. ఈ సమగ్ర మార్కెట్ ద్వారా రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించడంతోపాటు మధ్యవర్తుల ప్రభావం తగ్గి పారదర్శక మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధిలో కొహెడ సమగ్ర మార్కెట్ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. మొత్తం ప్రాజెక్టును నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన తుది ప్రతిపాదనను ముఖ్యమంత్రికి ఆమోదం కోసం సమర్పిస్తున్నామని వెల్లడించారు .

# జిఒ 38 ప్రకారమే బదలీల ప్రక్రియ

### బదలీలను పారదర్శకంగా చేపడతాం

### మంత్రి దామోదర్ రాజనర్సింహా

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారం పారదర్శకంగా వైద్య, ఆరోగ్య శాఖలో బదలీల ప్రక్రియను చేపడుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. సెక్రటేరియట్‌లోని మంత్రి చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ నరహరి, జనరల్ సెక్రటరీ డాక్టర్ లాలూ ప్రసాద్ పాల్గొన్నారు.

గతంలో జనరల్ ట్రాన్స్‌ఫర్లు పారదర్శకంగా జరిగాయని, ఈసారి కూడా అదే విధంగా ట్రాన్స్‌ఫర్లు ఆఫ్‌లైన్‌లో చేయాలని డాక్టర్లు కోరారు. టీజీడీఏ ఆఫీస్ బేరర్లకు బదలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్నవారికి కూడా బదిలీల్లో అవకాశం ఇవ్వాలని, జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న వారికి హైదరాబాద్‌లోని కాలేజీల్లోకి వచ్చేందుకు అవకాశం కల్పించాలని డాక్టర్లు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం, పారదర్శకంగా ట్రాన్స్‌ఫర్లు చేపడుతామని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నామని.. ఇందుకు డాక్టర్ల సంపూర్ణ సహకారం అవసరమని మంత్రి స్పష్టం చేశారు.

మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవో ప్రకారం ట్రాన్స్‌ఫర్లు ఉంటాయన్నారు. అడ్మినిస్ట్రేషన్, టీచింగ్, క్లినికల్ వర్క్‌కి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాల్లోని కాలేజీలు, హాస్పిటళ్లలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి బదలీల్లో అవకాశం కల్పిస్తామని మంత్రి టిజిడిఏ అసోసియేషన్ నేతలకు తెలిపారు.

# జూన్ 12న డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ

### విద్యార్థులకు కిట్లు అందజేత

### లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 11:** సోమవారం సాయంత్రం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. జూన్, 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా పొగాకు, మద్యం, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించనున్నట్లు గవర్నర్‌కు సిఎం వెల్లడించారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు కిట్లు అందజేస్తామని గవర్నర్‌కు తెలియజేశారు. ప్రతిజ్ఞ కిట్ల పంపిణీ కార్యక్రమానికి గవర్నర్ శివప్రతాప్ శుక్లాను సిఎం ఆహ్వానించారు. కిట్లలో యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, క్రీడా దుస్తులు, విద్యార్థులకు అవసరమైన ఇతర సామగ్రి ఉంటాయని గవర్నర్‌కు తెలియజేశారు. తమ పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులు డ్రగ్స్, ఇతర వ్యసనాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉంచేలా యాజమాన్యాలు ప్రకటిస్తాయని గవర్నర్‌కు తెలియజేశారు. పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, ఈగల్ సంయుక్తంగా ఆధ్వర్యంలో సామూహిక ప్రతిజ్ఞ ఇతర కార్యక్రమాలు, విద్యా సంస్థలను సురక్షి తం, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, యాజమాన్యాల సమష్టి బాధ్యతపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఎం వివరించారు. కార్యక్రమానికి సంబంధించిన పూర్తి వివరాలు గవర్నర్ పరిశీలనార్థం ముందుగానే పంపుతామని గవర్నర్‌కు తెలిపారు.



# రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మి

### మరో ఆరుగురు సభ్యులు నామినేట్



**హైదరాబాద్, మే 11, ప్రభాత వార్త:** రాష్ట్రంలో మహిళల హక్కుల పరిరక్షణకు సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేసే లక్ష్యంతో తెలంగాణ సర్కార్ కీలక నియామకం జరిపింది. మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి (ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కుమార్తె)ని తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దీనికి సంబంధించి సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జారీ చేసిన అధికారిక ఉత్తర్వు ద్వారా ఈ నియామకాన్ని ప్రకటించారు. ఛైర్‌పర్సన్‌తో పాటు, తెలంగాణ మహిళా కమిషన్ చట్టం, 1998లోని నిబంధనల ప్రకారం ప్రభుత్వం కమిషన్‌కు ఆరుగురు సభ్యులను కూడా నామినేట్ చేసింది.

# నిజామాబాద్ వాగులో మొరం తవ్వుతున్న వ్యక్తుల అరెస్టు

### ట్రాక్టర్లు, జెసిబిల స్వాధీనం

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** నిజామాబాద్‌లోని మైలారం గ్రామ శివార్లలో గల పెద్ద వాగులో అక్రమంగా మొరం తవ్వుతున్న వ్యక్తులపై జిల్లా చీతా ఫోర్స్ (టాస్క్‌ఫోర్స్) పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. దర్పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వున్న మైలారం పెద్ద వాగు లో కొంత కాలంగా కొందరు కాంట్రాక్టర్లు అక్రమంగా మొరం తవ్వుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు చీతా ఫోర్స్ ఎసిపి మస్తాన్ వలి నేతృత్వంలోని పోలీసు బృందం దాడులు నిర్వహించింది. ఈ సందర్భంగా మొరం తవ్వకాలకు ఉపయోగిస్తున్న రెండు జెసిబి యంత్రాలను, మొరం తో వున్న 13 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. మొరం తవ్వకం వల్ల వాగులో నీరు నిలువ వుండక పోవడంతో పాటు పర్యావరణానికి హాని కలుగుతుందని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. పట్టుబడ్డ వాహనాలను, అరెస్టు చేసిన వ్యక్తులను తదుపరి విచారణ నిమిత్తం దర్పల్లి పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. అరెస్టయిన వారిపై మైనింగ్ చట్టంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జిల్లాలో అక్రమం గా మొరంతో పాటు ఇసుక తవ్వకాలపై ఆయా ప్రాంతాల ప్రజలు పోలీసుకు సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసు కమిషనర్ సాయి చైతన్య కో రారు.



# నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన 1,919 మందికి నేడు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు

### నియామక పత్రాలు అందజేయనున్న మంత్రి రాజనర్సింహా

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** వైద్య, ఆరోగ్య శాఖలో నర్సింగ్ ఆఫీసర్స్‌గా ఎంపికైన వారికి నేడు(మంగళవారం) నియామక పత్రాలను అందజేయనున్నారు. నర్సింగ్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఎంపికైన నర్సులకు నేడు(మే12) ఇంటర్ నేషనల్ నర్సెస్ డే సందర్భంగా ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందజేయ నున్నారు. కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు జరగనున్న కార్యక్రమంలో నియామక పత్రాలను మంత్రి అందజేయనున్నారు. ఇందుకోసం అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ అందుకోబోతున్న నర్సులకు ఇబ్బంది కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, ఉన్నతాధికారులను మంత్రి సోమవారం ఆదేశించారు. ఆరోగ్యశాఖలో 1919, లేబర్ డిపార్ట్‌మెంట్‌లో 257 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నియామకం చేసింది.

# సెప్టెంబరు 6న సీటెట్ సెషన్

### జూన్ 10 వరకు దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్–2026 సెప్టెంబర్ సెషన్‌ను సెప్టెంబర్ 6న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించడం ప్రారంభించారు. దరఖాస్తులను జూన్ 10 వరకు స్వీకరించనున్నట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) ప్రకటించింది. సీ టెట్ పరీక్షను దేశవ్యాప్తంగా 132 నగరాల్లో 27 భాషల్లో నిర్వహించనున్నారు. అభ్యర్థి అప్‌లోడ్ చేసిన దరఖాస్తు వివరాల్లో ఏవైనా సవరణలు ఉంటే వాటిని జూన్ 15 నుంచి 18 వరకు సరి చేసుకోవడానికి ఎడిట్ సౌకర్యం కల్పించారు. అడ్మిట్ కార్డులను పరీక్షకు రెండు రోజుల ముందు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించింది. అక్టోబర్ చివరి నాటికి ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉంటుందని ప్రకటించింది.



ధర్నాలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావుగౌడ్

# మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

### రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావుగౌడ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), మే 11, ప్రభాతవార్త:** ప్రధాని మోదీ తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు చారిత్రాత్మకమైనదని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం వాటా కల్పించటం అనేది దేశాభివృద్ధిలో ఒక కీలకమైన మైలురాయి అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావుగౌడ్ అన్నారు. సోమవారం ఎన్డీఏ భాగస్వామ్య పక్షమైన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే ఆదేశాల మేరకు మహిళా బిల్లుకు మద్దతుగా, ఇందిరాపార్కు ధార్నచౌక్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి శివనాగేశ్వరరావ్ మాట్లాడుతూ మహిళలకు గొప్ప మేలు జరుగుతూ ఉంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు, వారి మిత్రపక్షాలు మహిళా బిల్లు పట్ల వ్యవహరించిన తీరు అత్యంత విచారకరమని, మహిళల పట్ల వారికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని ధ్వజమెత్తారు. ధర్నా కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి రాజ్‌కుమార్, నాయకులు డాక్టర్ సంఘం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరు వరకు సర్ కార్యక్రమంపై 90 శాతం పురోగతి సాధించాలి

### కలెక్టర్లు, డిఇఓ, ఇఆర్‌ఓలతో సిఇఓ సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 11:** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా ఎన్నికల అధికారులు(డిఈఓ), ఎన్నికల నమోదు అధికారులు(ఈఆర్ఓలు)తో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సోమవారం సీఈఓ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం త్వరలో ప్రకటించనున్నందున, మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరు వరకు 90 శాతం పురోగతి సాధించాలని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆయన ఆదేశించారు. మ్యాపింగ్ కార్యక్రమానికి సహకరించేందుకు వివిధ రెసిడెన్షియల్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలను కలుపుకోవాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగులందరూ సంబంధిత ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేయించుకోవాలని సీఈఓ కోరారు. ఈఆర్‌వోస్,ఎఈఆర్వోస్,బిఎల్ఓ సూపర్వైజర్లు, బిఎల్ఓలు కలిసి గేటెడ్ కమ్యూనిటీలు, స్లమ్ ప్రాంతాలను సందర్శించి, అక్కడి ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టాలని ఆయన సూచించారు.

# కొత్త రుణాల సేకరణపై దృష్టి

**రెండు నెలల్లో రూ.12 వేల కోట్లు లక్ష్యం**

**7.5 శాతం వడ్డీతో 6 నుండి 25 యేళ్లలో చెల్లింపు**

**పాత రుణ మార్పిడికి తక్కువ వడ్డీకి మరో రూ.25 వేల కోట్లు**

**రిజర్వ్ బ్యాంక్‌కు ఆర్థిక శాఖ ప్రతిపాదనలు**

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలు, పథకాలకు భారీగా నిధులు అవసరం కావడంతో కొత్త రుణాల సేకరణపై ఆర్థిక శాఖ దృష్టి సారించింది. ఈ నెలతో పాటు, జూన్‌తో కలిపి కొత్తగా రూ.12 వేల కోట్లు సేకరించాలని తాజాగా నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ బాండ్లను వేలానికి పెట్టాలని రిజర్వు బ్యాంకుకు పంపిన ప్రతిపాదనల్లో కోరింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల వివరాలు ప్రకారం వీటి వేలం ద్వారా సమకూరిన మొత్తం రూ.12 వేల కోట్లను రాబోయే 6 నుంచి 25 ఏళ్లలో తిరిగి చెల్లిస్తామని తెలిపింది. వీటిని 7 శాతం నుంచి 7.5 శాతం వడ్డీకే తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో అధిక వడ్డీలకు తీసుకోవడం వల్ల వడ్డీ కిస్తీల భారం అధికమైనందువల్ల తక్కువ వడ్డీలకు వచ్చేవాటిపైనే ప్రధానంగా దృష్టిసారించింది. ఇక ప్రస్తుతం మెట్రో రైలు స్వాధీనం, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, ఆర్టీసీకి నిధులు సమకూర్చడం తదితర కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా డబ్బు అవసరం ఉంది. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలకే రాబోయే 100 రోజుల్లో రూ.6,200 కోట్లకుపైగా కావాలని అంచనా వేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య ఖర్చులన్నింటినీ ఆర్థిక శాఖ చెల్లిస్తోంది. మరో వైపు నెలకు రూ.700 కోట్ల నిధులను ఉద్యోగుల బిల్లులకు సర్దుబాటు చేస్తోంది. అలాగే మెట్రో మొదటి దశను రూ.15 వేల కోట్ల వ్యయంతో (అప్పుతో కలిపి) ఎల్అండ్‌టీ ఎంఆర్‌హెచ్ఎల్ నుంచి రాష్ట్రం ప్రభుత్వం తీసుకోడానికి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మొత్తంలో రూ.13 వేల కోట్ల రుణాలు, రూ.2 వేల కోట్ల ఈక్విటీ వాటా ఉంది. 100 శాతం ఈక్విటీ వాటాతో షేర్ పర్చేజ్ అగ్రిమెంట్ ద్వారా ప్రభుత్వం టేకోవర్ చేసుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐఆర్ఎఫ్ఎసీ రుణం ఇవ్వగా మిగిలిన మొత్తాన్ని హెచ్ఎండీఏ (హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ద్వారా సమకూర్చనున్నారు. ఈ మొత్తం తక్షణం అందజేస్తేనే గడువులోగా లావాదేవీ ప్రక్రియ పూర్తవుతుందని ప్రభుత్వాన్ని హెచ్ఎంఆర్ఎల్ కోరింది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం మరింత పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. ఇదే సమయంలో ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ ఆర్థిక వనరుల అన్వేషణలో కీలకంగా వ్యవహరిస్తోంది. ఈ నెలాఖరు నుంచి భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడం ద్వారా ఆదాయం సమకూరితే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాత బకాయిల చెల్లింపులకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయనేది ఆర్థిక శాఖ అంచనా. కాగా గతంలో అధిక వడ్డీకి తీసుకున్న రుణాలకు సంబంధించిన బకాయిలకు నెలనెలా కిస్తీల చెల్లింపుల భారం అధికంగా ఉన్నందు వల్ల వాటిని తక్కువ వడ్డీకి మార్చే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. గతేడాది ఈ విధానంలో కొన్ని రుణాలు తీర్చినప్పటికీ ఈ సంవత్సరం కొత్తగా రూ.25 వేల కోట్లు ఇలా తక్కువ వడ్డీకి తీసుకోవాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. వీటితో గతంలో సేకరించిన అధిక వడ్డీ రుణాల బకాయిలను ఒకేసారి తీర్చేయాలని ప్రయత్నాలు చేస్తోంది. గతంలో 10 నుంచి 11 శాతం వరకూ వడ్డీ చెల్లించే ఒప్పందంతో రుణాలు తీసుకోగా ఇప్పుడు 7 నుంచి 7.5 శాతానికే సేకరించి వాటిని తీర్చేస్తోంది. ఈవిధంగా రూ.25 వేల కోట్లపై 3 శాతం వరకూ వడ్డీని తగ్గించుకోగలిగితే ఏటా కనీసం రూ.వెయ్యి కోట్ల దాకా కిస్తీల చెల్లింపుల భారం తగ్గుతుందని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది.

## సినీ పరిశ్రమలో కీలక అడుగు

### సౌర విద్యుత్‌పై అల్లు సినిమాస్ ఒప్పందం

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** చిత్ర పరిశ్రమ రంగంలో సుస్థిర మౌలిక సదుపాయాల దిశగా అల్లు సినిమాస్ ఒక కీలక అడుగు వేసింది. నార్సింగిలోని కోకాపేటలో ఉన్న అల్లు సినిమాస్ 727 గిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు భారతదేశపు ప్రముఖ రూఫ్‌టాప్ సోలార్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు గాను రూ.2.28 కోట్లను పెట్టుబడి పెట్టేందుకు అల్లు సినిమాస్ భాగస్వామ్యం చేసుకున్నాయి. చిత్రి పరిశ్రమలో ఏర్పాటు చేయనున్న అతిపెద్ద సౌర విద్యుత్ ప్లాంట్లలో ఇది ఒకటిగా నిలుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన ఈ సౌర వ్యవస్థ, సినిమా థియేటర్ యొక్క విద్యుత్ అవసరాలలో సుమారు 60 శాతం తీర్చేలా రూపొందించబడింది. దీని ఫలితంగా, విద్యుత్ ఖర్చులు ఏటా రూ.52 లక్షల నుండి సుమారు రూ 5 లక్షలకు తగ్గనున్నాయని అంచనా. అలాగే ఇంధన అవసరాలను తీర్చడంతో పాటు, విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించి, వార్షిక కార్బన్ ఉద్గారాలను 750 టన్నుల మేర తగ్గిస్తుందని ప్రతిపాదించింది. దీనివల్ల ఏటా సుమారు రూ. 77-80 లక్షల ఆదా అవుతుందని ఒప్పందంలో పేర్కొంది. ఇదే సమయంలో ఈ వ్యవస్థాపన ద్వారా ఏటా సుమారు 750 టన్నుల ఉద్గారాలు గణనీయంగా తగ్గుతాయని అంచనా.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జ్యోతిరెడ్డి, డాక్టర్ ఎల్వీకే రెడ్డి, డాక్టర్ వీర్రాజు, చిత్రంలో ఆచార్య ఘంటా చక్రపాణి, పుష్పచక్రపాణి

## సిఆర్పీఎఫ్ ప్రాంగణంలో అంబేద్కర్ వర్శిటీ ప్రత్యేక అధ్యయన కేంద్రం

### సిఆర్పీఎఫ్ అంబేద్కర్ వర్శిటీ మధ్య ఒప్పందం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 11, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యా వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ఆవిష్కరణ, సమగ్రత, సంస్థాగత నాణ్యత, విస్తరణ అనే అంశంపై విద్యా వారోత్సవాలను సోమవారం విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి ప్రారంభించారు. వారం రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వీసీ వెల్లడించారు. ఇందులో భాగంగా విశ్వవిద్యాలయంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), ఆదివాసీ విద్యార్థులకు చేయూతగా నిలుస్తోన్న జ్యోతి రెడ్డి ఫౌండేషన్‌లతో విశ్వవిద్యాలయంలో ఆచార్య ఘంటా చక్రపాణి సమక్షంలో రిజిస్ట్రార్ డా.ఎల్. విజయ కృష్ణారెడ్డి, సీఆర్పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ వీర్రాజు, జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఛైర్పర్సన్ జ్యోతి రెడ్డి సంతకాలు చేసి అవగాహన ఒప్పందాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ సైనిక సిబ్బందికి ప్రత్యేక అధ్యయన కేంద్రం ఇవ్వడం సంతోషంగా ఉందని, దేశ సేవలో ఉండే వారికి సేవ చేసే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. యుద్ధ క్షేత్రంలో మరణించిన వీరుల భార్యలకు(సైనిక సిబ్బంది వితంతువులకు), దివ్యాంగులకు ఉచిత విద్యను అందించే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే లక్ష్యంతో తాము ముందుకు సాగుతున్నామన్నారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు, దేశ సేవలో నిరంతరం నిమగ్నమై ఉండే సైనిక సిబ్బందికి ఉచిత విద్యను అందించడం ద్వారా, ఈ విశ్వవిద్యాలయం ఇప్పటికే తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తోందన్నారు. విశ్వవిద్యాలయం రూపొందించిన సమాన అవకాశాల ప్రణాళిక కింద, రాష్ట్రంలోని గోండు, కోయ, చెంచు, ఇతర వెనుకబడిన గిరిజన వర్గాలకు చెందిన పిల్లలకు ఉచిత ఉన్నత విద్యను అందించే కార్యక్రమాన్ని ఇప్పటికే విశ్వవిద్యాలయం సేవలను అందిస్తుందన్నారు.



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డిసిపి రక్షిత కృష్ణమూర్తి

## యావన్ హత్య కేసులో పది మంది అరెస్ట్

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** చిలకలగూడలో బీటెక్ విద్యార్థి యవన్, చంద్రిక ప్రేమ వ్యవహారంలో నిందితులు యావన్ అలియాస్ అఖిల్(21) కిరాతకంగా హత్య చేశారు. ఈ కేసులో 10 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి కత్తి, వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడు సాయికిరణ్ తన అనుచరులతో కలిసి పక్కా పథకం ప్రకారం ఈ దారుణానికి పాల్పడ్డారని డీసీపీ రక్షి తా కృష్ణమూర్తి తెలిపారు. ఈ నెల 7న జరిగిన ఈ హత్య కేసు వివరాలను ఆమె మీడియాకు వివరించారు. నిందితుల్లో 9 మంది మేజర్స్ కాగా. ఒక బాలుడు ఉన్నాడని తెలిపారు. అమ్మాయి బావ సాయికిరణ్ ప్రోద్బలంతోనే హత్య జరిగినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. యావన్‌పై నిఘా పెట్టి, రెక్కీ నిర్వహించారు. అతడు స్నేహితుడి ఇంటి వద్ద ఉన్నట్లు తేల్చుకొని హత్య చేశారు. ఓ వ్యక్తి మొదట 16 నుంచి 17సార్లు కత్తితో యావన్‌ను పొడిచాడు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యావన్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. నిందితులు వాడిన కత్తి, బైక్, మొబైల్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులకు డ్రగ్స్ పరీక్షలు చేస్తే రాహుల్, శివ నందన్‌కు పాజిటివ్ వచ్చింది. కేసు దర్యాప్తు కొనసాగు తుందని డీసీపీ వివరించారు.

## ఔషధ రవాణాలో రైల్వే కీలక ముందడుగు ఔషధి ఎక్స్‌ప్రెస్

### కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** ప్రయాణికుల సేవలు, వస్తు రవాణాతో పాటుగా అత్యాధునిక సేవలను కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో దూసుకుపోతున్న భారతీయ రైల్వే ఇప్పుడు ఔషధాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిందని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. అందులో భాగంగానే ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పిఎం గతిశక్తి కార్యక్రమానికి కొనసాగింపుగా ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా అయిన హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్‌కు ఔషధాలను సరఫరా చేసేందుకు మే 2వ తేదీన ఔషధి ఎక్స్‌ప్రెస్ పేరుతో దేశంలోనే తొలి ప్రత్యేక ఫార్మసీ రైలును ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మొదటి రెగ్యులర్ ఔషధి ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలును తెలంగాణకు కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కి ధన్యవాదములు తెలియజేశారు. కీలకమైన ఫార్మాకంపెనీలకు కేంద్రమైన హైదరాబాద్‌లో తయారయ్యే ఫార్మా ప్రొడక్ట్స్‌ను, భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు తరలించడంతో పాటుగా అంతర్జాతీయంగా పంపిణీ చేసేందుకు ముంబై సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్‌కు తరలించడం తప్పనిసరి. అందుకే హైదరాబాద్‌ను, జెఎన్‌పిటిని అనుసంధానిస్తూ ఈ ప్రత్యేక రీఫర్ రైలు (కోల్డ్ స్టోరేజ్ వసతి గల రైలు)ను ప్రారంభించడం హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు చాలా మేలు జరగనుందని తెలిపారు. దీంతోపాటుగా దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది.

# రాజ్యాంగం దేశానికి సైనికుడిలాంటిది

### సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

### తెలంగాణకు ఖ్యాతి తెచ్చిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి : ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి

### జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారం ప్రదానం

**హైదరాబాద్ (నాంపల్లి), మే 11, ప్రభాతవార్త :** సరిహద్దుల్లో అహర్నిశలు అప్రమత్తంగా ఉంటూ దేశానికి కాపలాకాసే సైనికుని లాంటిది రాజ్యాంగమని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. దేశ పౌరులకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు, ప్రజా పాలనా వ్యవస్థ విఫలమైనప్పుడు న్యాయవ్యవస్థ తప్పకుండా జోక్యం చేసుకోవాలని జస్టిస్ స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి, ప్రముఖ న్యాయకోవిదుడు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి డా. ఎం.శ్రీధర్‌రెడ్డి ధర్మనిధి సాహిత్య పురస్కారం తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రదానం చేసింది. బొగ్గులకుంటలో సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డా. జి.చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని విశిష్ట అతిథులు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య, డా. బి.విజయలక్ష్మిలతో కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సత్కరించి సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు.

పురస్కారం కింద 25వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా, ప్రశంసాపత్రం అందజేశారు. సభకు చెన్నయ్య స్వాగతం పలుకగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డా. బి.విజయలక్ష్మి పురస్కార పరిచయం కావిస్తూ తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు డా. శ్రీధర్‌రెడ్డి పేరుతో ఆయన భార్య డా. విజయలక్ష్మి సారస్వత పరిషత్తులో నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రాజ్యాంగం-న్యాయవ్యవస్థ పాత్ర అనే అంశంపై ప్రసంగిస్తూ పి.వి.నరసింహారావు ప్రధానమంత్రిగా పదవీ స్వీకారం చేసినప్పుడు ఆయన అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్యతో మనం మంచి సంబంధాలతో పనిచేద్దాం అన్నారని, అప్పుడు వెంకటాచలయ్య అలా కుదరదని అన్న విషయం సుదర్శన్‌రెడ్డి గుర్తుచేస్తూ పరిపాలనలో లోటుపాట్లు జరిగినప్పుడు న్యాయవ్యవస్థ తప్పక జోక్యం చేసుకుంటుందని దానర్థమని అన్నారు. తాను ఓడిపోతానని తెలిసినా ఉపరాష్ట్రపతి ఎన్నికలో నిలబడడానికి కారణం దేశంపట్ల ఉన్న నిబద్ధతేనని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యఅతిథి డా. జి.చిన్నారెడ్డి న్యాయవ్యవస్థలో అత్యున్నత పదవులు అధిష్ఠించి తెలంగాణకు ఖ్యాతితెచ్చిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి సాహితీ పురస్కారం ప్రదానం చేయడం సముచితమని అభిప్రాయపడ్డారు.



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని సాహిత్య పురస్కారంతో సత్కరిస్తున్న చిన్నారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, విజయలక్ష్మి

## వారసత్వ హక్కులకు హత్యకేసు నిందితులు అర్హులు కారు!

### సుప్రీంకోర్టు సంచలన తీర్పు

**న్యూఢిల్లీ, మే 11:** వారసత్వ హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్నట్లయితే ఆ మృతుడి ఆస్తిని వారసత్వంగా పొందేందుకు అతడు అనర్హుడని తేల్చి చెప్పింది. మృతుడు రాసిన వీలునామాలో నిందితుడి పేరు ఉన్నప్పటికీ ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది. హిందూ వారసత్వ చట్టం, 1956లోని సెక్షన్ 25 ఆధారంగా ఈ తీర్పును వెలువరించింది. జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఒక వ్యక్తి హత్యకు పాల్పడినా లేదా దానికి సహకరించినా, ఆ మృతుడి ఆస్తిని పొందే హక్కును కోల్పోతారని సెక్షన్ 25 చెబుతోందని ధర్మాసనం గుర్తు చేసింది. ఈ నిబంధన వర్తించడానికి, హత్య కేసులో నేరం రుజువై శిక్ష పడాల్సిన అవసరం లేదని కోర్టు తేల్చి చెప్పింది. తప్పు చేసి దాని నుంచి ప్రయోజనం పొందడానికి ఎవరినీ అనుమతించకూడదు.

ఈ సూత్రం ఆధారంగానే మా తీర్పు ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో కే రఘునాథ్ అనే వ్యక్తి హత్య కేసులో ఒకరు నిందితుడిగా ఉన్నారు. అయితే, రఘునాథ్ తన ఆస్తిని ఆ నిందితుడికే చెందేలా వీలునామా రాశారని పేర్కొంటూ అతడు కోర్టును ఆశ్రయించాడు.

ఈ కేసులో తాను నిందితుడినన్న విషయాన్ని అతడు కోర్టుకు తెలపలేదు. ఈ వాస్తవాన్ని దాచిపెట్టడం కూడా తీవ్రమైన తప్పిదమని కోర్టు అభిప్రాయపడింది. ట్రయల్ కోర్టు ఈ పిటిషన్‌ను తిరస్కరించగా, హైకోర్టు అనుమతించింది. తాజాగా సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పును పక్కనపెట్టి ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. ఈ నిబంధన సహజ వారసత్వానికి, వీలునామా ద్వారా సంక్రమించే వారసత్వానికి కూడా వర్తిస్తుందని స్పష్టం చేసింది.

# వచ్చే నెలలో 'తెలంగాణ ప్రీమియర్ లీగ్'

**రాష్ట్రవ్యాప్తంగా 3వేల మంది ఆటగాళ్ల ఎంపిక**

**10మంది మాజీ క్రికెటర్లతో సెలెక్షన్ కమిటీ**

**ప్లేయర్ల ఎంపికలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్**

**ప్రతి ప్రక్రియ వీడియో రికార్డింగ్‌తో పర్యవేక్షణ**

**హెచ్‌సిఎ క్రికెట్ హెడ్ అంబటిరాయుడు, సెక్రటరీ మన్నె జీవన్‌రెడ్డి**




**హైదరాబాద్,మే 11,ప్రభాతవార్త:** తెలంగాణ యువ క్రికెటర్లకు అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) మ్యాచ్‌లను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని అంబటి రాయుడు తెలిపారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెక్రటరీ మన్నె జీవన్ రెడ్డి, ఆపరేషన్స్ హెడ్ సీఈఓ ఇంతియాజ్ అలీ కలిసి హైదరాబాద్ ఉప్పల్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో నిర్వహించి ప్రెస్‌మీట్‌లో లీగ్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెలలో నిర్వహించనున్న తెలంగాణ ప్రీమియర్ లీగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు మూడు వేల మంది ప్రతిభావంతులైన క్రికెటర్లను గుర్తించి ఎంపిక చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. యువ ఆటగాళ్లకు సరైన వేదిక కల్పించడం ద్వారా భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. హెచ్‌సీఏ సెక్రటరీ మన్నె జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ ప్రభావం లేకుండా పూర్తిగా పారదర్శక విధానంలో పది మంది మాజీ క్రికెటర్లతో సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియలో ఎటువంటి అవకతవకలకు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆటగాళ్ల ఎంపికలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విధానాన్ని ప్రవేశపెట్టామని తెలిపారు. దీని ద్వారా నిజమైన ప్రతిభ కలిగిన ఆటగాళ్లను గుర్తించే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి ఎంపిక ప్రక్రియను వీడియో రికార్డింగ్ ద్వారా పర్యవేక్షిస్తామని, సెలెక్షన్‌కు సంబంధించిన ఫిజికల్ రికార్డులను కూడా సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడంలో ఐపీఎల్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్న అంబటి రాయుడు, అదే తరహాలో హెచ్.సీఏ ఆధ్వర్యంలో కూడా పారదర్శకంగా లీగ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఓపెన్ ట్రయల్స్, లీగ్ మ్యాచ్ ల నిర్వహణను మరింత విస్తృతంగా చేపడుతున్నామని, ప్రతి నిర్ణయం నిష్పక్షపాతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రాబోయే లీగ్‌లకు సంబంధించిన తుది నిర్ణయాలను సెలెక్షన్ కమిటీ తీసుకుంటుందని, ఆటగాళ్లు, అంపైర్ల నియామక ప్రక్రియ కూడా ఇప్పటికే ప్రారంభించామని నిర్వాహకులు వెల్లడించారు.

**సెలక్షన్ కమిటీ..**

సీనియర్స్ సెలక్షన్ కమిటీకి పి.అక్షాంత్‌రెడ్డి చైర్మన్‌గా టి.సుమన్, మెహది హసన్, టి.పవన్ కుమార్, ఇందర్‌శేఖర్‌రెడ్డి సభ్యులుగా వ్యవహరించనున్నారు. అలాగే జూనియర్స్ సెలక్షన్స్ కమిటీకి అకాశ్ బండారి చైర్మన్‌గా పి.రమేష్ కుమార్, షోయబ్, సర్వేష్‌కుమార్, టి మోతి కుమార్ సభ్యులుగా వ్యవహరించనున్నారు.



## తెలంగాణలో రాజకీయ మార్పు అనివార్యం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బిజెపికి ప్రజలు మద్దతు ఇస్తున్న తరహాలోనే తెలంగాణలో కూడా రాజకీయ మార్పు అనివార్యమవుతుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభను విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని సభకు తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా భారీ ఎత్తున తరలివచ్చారని, నాన్‌ఎలక్షన్ సమయంలో సైతం ఇంతటి జనసంద్రం కనిపించడం తెలంగాణలో బిజెపిపై పెరుగుతున్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సభ విజయవంతం కావడంలో పార్టీ కార్యకర్తల అహర్నిశల శ్రమ, నాయకత్వ సమన్వయం, కార్యకర్తల నిబద్ధత ప్రధాన కారణమని అన్నారు. గ్రౌండ్‌లో ఉన్న జనసందోహానికి మించి బయట కూడా వేలాదిగా ప్రజలు ఉండటం బిజెపిపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని స్పష్టం చేస్తోందన్నారు. సాధు సమాజం నుంచి స్వామీజీలు, బంజారా, లంబాడీ సమాజాల మహిళలు, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, న్యాయవాదులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం సభను ఒక మహోత్సవంలా మార్చిందని తెలిపారు. తెలంగాణ సమాజంలోని ప్రతి వర్గం బిజెపి వైపు ఆశతో చూస్తుందని అన్నారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వం తెలంగాణలో కొత్త రాజకీయ దిశను తీసుకురాబోతుందని, రాబోయే రోజుల్లో బిజెపి తెలంగాణలో బలమైన ప్రత్యామ్నాయంగా అవతరించబోతుందని ధీమా వ్యక్తం చేశారు.

## అది పూర్తిగా బండి సంజయ్ కుటుంబ వ్యవహారం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** బిజెపి ఎంపి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన ఫోక్సో కేసుపై ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పందించారు. ఈ వివాదంతో భారతీయ జనతా పార్టీకి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బండి భగీరథ్ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టం ముందు అందరూ సమానమేనని, ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అసలేం జరిగిందనే అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ వివాదాన్ని రాజకీయంగా వాడుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. "ఇది కేవలం బండి సంజయ్ వ్యక్తిగత కుటుంబ వ్యవహారం. దీనికి పార్టీతో ముడిపెట్టడం సరికాదు" అని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఆర్థిక గందరగోళం: ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, మే 11 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రి నరేంద్రమోడీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. సిఎం పాలన, ఆర్థిక సమాఖ్య వ్యవస్థపై సరైన అవగాహన లేకపోవడం, ప్రజలను రాజకీయ లాభాల కోసం తప్పుదారి పట్టించే ప్రయత్నమేనని స్పష్టంగా తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. గుజరాత్ రాష్ట్రం అభివృద్ధి చెందడానికి కారణం కాంగ్రెస్ నేతృత్వంలోని యూపిఏ ప్రభుత్వమేనని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం, అర్థరహితం అన్నారు. గుజరాత్ ఒక మోడల్ రాష్ట్రంగా ఎదగడానికి కారణం నరేంద్ర మోడీ దూరదృష్టి, పారదర్శక పాలన, ఆర్థిక క్రమశిక్షణ, పారిశ్రామిక దృష్టికోణం, పరిపాలనా సామర్థ్యం కాంగ్రెస్ దాతృత్వం కాదని సుభాష్ స్పష్టం చేశారు. తనను తాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ముఖ్యమంత్రి స్థాయిలో పోల్చుకోవడం రాజకీయ అతిశయోక్తి, రాజకీయ ఆత్మస్తుతి మాత్రమే అని సుభాష్ వ్యాఖ్యానించారు. నరేంద్ర మోడీ గుజరాత్‌ను దూరదృష్టి, కష్టపడి పనిచేసే నాయకత్వం, అవినీతి రహిత పాలన, పెట్టుబడిదారుల విశ్వాసం, మౌలిక వసతుల విస్తరణ, పరిపాలనా బాధ్యతతో మార్చారు. కానీ కాంగ్రెస్ పాలనలోని తెలంగాణ ప్రస్తుతం ఆర్థిక గందరగోళం, నెరవేరని హామీలు, పెరుగుతున్న అప్పులు, పాలనా వైఫల్యాలు, రాజకీయ ప్రదర్శనలతో బాధపడుతుందని అన్నారు.

## పంజాగుట్టలో డ్రగ్స్‌తో చిక్కిన సాఫ్ట్‌వేర్ టెకీలు

### ఎండిఎంఎ, చరస్ డ్రగ్స్‌తోపాటు కారు స్వాధీనం

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), మే 11, ప్రభాతవార్త:** ఎండిఎంఎ, చరస్ డ్రగ్స్ విక్రయానికి వచ్చిన నలుగురు సాఫ్ట్‌వేర్ టెకీలను పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి ఎండీఎంఏ, చరస్ డ్రగ్స్‌తోపాటు హ్యుం దాయ్ వెర్నా కారును స్వాధీనం చేసుకున్నారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. సోమాజిగూడలోని ది పార్క్ హోటల్ రోడ్డుకు ఓ వ్యక్తి నల్ల రంగు హ్యుందాయ్ కారులో వచ్చి ఎండీఎంఏ, చరస్ డ్రగ్స్‌ను విక్రయించనున్నట్లు పంజాగుట్ట పోలీసులకు సమాచారం రావడంతో ఉన్నతాధికారుల అనుమతితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. కారులో వచ్చిన వ్యక్తి మరో ముగ్గురితో కలిసి మాట్లాడుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. పట్టుబడిన వారిలో సికింద్రాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆర్. కేశవ్ రాజ్‌సింగ్ (30), ఈస్ట్ మారేడుపల్లికి చెందిన హెచ్ఆర్ ఉద్యోగి అయుష్ గుప్తా(30), వెస్ట్ మారేడుపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రోహన్ విలియమ్స్(30), టీసీఎస్‌లో ఏఐ ఇంజనీర్‌గా పనిచేసే లక్కిరెడ్డి నిఖిల్ అనురాగ్(29) ఉన్నారు. విచారణలో ప్రధాన నిందితుడు కేశవ్ రాజ్‌సింగ్ డ్రగ్స్ విక్రయి స్తున్నట్లు అంగీకరించాడు. పంజాగుట్ట పోలీసులు ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# సోమనాథ్ ఆలయంలో మోడీ

- 11 పుణ్యక్షేత్రాల జలాలతో శివాభిషేకం
- ప్రధాని రోడ్ షోలో హర్ హర్ మహాదేవ్ నినాదాలు

**గిర్ సోమనాథ్, మే 11:** గుజరాత్‌లోని గిర్ సోమనాథ్ జిల్లాలో ఉన్న పవిత్ర పుణ్యక్షేత్రం సోమనాథ ఆలయ పునర్నిర్మాణం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'సోమనాథ్ అమృతోత్సవాలు' అత్యంత వైభవంగా జరిగాయి. సోమవారం, సోమనాథ ఆలయంలో నిర్వహించిన "అమృత్ పర్వ" కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని సాంప్రదాయబద్ధంగా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి 'విశేష మహా పూజ' నిర్వహించడంతోపాటు కుంభాభిషేకం చేశారు. శివుని 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ ఆలయపు వైభవోపేత శిఖరానికి, దేశవ్యాప్తంగా ఉన్న 11 పవిత్ర పుణ్యక్షేత్రాల నుంచి తెచ్చిన జలాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ శిఖరంపై ధ్వజారోహణం చేశారు. పునరుద్ధరించిన సోమనాథ ఆలయాన్ని భారతదేశపు మొదటి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల కళాకారులు, సుదూర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

**ప్రధాని రోడ్ షో:** సోమనాథ్ అమృత్ మహోత్సవంలో పాల్గొనడానికి ముందు, ప్రధాని మోడీ ఒక భారీ రోడ్ షో నిర్వహించారు. ఆయనతో పాటు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, ఉప ముఖ్యమంత్రి హర్ష్ సంఘ్వీ కూడా ఉన్నారు. ప్రధానికి స్వాగతం పలకడానికి రోడ్డుకు ఇరువైపులా భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. నగరం అంతటా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రజలు చేతుల్లో జెండాలు, బ్యానర్లతో ప్రధానికి స్వాగతం పలికారు. "హర్ హర్ మహాదేవ్", "మోడీ మోడీ" నినాదాలతో వాతావరణం మారుమోగింది. ప్రధాని కూడా చేయి ఊపి అందరికీ అభివాదం చేశారు.

# స్టాలిన్‌తో సీఎం విజయ్ భేటీ

- మాజీ ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కొత్త సీఎం
- సాదర ఆహ్వానంతో సత్కరించిన డీఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్



**చెన్నై, మే 11:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ గత ముఖ్యమంత్రుల కంటే భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తమిళనాడు చరిత్రలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రత్యర్థులపై పగ ప్రతీకారాలు తీర్చుకునే సంస్కృతి ఉండేది. ఆ సంస్కృతికి గత స్టాలిన్ హయాంలోనే ఫుల్‌స్టాప్ పడింది. తాజాగా ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ అయితే మరింత భిన్నంగా ఉంది. ఎన్నికల్లో ఓటమి చవిచూసిన మాజీ సీఎం స్టాలిన్ నివాసానికి స్వయంగా సీఎం విజయ్ వెళ్లి పరామర్శించారు. విజయ్ ఇంటికి రాగానే స్టాలిన్ శాలువాతో సత్కరించారు. ముందుగా ఉదయనిధి స్టాలిన్ ఘనస్వాగతం పలికారు. అనంతరం స్టాలిన్ ఆలింగనం చేసుకున్నారు. స్టాలిన్‌ను కలిసి పలు సూచనలు, సలహాలు, అనుభవాలు కావాలని కోరినట్లుగా తెలుస్తోంది. సహజంగా ఓడిపోయిన ప్రత్యర్థుల ఇళ్లకు ఏ ముఖ్యమంత్రి వెళ్లరు. కానీ విజయ్ మాత్రం అందుకు భిన్నంగా స్టాలిన్ నివాసానికి వెళ్లి పరామర్శించడం దేశ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారి తీసింది. ఇక స్టాలిన్‌ను కలిసిన అనంతరం మరో ఎండీఎంకే నేత వైకోను విజయ్ కలిశారు. ఇలా విపక్ష నేతలతో వరుసగా కలుస్తున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. విజయ్ నేతృత్వంలోని టీవీకే మాత్రమే 108 సీట్లతో అతి పెద్ద పార్టీగా అవతరించింది. మ్యాజిక్ ఫిగర్‌కు 10 సీట్ల దూరంలో ఉండిపోయింది. దీంతో 5 రోజుల పాటు రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడింది. పూర్తి మెజార్టీతో వస్తేనే ప్రమాణం చేయిస్తానని గవర్నర్ అర్లేకర్ తేల్చి చెప్పడంతో విజయ్ ప్రమాణస్వీకారం వాయిదా పడింది. డీఎంకే కూటమిలో భాగమైన కాంగ్రెస్, వీసీకే, ముస్లిం లీగ్, వామపక్షాలు మద్దతు ఇవ్వడంతో విజయ్ బలం 120కి చేరింది. దీంతో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. ఇక సోమవారం ఉదయం ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు. తొలుత విజయ్ ప్రమాణం చేయగా అనంతరం మిగతా ఎమ్మెల్యేలంతా ప్రమాణం చేశారు.

**మంత్రి కీర్తన ప్రమాణస్వీకారం వాయిదా:** తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారోత్సవంలో ఒక అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వంలో మంత్రిగా ఎంపికైన కీర్తన, సాంకేతిక కారణాల వల్ల ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. సాధారణంగా ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు అసెంబ్లీలో ప్రమాణం చేసే సమయంలో తమ ఎలక్షన్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. మంత్రి కీర్తన ఆ ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకురాకపోవడంతో ఆమె ప్రమాణ స్వీకారాన్ని ప్రొటెం స్పీకర్ వాయిదా వేశారు. అసెంబ్లీ నిబంధనల ప్రకారం, ఎన్నికల రిటర్నింగ్ అధికారి జారీ చేసే ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న వారిని మాత్రమే ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారానికి అనుమతిస్తారు. అందరూ ఎమ్మెల్యేలుగా ప్రమాణం చేస్తున్న తరుణంలో, ఒక మంత్రి ఇలాంటి కీలకమైన పత్రాన్ని మర్చిపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దీంతో ఆమె ప్రమాణ స్వీకారం తాత్కాలికంగా ఆగిపోయింది. అవసరమైన పత్రాలను సమర్పించిన తర్వాత ఆమె మరోసారి ప్రత్యేకంగా ప్రమాణం చేసే అవకాశం ఉంది.



## అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా ఉదయనిధి



**చెన్నై, మే 11:** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మార్పుల నేపథ్యంలో డీఎంకే పార్టీ యువజన విభాగం కార్యదర్శి, ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్‌ను డీఎంకే శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంది. శాసనసభ్యుల ప్రమాణ స్వీకారానికి ముందు ఈ ప్రకటన వెలువడింది. ఉపనేతగా సీనియర్ నేత కేఎన్ నెహ్రూ, పార్టీ విప్‌గా ఈవీ వేలును నియమించారు.

## స్పీకర్ ఎన్నిక బరిలోకి డిఎంకె



**చెన్నై, మే 11:** తమిళనాడులో కొలువుదీరిన విజయ్ ప్రభుత్వానికి తొలి రాజకీయ సవాల్ ఎదురైంది. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాకముందే మంగళవారం జరగనున్న స్పీకర్ ఎన్నికను అధికార, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. టీవీకే ప్రభుత్వానికి పోటీగా ప్రతిపక్ష ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) తమ అభ్యర్థిని బరిలోకి దింపాలని నిర్ణయించింది. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత ఆర్.శక్కర పాణిని డీఎంకే తమ స్పీకర్ అభ్యర్థిగా నిలబెట్టనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. 17వ తమిళనాడు అసెంబ్లీ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. మంగళవారం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరగనుంది. అసెంబ్లీలో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. డీఎంకే 59 స్థానాలతో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా అవతరించగా, అన్నా డీఎంకే 47 సీట్లతో మరో ముఖ్య ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉంది. ఎన్నికల ఓటమి తర్వాత పళనిస్వామి నాయకత్వంపై అన్నాడీఎంకేలో అసంతృప్తి మొదలయింది. స్పీకర్ ఎన్నికల సమయంలో కొందరు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ లేదా ఓటింగ్‌కు గైర్హాజరయ్యే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ బలాన్ని పరీక్షించాలని డీఎంకే వ్యూహం పన్నినట్లు తెలుస్తోంది. అధికార టీవీకే పార్టీకి సీపీఐ, సీపీఎం, వీసీకే వంటి పార్టీలు బయటి నుంచి మద్దతు ఇస్తున్నాయి. సీఎం విజయ్ రెండు స్థానాల్లో గెలిచి, తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేయడంతో అసెంబ్లీలో ప్రస్తుతం ఒక స్థానం ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో స్పీకర్ ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది.

# మోడీ వ్యాఖ్యలు వైఫల్యాలకు నిదర్శనం



**న్యూఢిల్లీ, మే 11:** ప్రధాని మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి వైఫల్యానికి నిదర్శనం అని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం ఎక్స్ వేదికగా రాహుల్ స్పందిస్తూ నిన్న మోడీజీ ప్రజలను త్యాగాలు చేయమని అడిగారు. బంగారం కొనొద్దు, విదేశాలకు వెళ్లొద్దు, పెట్రోల్ వాడకం తగ్గించండి అన్నారు. ఇవి ఉపన్యాసాలు కాదు వైఫల్యానికి రుజువులని పేర్కొన్నారు. 12 ఏళ్లలో ఆయన దేశాన్ని ఇంతటి స్థితికి తీసుకొచ్చారు. ప్రతిసారీ బాధ్యతను ప్రజలపైకి నెట్టివేసి, తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక రాజీపడిన ప్రధాని దేశాన్ని నడిపించడం ఇక సాధ్యం కాదని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లో ఆదివారం బీజేపీ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ఒత్తిడి పడుతోందని తెలిపారు. ప్రజలు ఏడాది పాటు బంగారం కొనడం ఆపాలని, విదేశీ ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించి, మెట్రో, కార్ పూలింగ్ వంటివి ఉపయోగించాలని సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని మళ్లీ పాటించాలని, వంట నూనెలు, ఎరువుల వాడకం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. విదేశీ మారకాన్ని ఆదా చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# కోట్లల్లో సినిమాకు పారితోషికం.. సిఎంగా రూ.2.85 లక్షల జీతం!

**చెన్నై, మే 11:** తమిళ సినీ రంగంలో అగ్రశ్రేణి నటుడిగా, సూపర్‌స్టార్‌గా కోట్లాది రూపాయల పారితోషికం అందుకున్న దళపతి విజయ్, ఇప్పుడు తమిళనాడు ముఖ్యమంత్రిగా కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. ముందురోజు ఆయన సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. నటుడిగా అత్యధిక పారితోషికం తీసుకున్న ఆయన, ఇప్పుడు ప్రజా సేవకుడిగా నెలకు ఎంత జీతం తీసుకోబోతున్నారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ముఖ్యమంత్రికి నెలకు రూ.2 లక్షల ఐదువేలు ప్రాథమిక వేతనంగా అందుతుంది. ఇది ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కాస్త తక్కువే. ఎమ్మెల్యేగా లభించే నియోజక వర్గ భత్యం (సీవీఏ), దినసరి భత్యం వంటి వివిధ అలవెన్సులను కలుపుకుంటే సీఎం విజయ్ నెలకు మొత్తం రూ. 2.85 లక్షలు జీతంగా అందుకుంటారు. ప్రజా ప్రతినిధిగా అధికారిక పనులు, సమావేశాలకు అయ్యే ఖర్చుల కోసం ఈ భత్యాలను చెల్లిస్తారు. జీతంతో పాటు ముఖ్యమంత్రి హోదాలో విజయ్‌కు పలు ప్రభుత్వ సౌకర్యాలు లభిస్తాయి. చెన్నైలోని ఓ విలాసవంతమైన ప్రాంతంలో పూర్తి సదుపాయాలతో కూడిన అధికారిక నివాస బంగ్లాను కేటాయిస్తారు. క్యాంపు కార్యాలయం, సిబ్బంది కోసం కూడా ఇందులో ఏర్పాట్లు ఉంటాయి. ప్రయాణాల కోసం బుల్లెట్‌ప్రూఫ్ ఎస్‌యూవీతో పాటు పూర్తి కాన్వాయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. రాష్ట్రంలో లేదా దేశంలో అధికారిక పర్యటనల సమయంలో విమాన, రైలు, రోడ్డు ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. అంతేగాక బసను కూడా స్టేట్ గెస్ట్‌గా ఏర్పాటు చేస్తారు. ముఖ్యమంత్రిగా విజయ్‌కు అత్యున్నత స్థాయి భద్రత కల్పిస్తారు. ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉంటుంది. ఇందులో భాగంగా 30 మందికి పైగా ఎలైట్ కమాండోలు, పోలీసు సిబ్బంది నిరంతరం ఆయన భద్రతను పర్యవేక్షిస్తారు. పదవీ విరమణ తర్వాత కూడా మాజీ ముఖ్యమంత్రి హోదాలో పెన్షన్, వైద్య సదుపాయాలు, ఉచిత రైలు ప్రయాణం, పరిమిత సిబ్బందితో కూడిన కార్యాలయ నిర్వహణ ఖర్చులు వంటి ప్రయోజనాలు జీవితాంతం కొనసాగుతాయి.



# అన్నాడిఎంకెలో మొదలైన వర్గపోరు!

**చెన్నై, మే 11:** అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం అన్నాడీఎంకే పార్టీలో తీవ్ర సంక్షోభానికి దారితీసింది. కేవలం 47 సీట్లకే పరిమితమై మూడో స్థానానికి పడిపోవడంతో పార్టీలో నాయకత్వ మార్పుపై చర్చ మొదలైంది. ఈ క్రమంలో మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి (ఈపీఎస్), సీనియర్ నేత సీవీ షణ్ముగం వర్గాల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. పళనిస్వామి తన నివాసంలో ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీ ముగిసిన వెంటనే షణ్ముగం నివాసంలో మరో కీలక సమావేశం జరిగింది. దాదాపు 37 మంది ఎమ్మెల్యేలు హాజరైనట్లు సమాచారం. ఈ పరిణామం పార్టీలో వర్గపోరును స్పష్టం చేస్తోంది. కొందరు నేతలు ముందుగా పళనిస్వామిని కలిసి, ఆ తర్వాత షణ్ముగం వద్దకు వెళ్లడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చింది. షణ్ముగం వర్గంలో ఎస్పీ వేలుమణి, సీ విజయభాస్కర్, కేసీ వీరమణి వంటి సీనియర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు, పళనిస్వామి వర్గం నిర్వహించిన సమావేశానికి 16 మంది జిల్లా కార్యదర్శులు హాజరైనట్లు తెలుస్తోంది. పార్టీలో మొత్తం 47 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ఎవరికి ఎంతమంది మద్దతు ఉందనే దానిపై గందరగోళం నెలకొంది. ఈ రాజకీయ పరిణామాలపై షణ్ముగం స్పందిస్తూ చూస్తూ ఉండండి అని వ్యాఖ్యానించడం ఉత్కంఠ రేపుతోంది. ఈ సంక్షోభంపై మాజీ ఎమ్మెల్యే మణిమేఖలై స్పందిస్తూ పళనిస్వామికి మద్దతు పలికారు.

## ఐదున్నర దశాబ్దాల తర్వాత కేబినెట్‌లోకి కాంగ్రెస్!

**చెన్నై, మే 11:** తమిళనాడు రాజకీయాల్లో దాదాపు ఐదున్నర దశాబ్దాల తర్వాత కాంగ్రెస్ పార్టీ మళ్లీ ప్రభుత్వంలో భాగం కాబోతోంది. విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంలో కాంగ్రెస్‌కు రెండు మంత్రి పదవులు కేటాయించడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించలేదు. 234 స్థానాలున్న అసెంబ్లీలో, తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసిన విజయ్ పార్టీ టీవీకే 108స్థానాలతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 118 సీట్ల మేజిక్ ఫిగర్‌కు చేరుకోలేకపోయింది. కాంగ్రెస్ 5 స్థానాల్లో గెలుపొందగా, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు కూడా టీవీకేకు మద్దతు ప్రకటించాయి. దీంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుచేయగలిగారు. తాజా పరిణామంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మంత్రులుగా ఎవరు ప్రమాణం చేస్తారనే దానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే ఢిల్లీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని ఏఐసీసీ పరిశీలకుడు గిరీశ్ చోడంకర్ తెలిపారు. మేలూరు ఎమ్మెల్యే పి.విశ్వనాథన్, కిళియూరు ఎమ్మెల్యే ఎస్.రాజేష్‌కుమార్ పేర్లున్నట్లు సమాచారం.



# తూర్పు సిక్కింలో మహిళలతో కేఫ్

**గ్యాంగ్‌టక్, మే 11:** తూర్పు సిక్కింలో భారత సైన్యం ఒక ప్రత్యేకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రఖ్యాత బాబా హర్భజన్ సింగ్ మెమోరియల్ టెంపుల్ సమీపంలో, సముద్ర మట్టానికి 13వేల అడుగుల ఎత్తులో పూర్తిగా మహిళలే నిర్వహించే కేఫ్‌ను ఏర్పాటు చేసింది. మహిళా సాధికారత, సరిహద్దు పర్యాటకాన్ని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశం అని అధికారులు తెలిపారు. గౌహతిలోని డిఫెన్స్ పబ్లిక్ రిలేషన్స్ కార్యాలయం ప్రకటన ప్రకారం త్రిశక్తి కోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. వ్యూహాత్మకంగా కీలకమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యాటకాన్ని, సామాజిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు సైన్యం చేపట్టిన రణభూమి దర్శన్ కార్యక్రమంలో భాగంగా ఈ కేఫ్‌ను ప్రారంభించారు. ఈ కేఫ్‌ను పూర్తిగా స్థానిక మహిళా బృందం నిర్వహిస్తుంది. దీనివల్ల మారుమూల పర్వత ప్రాంతాల్లోని మహిళలకు జీవనోపాధి అవకాశాలు గణనీయంగా మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. బాబా హర్భజన్ సింగ్ ఆలయాన్ని సందర్శించే పర్యాటకులకు కూడా మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కఠినమైన భూభాగం, వాతావరణ పరిస్థితులు ఉండే ఇలాంటి ప్రాంతాల్లోని మహిళల్లో స్వావలంబన, వ్యవస్థాపక స్ఫూర్తిని ఇది ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.


ఈ చొరవ పర్యాటక ప్రోత్సాహాన్ని జీవనోపాధితో అనుసంధానిస్తుందని, స్థానిక ఆర్థిక కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందని సైన్యం తెలిపింది. సరిహద్దు ప్రాంతాల్లో సైన్యం, పౌరుల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని, ఈశాన్య ప్రాంత ప్రజలతో సంబంధాలను బలోపేతం చేసేందుకు తమ నిబద్ధతను ఇది చాటుతోందని అధికారులు వెల్లడించారు.

# 'సర్' వల్లే కేరళలో కాంగ్రెస్ గెలిచింది!

- తిరువనంతపురం ఎంపి శశిథరూర్ సంచలన వ్యాఖ్య



**న్యూఢిల్లీ, మే 11:** పశ్చిమ బెంగాల ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలతో స్పందించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో జరిగిన అవకతవకలే బెంగాల్‌లో బీజేపీ గెలుపునకు ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. అలాగే కేరళలో వామపక్షాలు వేరువేరుచోట్ల ఒకే వ్యక్తికి ఓట్లు ఉండేటట్లు చేయడంలో ఆరితేరిన పార్టీలని సర్‌తో అవన్నీ తొలగిపోయాయని అందువల్ల కాంగ్రెస్ గెలుపు సులువయిందని భావిస్తున్నట్లు థరూర్ అన్నారు. ఓటర్ల జాబితా నుంచి భారీ సంఖ్యలో పేర్లను తొలగించడం, అలా తొలగించిన పేర్ల సంఖ్య బెంగాల్‌లో బీజేపీ గెలుపు మార్జిన్‌కు దాదాపు సమానంగా ఉండటాన్ని ఆయన ప్రశ్నించారు. స్టాన్‌ఫోర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో జరిగిన ఇండియా, దటీజ్ భారత్ అనే రౌండ్‌టేబుల్ సమావేశంలో థరూర్ తన విశ్లేషణను పంచుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో ఓటర్ల జాబితా నుంచి ఏకంగా 91 లక్షల పేర్లను తొలగించారు. వారిలో తాము జీవించి ఉన్నామని, ఓటు హక్కుకు అర్హులమని చెబుతూ 34 లక్షల మంది అప్పీల్ చేసుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి కేసును విడివిడిగా విచారించాలి. కానీ ఎన్నికలకు ముందు కేవలం కొన్ని వందల కేసులను మాత్రమే పరిష్కరించారు. ఈ రోజుకీ సుమారు 3132 లక్షల మంది అప్పీళ్లు పెండింగ్‌లోనే ఉన్నాయని శశిథరూర్ చెప్పారు. ఈ గణాంకాలను బీజేపీ గెలుపు మార్జిన్‌తో పోల్చి చూపిస్తూ థరూర్ కీలకమైన ప్రశ్నను లేవనెత్తారు. బెంగాల్‌లో బీజేపీ సుమారు 30 లక్షల ఓట్ల తేడాతో గెలిచింది. ఓటు వేసే అవకాశాన్ని కోల్పోయిన వారి సంఖ్య కూడా దాదాపు అంతే ఉంది. ఇప్పుడు చెప్పండి, ఇది పూర్తిగా న్యాయమైన, ప్రజాస్వామ్యబద్ధమైన ప్రక్రియేనా ఇదే నా ప్రశ్నఅని థరూర్ అన్నారు. నకిలీ, వలస వెళ్లిన, చనిపోయిన ఓటర్లను జాబితా నుంచి తొలగించడంతో తనకు ఎలాంటి సమస్య లేదని, కానీ లక్షలాది మంది అర్హులైన ఓటర్లు తమ హక్కును కోల్పోవడమే ఆందోళనకరమని శశిథరూర్ అన్నారు. ఇదే సమయంలో కేరళలో ఓటర్ల జాబితా సవరణవల్ల తమ కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. కేరళలో సీపీఎం డబుల్, ట్రిపుల్ ఓట్లను నమోదు చేయడంలో ఆరితేరిందని, ఒకే వ్యక్తికి నాలుగు వేర్వేరు బూత్‌లలో ఓట్లు ఉండేవని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నకిలీ ఓట్లు తొలగిపోవడం తమకు లాభించిందని అన్నారు. కేరళ, తమిళనాడులో బెంగాల్‌లా లక్షల్లో కాకుండా ఓటు పునరుద్ధరణ కోసం కేవలం కొన్ని వందల అప్పీళ్లు మాత్రమే వచ్చాయని థరూర్ పేర్కొన్నారు.



# కేరళ సిఎం పదవిపై కాంగ్రెస్‌లో తెగని పంచాయతీ

**తిరువనంతపురం, మే 11:** కేరళంలో తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే దానిపై ఉత్కంఠ ఇప్పటికీ వీడలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమి గెలిచినప్పటికీ సీఎం కుర్చీ కోసం కాంగ్రెస్‌లో పంచాయితీ తెగడం లేదు. ముఖ్యమంత్రి రేసులో వీడీ సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేష్ చెన్నితల ప్రధానంగా పోటీ పడుతున్నారు. వీరి అనుచరులు ఎవరికి వారుగా వీధుల్లోకి వచ్చి, ఆందోళనలు చేస్తుండటంతో నేతలంతా ఢిల్లీకి క్యూ కడుతున్నారు. ఈ అంతర్గత పోరుకు తక్షణమే ముగింపు పలుకాలని రాహుల్ గాంధీ ఈ ముగ్గురు నేతలకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. కేరళ ముఖ్యమంత్రి ఎవరనే దానిపై అతి త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తామని ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీనా దాస్‌మున్షీ స్పష్టం చేశారు. ఈ సీఎం రేసులో అత్యంత కీలక మలుపు వేణుగోపాల్ ఎంట్రీ. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేయకపోయినా, జాతీయ స్థాయిలో బలమైన నేతగా పేరొందిన ఆయనకు 43 మంది కాంగ్రెస్ నూతన ఎమ్మెల్యేల మద్దతు ఉందని కాంగ్రెస్ అధ్యక్షులు ఖర్గేకు పార్టీ పరిశీలకులు నివేదించారు. రాహుల్ గాంధీకి ఆప్తునిగా పేరొందిన వేణుగోపాల్‌ను కేరళ రాజకీయాలకు పంపుతారా లేదా జాతీయ స్థాయిలోనే పార్టీ వ్యూహకర్తగా కొనసాగిస్తారా అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ సతీశన్‌కు బహిరంగంగానే మద్దతు పలికింది. ప్రతిపక్ష నేతగా ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని దీటుగా ఎదుర్కొని పార్టీ విజయానికి బాటలు వేసిన సతీశన్‌కే ఆ పదవి దక్కాలని ఆయన వర్గీయులు వాదిస్తున్నట్లు సమాచారం. మరో అగ్రనేత సోనియాగాంధీకి సన్నిహితుడైన రమేష్ చెన్నితల మద్దతుదారులు తమ నేత గతంలో సీనియారిటీని పక్కనపెట్టి, సీఎం పదవి త్యాగం చేశారని, అందుకే ఈసారి కచ్చితంగా ఆయనకే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# 'అసీమ్ మునీర్ ప్రకటనలన్నీ డొల్లే'.. బహిర్గతమైందిలా



**ఇస్లామాబాద్, మే 11:** ఆపరేషన్ సిందూర్ వేళ అమెరికా సాయం కోసం పాకిస్థాన్ లాబీయింగ్ యత్నాలు బహిర్గమయ్యాయి. ఈ విషయం యుఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన ఫైలింగ్స్‌లో వెల్లడైంది. రక్షణ, ఆర్థిక శాఖ అధికారులు, జర్నలిస్టులతో పాక్ లాబీ సంస్థలు 60 సార్లకు పైగా భైటీ అయినట్లు పేర్కొంది. కాల్పుల విరమణ కోసం అమెరికా ద్వారా భారత్ ప్రయత్నాలు చేసిందని, ప్రాంతీయ శాంతి కోసం పాక్ ఆ అభ్యర్థనలను అంగీకరించిందని ఆదివారం రావల్పిండిలోని ఆర్మీ జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో అసిమ్ మునీర్ ప్రకటనలు చేశారు. అవి డొల్లే అని తాజాగా తేలిపోయింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకునేందుకు భారత్ ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఉగ్రస్థావరాలను మన సైన్యం నేలమట్టం చేసింది. ఆ సమయంలో వాషింగ్టన్‌లోని కీలక నేతలు, అధికారులతో పాక్ హడావుడిగా చర్చలు జరిపింది. మే 6 అర్ధరాత్రి భారత్ దాడుల ధాటికి కంగుతిన్న పాక్ 30 సార్లు వేర్వేరుగా సంప్రదింపులు చేపట్టింది. పాక్ అంబాసిడర్‌కు అమెరికా నేతలతో సమావేశాల కోసం ప్రయత్నాలు చేసింది. ఇక మే 7, 8న తమ ప్రాంతంలో ఉద్రిక్తతలపై చర్చించేందుకు లాబీయింగ్ చేసిందని రికార్డులు వెల్లడించాయి. మే 9న లాబీయింగ్‌ను మరింత పెంచింది. రక్షణ, జాతీయ భద్రతకు చెందిన వ్యక్తులతో 20 నుంచి 25 సార్లు సంప్రదింపులు చేపట్టింది. అమెరికా మీడియాలోని ప్రముఖ జర్నలిస్టులతోనూ పాక్ లాబీ సంస్థలు భేటీ అయ్యాయి.

వాషింగ్టన్‌లో భారత్, పాకిస్థాన్ కార్యకలాపాలకు పూర్తి వ్యత్యాసం కనిపించిందని ఆ ఫైలింగ్స్ ద్వారా వెల్లడవుతోంది. ఉగ్రవాదాన్ని ఖండించడం పైనా, పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా దౌత్యపరమైన మద్దతు కూడగట్టడం పైనా భారత్ సంప్రదింపులు చేపట్టింది ఇదిలా ఉంటే.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల విషయంలో భారత్ తొలి నుంచి మూడో పక్షం జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కంగుతిన్న పాక్ చివరకు కాళ్లబేరానికి రావడంతో మన ప్రభుత్వం కాల్పుల విరణకు అంగీకరించిన విషయం తెలిసిందే.

# బంగ్లాదేశ్‌తో సరిహద్దు కంచె... బిఎస్‌ఎఫ్‌కు భూమి బదలాయింపు



**కోల్‌కత్తా, మే 11:** భారత్‌బంగ్లాదేశ్ సరిహద్దుకు కంచె వేయడానికి అవసరమైన భూమిని సరిహద్దు భద్రతా దళం బిఎస్‌ఎఫ్‌కు బదిలీ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. అక్రమ చొరబాట్ల సమస్యను పరిష్కరించేందుకు 45 రోజులలోపు ఆ భూమిని కేంద్ర హోంశాఖకు అప్పగిస్తామని చెప్పారు. హౌరాలోని నబన్నాలో సమావేశమైన బెంగాల్ నూతన క్యాబినెట్ అందుకు అమోదం తెలిపినట్లు వెల్లడించారు. సమావేశం అనంతరం సీఎం సువేందు అధికారి మీడియాతో మాట్లాడుతూ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న ముఖ్య తీర్మానాల్లో బీఎస్‌ఎఫ్‌కు భూమిని బదిలీ చేయాలనేది ఒకటని చెప్పారు. సోమవారం మా తొలి మంత్రివర్గ సమావేశంలోనే బీఎస్‌ఎఫ్‌కు భూమిని బదిలీ చేయాలనే నిర్ణయం తీసుకున్నాం. ఈ భూమి బదిలీ ప్రక్రియ ఈరోజే ప్రారంభమవుతుంది. వచ్చే 45 రోజుల్లో దీని కేంద్రహోంశాఖకు బదిలీ చేస్తాం. బదిలీ పూర్తయిన తర్వాత బీఎస్‌ఎఫ్ సరిహద్దు కంచె నిర్మాణం చేస్తుంది. తద్వారా ఇన్నాళ్లుగా కొనసాగుతున్న అక్రమ చొరబాట్ల సమస్య పరిష్కారమవుతుందని సువేందు అధికారి ప్రకటించారు. సీనియర్ అధికారులతో జరిగిన తొలి క్యాబినెట్ సమావేశంలో డబుల్ ఇంజిన్ సర్కారు పాలనా ప్రాధాన్యతలు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించిందని తెలిపారు. తమ తొలి క్యాబినెట్ సమావేశంలో ఆరు నిర్ణయాలు తీసుకున్నామని సువేందు అధికారి చెప్పారు. ఆయుష్మాన్ భారత్, జన ఆరోగ్య యోజన సహా కేంద్ర సంక్షేమ పథకాలు ఇక నుంచి పశ్చిమ బెంగాల్‌లోనూ అమలవుతాయని సువేందు చెప్పారు. మా రాజకీయ పోరాటంలో ప్రత్యర్థుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన 321 మంది బీజేపీ కార్యకర్తల కుటుంబాలు కోరుకుంటే ఆ హత్య కేసులతో ప్రభుత్వం దర్యాప్తు ప్రారంభం చేయిస్తుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించడంలో సహకరించిన ఓటర్లు, ఎన్నికల సంఘం, పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు, రాజకీయ పార్టీలకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.



వైశాఖ బహుళ దశమి, పూర్వాభాద్రా నక్షత్రములో వైధృతి యోగములో, మధ్యాహ్న సమయములో హనుమంతుని జననం కలిగింది. అంజనాదేవి సంతానం కోసం తపస్సు చేయుచున్న సమయంలో దైవ సంకల్ప ప్రేరేపితుడైన వాయుదేవుని వలన కలిగిన కుమారుడే శ్రీహనుమంతుడు. దక్షి ణ భారతదేశములో వైశాఖ బహుళ దశమినాడు హనుమంతుని జయంతిని జరుపుకుంటారు. సీతాన్వేషణలో విశేషంగా కార్యసాధకుడని నిరూపించుకుని శ్రీరామునకు సీతమ్మ జాడ తెలియజేసి రామభక్త హనుమగా ప్రసిద్ధి చెందిన చిరంజీవి హనుమ. హనుమంతుడు అపారమైన బలశాలి మరియు శక్తిమంతుడు. పసితనంలోనే తూర్పున ఉదయిస్తున్న సూర్యుని చూసి, ఫలముగా భావించి పట్టుకునేందుకు

# రామభక్త హనుమ

ప్రయత్నించినాడు. అదే సమయములో రాహువు సూర్యుని పట్టుకునే ప్రయత్నం చేయగా, హనుమంతుని చూచి, రాహువు వెనుకకు మరలి పోయెను. ఈ సమయంలో ఇంద్రుడు హనుమపై వజ్రాయుధమును ప్రయో గింపగా, ఆయన దవడకు గాయమయ్యెను. ఈ గాయము కారణముగా హనుమం తుడు పెద్ద మూతిగలవాడుగా మారెను. అందువలనే ఆయనను హనుమంతునిగా భక్తులు పిలుచుకుందురు. వజ్రాయుధ ప్రభావముచే హనుమంతుడు క్రింద పడిపోగా, అలిగిన వాయుదేవుడు గాలిని బంధించి లోకాలను తపింప చేసెను. అప్పుడు ఇంద్రుడు ఇతర దేవతలు ప్రత్యక్షమై హనుమంతునకు విశేష వరములను ప్రసాదించినారు. ఆనాటినుండి హనుమంతుడు అపార బలశాలిగా మారెను. హనుమను చూసి రాహువు మరలిపోయిన కారణంగా హనుమంతుని ఉపాసన చేయుటవలన రాహుదోషము తొలగునని భక్తుల విశ్వాసము. తనకు గలిగిన అపార శక్తులతో, హనుమంతుడు తపము చేసుకునే మునులను బాధింప సాగాడు. మునులందరు హనుమంతుడు కారణజన్ముడు శ్రీరామ కార్యార్థిగా జన్మించెనని తమ తపో బలముతో గుర్తించిరి. అందువలన హనుమను అపారశక్తి సంపన్నుడవైన నీకు నీ బలము తెలియగుండుగాక, కాని ఎవరైనా గుర్తుచేసినంతనే నీ బలశౌర్యములు నీకు తెలియునుగాక అని మునులు శపించిరి. అందువలనే హనుమంతుని పొగడిన, అమిత సంతోషముతో భక్తుల మనోరథము నెరవేర్చును. వివిధ దేవతలు ఇచ్చిన వరప్రభావముతో, ఇంద్రుని వజ్రాయుధము ఎటువంటి ప్రభావము చూపదు. సరస్వతీ వరప్రభావముచే అఖండ జ్ఞానము కలిగెను. సూర్య వరప్రభావనుచే అఖండ తేజస్సు కలిగెను. వేదవేదాంగములను అతి సల్ప సమయములో నేర్చుకొనెను. ఎక్కడ శ్రీరామనామ సంకీర్తన జరుగుతుందో అక్కడ హనుమంతుడు తిష్టవేసుకుని కూర్చుంటాడు. ఆయన హృదయఫలకముపై వెలసిన శ్రీసీతారాముల అనుగ్రహము మనకు కలుగుతుంది. ఎంత భక్తి శ్రద్ధలతో మనము హనుమంతుని పూజ చేస్తామో, అంతగా ఆంజనేయుని అనుగ్రహము మనకు కలుగుతుందనుటలో ఎటువంటి సందేహము లేదు. సూర్యుని వద్ద నవవ్యా కరణము నేర్చిన హనుమంతుడు సంగీతములో నారదుని, తుంబురుని మించివాడు. జ్యోతిషంలోను, సాముద్రికంలోను అపారజ్ఞానము కలిగి ఇతరుల మనసును చదివే శక్తిసంపన్నుడు. అవతార మూర్త్యులెన సీతారాముల ఎడబాటుమయంలో, సముద్రమును లంఘించి, లంకకు చేరి, సీతాసాధ్విని కనుగొని శ్రీరామ ముద్రికను సీతాదేవికి, సీతాదేవి ఇచ్చిన చూడామణిని శ్రీరామునకు ఇచ్చి వారిని కలిపిన సంధానకర్త. సముద్ర వారధి నిర్మాత, లంకాదహన అజేయుడు. పవనతనయుని ఆశ్రయించినచో సమస్త దుఃఖములు తొలగి, సుఖసంతోషాలు కలుగుతాయి. భార్యాభర్తల మధ్య సయోధ్యకోసం ప్రతీమంగళవారము హనుమంతుని దర్శనము చేసుకుని, సుందరాకాండలోని 15వ మరియు 36వ సర్గలను పారాయణ చేసినచో అద్భుత ఫలితాలు కలిగి ఎడబాటుకు అవకాశం లేనివిధంగా అన్యోన్యత ఏర్పడుతుంది. రామస్యోపనిషత్తును పరిశీలించినచో హనుమంతుడు ఎంత గొప్ప తత్త్వవేత్తయో తెలియును. హనుమ మన మధ్యనే యున్నాడన్న సత్యమును గ్రహించిన తులసీదాసు మున్నగు మహాభక్తులు హనుమంతుని సాక్షాత్కారము చేసుకున్నారు. నేడు హనుమ జయంతి.

- డా. దేవులపల్లి పద్మజ

# టీనేజీ పిల్లల్లో దుబారా ..



ఖర్చు నెలా తగ్గించాలో తెలియక తల్లిదండ్రులు సతమతమవు తారు. ప్రతి తల్లీ చిన్నప్పటి నుంచే పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవరచాలి అంటారు నిపుణులు. ఆదాయాన్ని బట్టే ఖర్చులుండాలన్న విషయం పెద్దవాళ్లకే కాదు, పిల్లలకూ తెలిసుండాలి. యుక్త వయసుకొచ్చేసరికి దీనిపై వారికి అవగాహన తేగలగాలి. మీరిచ్చే పాకెట్‌మనీ మొత్తం ఖర్చు చేయడానికి కాదని మొదటేచెప్పాలి. అందులో సగ భాగాన్ని పొదుపు చేసేలా ప్రోత్స హించాలి. దానివల్ల ప్రయోజ నాలేంటో, అత్యవసరానికి అదెలా ఉపయోగపడుతుందో వివరించాలి. ఈ అలవాటు ఖర్చులపై నియంత్రణ కోల్పోకుండా చేస్తుంది.

**బాధ్యతలు తెలిసేలా...** ఇంటి ఆర్థిక వ్యవహారాల్లో పిల్లలను భాగస్వాములను చేయాలి. అద్దె, నిత్యావసర వస్తువులు, కరెంటు.. ఇలా నెలకయ్యే మొత్తం ఖర్చును వివరంగా పుస్తకంలో పొందుపరిచి పిల్లల కివ్వాలి. మీకొచ్చే ఆదాయం, నెలవారీ ఖర్చులు పోగా మీరు చేసిన పొందుపు గురించి వారిని లెక్కించమనండి. మీరు వాటినెలా సమన్వయం చేస్తున్నారో చెప్పండి. సెలవు రోజుల్లో సరిపడినంత నగదు వారి చేతికిచ్చి.. ఒక నెల బడ్జెట్ బాధ్యత అప్పగించండి. కుటుంబ అవసరాలు సహా ఆ నెలలో వచ్చేపుట్టిన రోజులు లేదా పండుగలకమయ్యే అదనపు ఖర్చును వారెలా సమన్వయం చేస్తారో చూడాలి. ఎక్కడైనా తడబడు తుంటే సూచన ల్విండి. ఇవన్నీ సర్దుబాట్లు తెలిసేలా చేస్తాయి.

**ఆ గీత దాటకుండా..** స్కూల్, కాలేజీ తెరుస్తున్నప్పుడు దుస్తులు, బూట్లు వంటివి కొనడానికెళ్లేటప్పుడు ముందుగానే వారికి బడ్జెట్ ఇవ్వండి. అందులోనే అవసరాలన్నీ తీరేలా ప్రణాళిక వేసుకోమనండి. లెక్క దాటేస్తే.. ఆ డబ్బుల్ని వారి పొదుపు నుంచి తీసుకోమంటే సరి. జాగ్రత్తగా ఉంటారు. తమ కోసం దాచుకెఉన్న నగదును వినియోగించా లంటే వారిలో నియంత్రణ మొదలవు తుంది. వారి వద్ద పొదుపు చేసిన నగదు లేకపోతే తిరిగి తీర్చమని చెప్పి అప్పుగా ఇవ్వాలి. దాన్నెలా తీర్చాలో చెప్పాలి. మనీ మేనేజ్ మెంట్ నైపుణ్యాల అలవరుస్తా యవి. అంతేకాదు. వారు చేసే ప్రతి ఖర్చూ రాయమంటే సరి. పునఃపరిశీలించు కోవడం ఎలానో తెలుస్తుంది. □

చిట్కా

బ్రేక్ ఫాస్ట్‌లో పండ్లు పచ్చి కూరగాయలు ఆహారంగా తీసుకోండి. ఇవి ఆకలి మితంగా వుండటానికి జ్ఞాపకశక్తికి, చక్కని శరీరాకృతికి మంచి ఛాయ రావడానికి తోడ్పడు తుంది. □



# అమ్మాయిలూ ఇవి పాటిస్తున్నారా?

చదువు, ఇతర వ్యక్తిగత పనుల హడావిడిలో పడిపోయి ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకపోతే ఇటు శారీరకంగా, అటు మానసికంగా వివిధ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. పైగా ఈ వేసవిలో నీటి ప్రభావం ఇంకాస్త ఎక్కువ ఉంటుంది. ఈ క్రమంలో కొన్ని టిప్స్ ఫాలో అయితే వేసవిలోనూ ఆరోగ్యంగా, ఉత్సాహంగా గడిపేయచ్చు. మరి అవేంటో చూద్దాం..



**ఆ నొప్పికి దూరంగా..** నెలసరి సమయంలో చాలామంది కడుపు నొప్పి, నడుంనొప్పి, ఒత్తిడి, చికాకు, ఇలా పలు రకాల సమస్యలతో సతమతమవు తుంటారు. అలాగని నీరస పడిపోతారు నడవడం, పరిగెత్తడం, ఆటలాడడం. వంటి వాటికీ ప్రాధాన్య మివ్వాలి. తద్వారా ఈ నొప్పుల నుంచి కాస్త ఉపశమనం పొందచ్చు. ఉత్సాంగానూ గడిపే యచ్చు. అలాగే ఎముకలు, వెన్నెముక, కండరాలు.. దృఢంగా మారడానికి ఇవి చక్కగా ఉపయోగపడతాయి.

**మచ్చలేని చర్మానికి...** వేసవి వచ్చిందంటే చాలామంది చల్లటి పానీయాల్ని ఆశ్రయిస్తుంటారు. ఇందులోనూ ముఖ్యంగా బయటికి వెళ్లినప్పుడైతే ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి కూల్‌డ్రింక్స్ ఎక్కువగా తాగుతుంటారు. కానీ ఇవి శరీరానికి అస్సలు మంచివి కావు. కాబట్టి ఇంట్లో తయారు చేసుకొనే మజ్జిగ, పండ్ల రసాలు తాగడం ఇటు ఆరోగ్యానికి, అటు చర్మ ఆరోగ్యానికీ ఎంతో మంచిది. వీటితో పాటు కోకమ్ షర్బత్, ఆమ్ పన్నా, బెల్ షర్బతల్ వంటివి ఎక్కువగా తాగాలి. ఇవన్నీ శరీరంలో ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా వృద్ధి చెందేందుకు సహాయపడతాయి. అలాగే చక్కటి పోషణనందించి మచ్చలేని చర్మాన్ని సొంతం చేస్తాయి.

**లేటుగా వద్దు..** చక్కటి ఆరోగ్యాన్ని, సౌందర్యాన్ని సొంతం చేసుకోవాలంటే తగినంత నిద్ర కూడా ఎంతో అవసరం. కాబట్టి ఎలాంటి ఒత్తిడి లేకుండా కంటి నిండా నిద్రపోవాలి. ఈ క్రమంలో ఎప్పుడూ లేట్ నైట్ పార్టీ లంటూ నిద్రను త్యాగం చేయకుండా రోజూ రాత్రి పూట వీలైనంత త్వరగా పడుకోవాలి. దీనివల్ల హార్మోన్ల స్థాయులు అదుపులో ఉంటాయి. అలాగే మెదడు పనితీరు మరింతగా మెరుగుపడుతుంది. రోజూ కనీసం ఎనిమిది గంటలు నిద్రకు కేటాయించడం వల్ల ఒత్తిళ్లు, ఆందోళనలకు దూరంగా ఉండచ్చు. తద్వారా ఇటు శారీరకంగా, అటు మానసికంగా ఆరోగ్యంగా, దృఢంగా ఉండవచ్చు. బరువునూ అదుపులో ఉంచుకోవచ్చు. □

# సేమ్యా కస్టర్డ్



**కావలసిన పదార్థాలు**

సేమ్యా: కప్పునెయ్యి: ఒక స్పూను
పాలు: నాలుగు కప్పులు చక్కెర: ఒకటిన్నర కప్పుకస్టర్డ్ పౌడర్: రెండు టేబుల్ స్పూన్లు కాజు, బాదం: అరకప్పు పండ్లముక్కలు: యాపిల్, అరటి పండు,దానిమ్మ గింజలు రెండు కప్పులు

తయారీ విధానంముందుగా బాణలి వేడిచేసి.. కొద్దిగా నెయ్యి వేసి సేమ్యా వేయించుకోవాలి. గిన్నెలో మూడు కప్పుల పాలు పోసి సేమ్యాను ఉడికించాలి. కాస్త ఉడికాక చక్కెరను కూడా కలుపుకోవాలి. మరో కప్పు పాలు విడిగా తీసుకుని కస్టర్డ్ పౌడర్‌ను అందులో వేసి ఉండలు లేకుండా బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని సేమ్యాలో పోయాలి. ఒక అయిదు నిమిషాలు ఉంచి కాస్త చిక్కబడ్డాక పొయ్యి మీద నుంచి దింపేయాలికాజు, బాదంపప్పులను ముక్కలుగా చేసి పెట్టుకోవాలి. అలాగే దాన్మి గింజలు ఒలిచి, మిగతా పండ్లను సన్నని ముక్కలా చేసిపెట్టుకోవాలి. ఈ తరిగిన పండ్లు,డ్రైఫ్రూట్స్‌ను చల్లారిన సేమ్యాలో వేసి కలపాలి. దీన్ని ఒక గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఔతియ్యతియ్యగా, చల్లచల్లగా ఉండే సేమ్యా కస్టర్డ్‌ను ఆరగించేయొచ్చు! □

# పిల్లల్లో తరచూ చెవి ఇన్ఫెక్షనా..?

**పసి తనంలో పిల్లలకు అప్పుడప్పుడూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటాయి. అవి సాధారణమే అని తేలిగ్గా తీసుకుంటున్నారా.. కానీ అవి పిల్లల్లో భాషా నైపుణ్యాలు కొరవడేలా చేస్తాయని మీకు తెలుసా!**

పసి పిల్లలు ముఖ్యంగా మూడేళ్ల లోపు వారిలో తరచూ చెవి ఇన్ఫెక్షన్లు వస్తుంటే.. వాటిని తేలిగానతీసుకోవద్దని పరిశోధకులు చెబుతున్నారు. ఎందుకంటే అవి వారిలో తాత్కాలికంగా వినికిడి లోపించేలా చేసి, భాషా నైపుణ్యాలు మెరుగుపడకుండా చేస్తాయట. 5-10ఏళ్ల పిల్లలను పరిశీలించినప్పుడు వాళ్లలో మూడేళ్లలోపు ఎవరికైతే ఎక్కువ చెవి ఇన్ఫెక్షన్లు వచ్చాయో, వాళ్లలో పద ఉచ్చారణ సరిగా లేనట్లు గుర్తించారు. ఈ ఇన్ఫెక్షన్లు వారి కర్ణభేరిలో ఒక రకమైన ఫ్లూయిడ్ ఏర్పడేలా చేస్తా యట. ఇది శబ్దాలు వినపడకుండా అడ్డుకుంటుందట. అందుకే చెవి ఇన్ఫెక్షన్లు ప్రమాదకరమైనవనీ, గుర్తించిన వెంటనే చికిత్స చేయించాలనీ చెబుతున్నారు. □



# తెర



# 'నా వైఫ్ మిస్సింగ్' చిత్రం ప్రారంభం

వరుణ్ సందేశ్ హీరోగా కొమర మీడియా వర్క్స్ బ్యానర్ పై ఆహా సమర్పణలో శివ కంఠంనేని, ఆర్ వెంకటేశ్వర రావు నిర్మాతలుగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం ' నా వైఫ్ మిస్సింగ్'. ఇటీవలే నయనం వెబ్ సిరీస్ ద్వారా ప్రేక్షకులను ఆకట్టుకున్న స్వాతి ప్రకాష్ మంత్రిప్రగడ దర్శకత్వంలో సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్ లో ఒక చక్కటి ప్రేమ కథగా ఈ చిత్రం రానుంది. ప్రవీణ్, మోహిత్, సత్య శ్రీ (జబర్దస్త్) తదితరులు కీలకపాత్రలు పోషించనున్నారు. సతీష్ కుమార్ ఎన్‌ఎస్ సినిమా టోగ్రఫీ చేయనున్న ఈ చిత్రానికి సాయి బాబు తలారి ఎడిటింగ్ చేస్తున్నారు. ఎన్నో చిత్రాలకు హిట్ మ్యూజిక్ అందించిన సాయి కార్తీక్ సంగీతం అందిస్తున్నారు. ఉమర్జీ అనురాధ ఈ చిత్ర కథను అందించగా శ్రీనివాస్ మండల స్క్రీన్ ప్లే రైటర్‌గా ఉండగా ఆదిత్య భార్గవ్ డైలాగ్స్ అందిస్తున్నారు.ఇటీవలే ఈ చిత్రం పూజ కార్యక్రమాలతో ప్రారంభం కావడం జరిగింది. ఆహా బృందం స్క్రిప్ట్ అందించగా సీనియర్ నిర్మాత సి కళ్యాణ్ గారు మొదటి క్లాప్ కొట్టారు. నటుడు, నిర్మాత, ఫిలిం ఛాంబర్ సెక్రటరీ గౌరవనీయులు అశోక్ కుమార్ గారు కెమెరా స్విచ్ ఆన్ చేయగా దర్శకుడు, జాతీయ అవార్డ్ గ్రహీత నీలకంఠ తొలి షాట్ కు దర్శకత్వం వహించారు. కాగా నేటి నుండి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఇక ఈ చిత్రానికి సంబంధించిన ఇతర అప్డేట్స్, మిస్ అయిన వైఫ్ ఎవరు? అనే విషయాలు చిత్ర బృందం క్రమంగా విడుదల చేయనుంది.

# 'పెద్ది' ట్రైలర్ మే 18న రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ రూరల్ యాక్షన్‌స్పోర్ట్స్ డ్రామా ' పెద్ది'. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌తో ఇప్పటికే స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ పోస్టర్లు, రెండు చార్ట్ బస్టర్ పాటలు, రెండు డిఫరెంట్ గ్లింప్స్ .. ప్రతి అప్‌డేట్‌కు అద్భుత మైన స్పందన లభించింది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన 'పెద్ది', జూన్ 4న పాన్‌ఇండియా స్థాయిలో భారీగా విడుదల కానుంది. ఓవర్సీస్ ప్రీమియర్లు జూన్ 3న జరగను న్నాయి.రిలీజ్ కౌంట్‌డౌన్ ప్రారంభమవుతున్న తరుణంలో చిత్ర నిర్మాతలు ఒక కీలక అప్డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న విడు దల చేయనున్నారు. ఇప్పట వరకు రామ్ చరణ్ పాత్రలోని రెండు షేడ్స్ చూపించిన టీమ్, ట్రైలర్‌లో సినిమా అసలు కథ, ప్రధాన పాత్రలను రివీల్ చేయను న్నట్లు తెలుస్తోంది. దీంతో ట్రైలర్‌పై అంచనాలు మరింత పెరిగి పోయాయి. అంచనాలను మరింత పెంచుతూ విడుదలైన కొత్త పోస్టర్‌లో రామ్ చరణ్ పూర్తి స్థాయి 1960ల గ్రామీణ యువకుడి లుక్‌లో రైల్వే ట్రాక్‌పై నడుస్తూ కనిపిస్తున్నారు. విజువల్స్‌లోని ప్రతి చిన్న డీటైలింగ్ ఆ కాలాన్ని ఎంత సహజంగా, క్రియేటివ్‌గా రీక్రియేట్ చేశారో ఈ పోస్టర్ స్పష్టంగా చూపిస్తోంది. ఈ కొత్త గెటప్‌లో రామ్ చరణ్ అద్భుతంగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా, ఓవర్సీస్ మార్కెట్‌లో 'పెద్ది సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. అడ్వాన్స్ బుకింగ్స్ అసాధారణ వేగంతో సాగుతూ కొత్త రికార్డుల దిశగా దూసు కెళ్తున్నాయి. ఇంటర్నేషనల్ రిలీజ్ ను ప్రత్యంగిర సినిమాస్ నిర్వహిస్తోంది.





# ' పురుష'మే 22న విడుదల

బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు.ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా మే 22న రిలీజ్ కాబోతుందని ప్రకటిస్తూ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో.. పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. .'పురుష' కోసం సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నేను ఇలా ఈ స్టేజ్ మీద నిల్చున్నానంటే దానికి మా నాన్న గారే కారణం. నన్ను నమ్మి ఈ పాత్రను ఇచ్చిన వీరు అన్నకి థాంక్స్. నాకు యాక్టింగ్‌లో సపోర్ట్ చేసిన సప్తగిరి అన్నకి, కసిరెడ్డి అన్నకి థాంక్స్. సక్సెస్ ఫుల్‌గా ఈ మూవీని పూర్తి చేశాం. మా అందరినీ బాగా చూపించిన సతీష్ గారికి థాంక్స్. దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ.. 'పురుష' 'విషయంలో నాకు సపోర్ట్ చేసిన నిర్మాత కోటేశ్వరరావు గారికి థాంక్స్. ఈ జర్నీలో అండగా నిలిచిన మా కెమెరామెన్ సతీష్ గారికి థాంక్స్. పవన్ కళ్యాణ్ యాక్టింగ్‌కి ఆడియెన్స్ ఫిదా అవుతారు. ఈ సినిమాలో నటించిన సప్తగిరి గారు, కసిరెడ్డి, మా హీరోయిన్లకు థాంక్స్. సప్తగిరి మాట్లాడుతూ.. పురుష' సినిమా మొత్తం మా డైరెక్టర్ వీరూ పైనే ఆధారపడి ఉంది. మానుంచి మంచి నటనను రాబట్టుకున్నాడు. సినిమా ఎలా ఉంది.. స్క్రీన్ ప్లే ఎలా ఉంది అనేది తెలియాలంటే మే 22 వరకు వేయిట్ చేద్దాం..



# నారా రోహిత్ రొమాంటిక్, కామెడీ చిత్రం

రోహిత్ నారా, చినిమిల్లి మణికుమార్, భరత్ చౌదరి, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి ప్రొడక్షన్ నెం.5, ఆర్ఎన్23 స్టార్ డైరెక్టర్ కొరటాల శివ క్లాప్ తో గ్రాండ్ గా లాంచ్

హీరో రోహిత్ నారా తన తదుపరి ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. కరణ్‌ది ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పితో కలిసి ఆయన చేస్తున్న ఈ కొత్త చిత్రం బ్యానర్‌కి ప్రొడక్షన్ నెం.5గా రూపొందుతోంది. ఆర్ఎన్23 ఫీల్‌గుడ్ రొమాంటిక్ కామెడీగా, ఆకట్టుకునే కుటుంబ భావోద్వేగాలతో ప్రేక్షకులను అలరించనుంది. భరత్ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ చినిమిల్లి మణికుమార్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో పాటు పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు. ముహూర్తపు షాట్‌కు కొరటాల శివ క్లాప్ కొట్టి, మేకర్స్ కు స్క్రిప్ట్‌ను అందజేసి చిత్రాన్ని అధికారికంగా ప్రారంభించారు. క్రేజీ హీరోయిన్ నయన్ సారిక ఈ చిత్రంలో రోహిత్ నారాకు జోడీగా నటిస్తోంది. అలాగే నరేష్ జురీ, రోహిణి, సంపత్, అజయ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకునేలా హాస్యం, ప్రేమ, భావోద్వేగాలు, రిలేటబుల్ మూమెంట్స్‌తో ఆర్ఎన్23 రూపొందుతోంది.ఈ వినోదభరితమైన చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్‌ని త్వరలోనే మేకర్స్ వెల్లడించనున్నారు. సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది.మూవీ లాంచింగ్ ఈవెంట్‌లో హీరో రోహిత్ నారా మాట్లాడుతూ..'అందరికీ నమస్కారం. లాంచింగ్ ఈవెంట్‌కు వచ్చిన అందరికీ థ్యాంక్యూ. ఇది చాలా మంచి ఎంటర్‌టైనర్. టైటిల్, ఫస్ట్ లుక్ అన్నీ వచ్చినప్పుడు మీరందరూ చాలా ఎక్సైట్ అవుతారు. హీరోయిన్ నయన్ సారిక మాట్లాడుతూ.. చాలా ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమాఇది. నిర్మాత భరత్ చౌదరి మాట్లాడుతూ... రోహిత్ తో ఈ సినిమా చేయడం చాలా హ్యాపీగా ఉంది. యాక్టర్ నరేష్ వికే మాట్లాడుతూ.. నేను ఈ ఏడాది యాక్సప్ట్ చేసిన రెండో సినిమా ఇది ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు కొత్తదనం, మంచి ప్రొడక్షన్ వాల్యూస్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. అలాంటి సినిమా ఇది. అన్ని హంగులున్న సినిమా. ఇందులో నేను ఒక కీలక పాత్ర పోషిస్తున్నాను

# వినోదభరితంగా 'రంగబలి'


సత్య, యోగి బాబు, పవన్ బసంశెట్టి, నాగార్జున రెడ్డి, నయవాయు చిత్రాలు, డ్రీమ్ మూవీ మేకర్స్ ప్రొడక్షన్ నెం.1 గ్రాండ్‌గా లాంచ్, రెగ్యులర్ షూటింగ్ నేడు ప్రారంభం

సత్య, యోగి బాబు ప్రధాన పాత్రలలో హిట్ ఎంటర్‌టైనర్ 'రంగబలి'తో పేరు పొందిన పవన్ బసంశెట్టి దర్శకత్వంలో ఓ కంప్లీట్ ఎంటర్టైనర్ రూపొందుతోంది. ఈ ప్రాజెక్ట్‌ను నాగార్జున రెడ్డితో కలిసి పవన్ బసంశెట్టి స్వయంగా, నయవాయు చిత్రాలు, డ్రీమ్ మూవీ మేకర్స్ బ్యానర్ల పై నిర్మిస్తున్నారు. ఈ రెండు బ్యానర్లకు ఇది ప్రొడక్షన్ నెం.1. అధికారిక ప్రకటనతో పాటు, చిత్ర నిర్మాతలు గ్రాండ్ లాంచ్ ఈవెంట్ తో ఈ చిత్రాన్ని ప్రారంభించారు. రామోజీ ఫిల్మ్ సిటీలో



మూవీ టీం, ప్రత్యేక అతిథుల సమక్షంలో ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి డైరెక్టర్ కిషోర్ తిరుమల క్లాప్ కొట్టారు. దర్శకుడు మహేష్ బాబు పి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకులు యధువంశీ, సందీప్ రాజ్ మేకర్స్‌కి స్క్రిప్ట్ అందించారు. సత్య, యోగి బాబులపై కీలక సన్నివేశాల చిత్రీకరణతో నేడు సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది. తన తొలి చిత్రం ' రంగబలి'లో అలరించే రచనతో ప్రశంసలు అందుకున్న పవన్ బసంశెట్టి, ఇప్పుడు మరో పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రాన్ని అందించడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి, సత్య, యోగి బాబుల అద్భుతమైన కామెడీ టైమింగ్ ని పూర్తిగా ఉపయోగించుకునేలా వారికి తగిన పాత్రలని తీర్చిదిద్దారు. సహజమైన హాస్యం, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ ఇద్దరు నటుల కలయికలో రాబోయే ఈ చిత్రం వినోదభరితమైన ప్రయాణంగా ఉండబోతోంది.

# టి.డి.ప్రసాద్ వర్మ దర్శకత్వంలో కొత్త చిత్రం



పూజా కార్యక్రమాలతో టి.డి.ప్రసాద్ వర్మ దర్శకత్వంలో హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ ప్రొడక్షన్ నెం.1 లాంఛనంగా ప్రారంభం హన్ శివ్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్‌పై టి.డి.ప్రసాద్ వర్మ దర్శకత్వంలో ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మిస్తోన్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో రోజున లాంఛనంగా ప్రారంభమైంది. అనురాగ్, సంతోష్, సాయి విక్రాంత్, అలీ, చమ్మక్ చంద్ర, ఆటో రాంప్రసాద్, ఫణి, వినీత రెడ్డి. ఈ కార్య క్రమంలో ప్రముఖ దర్శకుడు ఎస్.వి.కృష్ణారెడ్డి, నిర్మాత కె.అచ్చిరెడ్డి, నటుడు అలీ, డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, ఫణి సహా చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత కె.అచ్చిరెడ్డి క్లాప్ కొట్టగా, అలీ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఎస్.వి.కృష్ణారెడ్డి గౌరవ దర్శకత్వం వహిం చారు. ఈ సందర్భంగా..డైరెక్టర్ టి.డి.ప్రసాద్ వర్మ మాట్లాడుతూ అనురాగ్ హీరోగా.. ఎన్.మహేశ్వరి, పి.జ్యోతి నిర్మాతలుగా ప్రారంభమైన హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ చిత్రం ఓ డిఫరెంట్ కథాంశంతో ప్రేక్షకులను అలరించనుంది. ఈ సినిమా టీమ్‌ను ఆశీర్వదించటానికి వచ్చిన ఎస్.వి.కృష్ణారెడ్డికి, అచ్చి రెడ్డిగారికి, శ్రీనివాస రెడ్డిగారికి స్పెషల్ థాంక్స్ అలీగారు ఓ కీలక పాత్రలో మెప్పించనున్నారు. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్నీ ఎలిమెంట్స్‌తో సినిమాను రూపొంది స్తున్నాం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేస్తాం అన్నారు.హీరో మాట్లాడుతూ 'ప్రసాద్ వర్మగారు చెప్పిన పాయింట్ బాగా నచ్చింది. మంచి ప్రొడ్యూసర్ సపోర్ట్ దొరికింది. ఇందులో విలక్షణమైన పాత్రతో ఆడియెన్స్‌ను అలరించబోతున్నాను.అలీగారికి, ఎస్.వి.కృష్ణారెడ్డిగారికి, అచ్చి రెడ్డికి థాంక్స్ అన్నారు.సీనియర్ నటుడు అలీ మాట్లాడుతూ హన్ శివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రాబోతున్న తొలి సినిమా.

# టాప్-2 కోసం టఫ్ ఫైట్

## ఆహ్మదాబాద్‌లో నేడు గుజరాత్ టైటాన్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్



**ఆహ్మదాబాద్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్ణయాత్మక దశకు చేరుకుంది. ప్లే ఆఫ్ బెర్త్ దక్కించుకోవాలంటే ఇక ఇక్కడి నుంచి అన్ని జట్లకే గెలుపే పరమావధిగా మారింది. ఈ పరిస్థితుల్లో 14పాయింట్లతో పాయింట్లపట్టికలో రెండోస్థానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్..నేడు కీలక మ్యాచ్ ఆడనుంది.ఆహ్మదాబాద్ నరేంద్రమోదీ స్టేడియం వేదికగా జరిగే ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో ఉన్న గుజరాత్ టైటాన్స్‌తో తలపడనుంది. సొంతగడ్డపై విక్టరీతో ఆహ్మదాబాద్ వచ్చిన పాట్ కమిన్స్ సేన... ఇక్కడా గెలుపుతో ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం చేసుకోవాలన్న పట్టుదలతో ఉంది.

శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటాన్స్ ఈ సీజన్‌ను నెమ్మదిగా ప్రారంభించినప్పటికీ... రాజస్థాన్ రాయల్స్‌పై 77పరుగుల భారీ విజయంతో సహా వరుసగా నాలుగు విజయాలతో పుంజుకుంది. ఫుల్‌జోష్‌తో సొంతగడ్డపై మ్యాచ్‌కు సిద్ధమైంది. గుజరాత్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో సమవుత్యంగా ఉంది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ చక్కని ఫామ్‌లో ఉన్నారు.ఇద్దరూ గుజరాత్‌కు ఫ్లయింగ్ స్టార్ట్‌లు అందిస్తున్నారు.మరోసారి అలాంటి శుభారంభం లభిస్తే గుజరాత్‌కు తిరుగుండదు.ఇక మిడిల్ ఆర్డర్‌లో జోస్ బట్లర్, వాషింగ్టన్ సుందర్‌లపైనే ఎక్కువగ ఆధారపడుతోంది. ఈ నలుగురిలో ఇద్దరూ విఫలమైనా బ్యాటింగ్ పేకమేడను తలపిస్తోంది. వారి బౌలింగ్ దళం కూడా అంతే పటిష్టంగా ఉంది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహమ్మద్ సిరాజ్, రబడ పవర్ ప్లేలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్ల పతనాన్ని శాసిస్తున్నారు. మధ్య ఓవర్లలో రషీద్ ఖాన్ మ్యాచ్ మలుపు తిప్పే స్పెల్స్ చక్కగా తోడవుతున్నాయి.

ఇక పంజాబ్ కింగ్స్‌పై 4 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు సాధించి, 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించడం ద్వారా ఆరేంజ్ ఆర్మీ సరైన సమయంలో సరైన లయను అందుకుంది. ఇది సన్‌రైజర్స్ బ్యాటింగ్ సామర్థ్యాన్ని స్పష్టం చేస్తోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిక్ క్లాసెన్‌లతో కూడిన టాప్‌ఆర్డర్ ఫైరింగ్‌లో ఉంది. అత్యంత విధ్వంసకర బ్యాటింగ్ యూనిట్లలో ఒకటిగా చాటుకుంది. అత్యంత దూకుడు వల్లే ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ 200 ప్లస్ స్కోర్లు సాధిస్తూ వస్తోంది. ముంబై ఇండియన్స్‌పై అత్యధికంగా 249 పరుగులతో సహా ఏకంగా ఎనిమిది సార్లు 200 ప్లస్ స్కోర్లు చేసింది. స్లాగ్ ఓవర్లలో సూపర్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి తన బ్యాటింగ్‌తో మెస్మరైజ్ చేస్తున్నాడు. సన్‌రైజర్స్ ఓడిన మ్యాచ్‌లన్నీ దాదాపు బ్యాటింగ్ వైఫల్యంతోనే. నిర్లక్ష్యం దరిచేరకుండా బ్యాటింగ్ కొనసాగిస్తే సన్‌రైజర్స్‌కు తిరుగుండదు. బౌలింగ్ దళం ప్రత్యర్థిని కట్టడిచేసే స్థాయిలో ఉంది. గాయం కారణంగా మొదటి అర్థ భాగానికి దూరమైన కమిన్స్..తిరిగి జట్టులో చేరిన తర్వాత బౌలింగ్ అటాక్ బలంగా మారింది. శ్రీలంకన్ పేసర్ మలింగ ఈసీజన్‌లో అద్భుతంగా బౌలింగ్ చేస్తూ ప్రతి మ్యాచ్‌లో వికెట్లు అందిస్తున్నాడు. యంగ్ పేస్ గన్ సాకిబ్ హుస్సేన్ అదనపు బలంగా మారాడు. శివంగ్ కుమార్, రవిచంద్రన్ రూపంలో స్పిన్ వేరియేషన్ ఉంది.




### హెడ్ టు హెడ్

సన్‌రైజర్స్‌పై గుజరాత్ టైటాన్స్ పైచేయిగా ఉంది. ఇరుజట్లు ఏడు మ్యాచ్‌ల్లో తలపడితే గుజరాత్ అయిదింటిలో నెగ్గింది. సన్‌రైజర్స ఒకే ఒక మ్యాచ్ 2022లో గెలుపొందింది. ఒక మ్యాచ్ రద్దయింది. 2025 సీజన్‌లో రెండు సార్లు కూడా గుజరాత్ టైటాన్స్ నెగ్గింది. ఈ సీజన్‌లో ఇరు జట్లు తొలిసారి ఢీకొంటున్నాయి.

**గుజరాత్ టైటాన్స్(అంచనా):** సుదర్శన్, గిల్ (కెప్టెన్), జోస్ బట్లర్, సుందర్, హోల్డర్, తెవాటియా, నిశాంత్, రషీద్ ఖాన్, అర్షద్, కగిసో రబడ, సిరాజ్; **ఇంపాక్ట్ ప్లేయర్:** కిషోర్

**సన్‌రైజర్స్ హైదరాబాద్ (అంచనా):** అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, క్లాసెన్, నితీష్ రెడ్డి, సలీల్, రవిచంద్రన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), శివంగ్ కుమార్, మలింగ, సాకిబ్ హుస్సేన్; **ఇంపాక్ట్ ప్లేయర్:** హర్ష్ దూబె

## ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్ సన్‌రైజింగ్

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్.. సొంతగడ్డపై ఇరగదీసింది.సొంతగడ్డ ఇచ్చిన విజయాల బూస్టింగ్‌తో హైదరాబాద్ వెలుపల జరిగిన మ్యాచ్‌ల్లోనూ విజయాలు అందుకుంది. ఉప్పల్ స్టేడియం ఈ సీజన్‌లో లక్కీగా నిలిచింది. 6 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలు అందుకుంది. ఇక హైదరాబాద్ వెలుపల సన్‌రైజర్స్ ఇప్పటివరకు 5 మ్యాచ్‌లు ఆడితే మూడింటిలో నెగ్గింది. ఇంటా బయటా రెండేసి పరాజయాలు ఎదుర్కొంది. నేటి మ్యాచ్‌తో కలుపుకుని మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా, అందులో ఒకటి ఉప్పల్ స్టేడియంలో, రెండు హైదరాబాద్ వెలుపల ఆడనుంది. ఈ మూడింటిలో రెండు నెగ్గినా సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్లే ఆఫ్ బెర్త్ ఖాయం.

1 **చిన్నస్వామి స్టేడియం బెంగళూర్**
ఫలితం : 6 వికెట్ల తేడాతో ఓటమి
ఆర్సీబీ-203/4, ఎస్ఆర్‌హెచ్ -201/9

2 **ఈడెన్ గార్డెన్స్ కోల్‌కతా**
ఫలితం: 65 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-226/8, కేకేఆర్-161

3 **ఉప్పల్ స్టేడియం హైదరాబాద్**
ఫలితం: 5 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్- 156/9, లక్నో-160/5

4 **న్యూ చండీఘర్ స్టేడియం**
ఫలితం: ఆరు వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్ -219/6, పంజాబ్-223/4

5 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 57పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-216/6, రాజస్థాన్- 159

6 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: పది పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్- 194/9, సీఎస్‌కే -184/8

7 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 47 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-242/2, ఢిల్లీ- 195/9

8 **సవాయ్ మాన్‌సింగ్ స్టేడియం, జైపూర్**
ఫలితం: 5వికెట్ల తేడాతో విజయం
రాజస్థాన్-228/6, ఎస్ఆర్‌హెచ్ 229/4

9 **వాంఖడే స్టేడియం, ముంబై**
ఫలితం: 6 వికెట్ల తేడాతో విజయం
ముంబై -243/5, ఎస్ఆర్‌హెచ్-249/4

10 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 7 వికెట్ల తేడాతో ఓటమి
ఎస్ఆర్‌హెచ్-165, కేకేఆర్: 169/3

11 **ఉప్పల్ స్టేడియం, హైదరాబాద్**
ఫలితం: 33 పరుగుల తేడాతో విజయం
ఎస్ఆర్‌హెచ్-235/4, పంజాబ్-202/7



## వన్డే ర్యాంకుల్లో టీమిండియా టాప్

**ముంబై:** ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టీమిండియా 118పాయింట్లతో మరోసారి నెంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో నిలవగా, 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో ప్లేస్ లో కొనసాగుతోంది. అద్భుతమైన ప్రదర్శనలతో సౌతాఫ్రికా 102 పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ని వెనక్కి నెట్టింది. శ్రీలంక(96), అఫ్గానిస్థాన్(93), ఇంగ్లాండ్(89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74)ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అలాగే ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టేసింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానంలో ఉంది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్ కంటే ముందుకు వచ్చింది. కాగా ఐసీసీ ప్రకటించిన రూల్స్ ప్రకారం 2027 మార్చి 31వ తేదీ నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ -8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వే ఇప్పటికే టోర్నీకి నేరుగా అర్హత పొందినప్పటికీ, దక్షిణాఫ్రికా టాప్8లోనే కొనసాగితే మరో టీమ్ కి ఛాన్స్ లభిస్తుంది.

## పంజాబ్‌కు నాలుగో ఓటమి : గెలిచి నిలిచిన ఢిల్లీ

**ధర్మశాల:** ఐపీఎల్ 2026లో పంజాబ్ ఖాతాలో వరుసగా నాలుగో ఓటమి చేరింది. ఢిల్లీ క్యాపిటల్స్ కీలక పోరులో మూడు వికెట్లతో గెలుపొందింది. 211 పరుగుల భారీ టార్గెట్‌ను మరో ఓవర్ మిగిలి ఉండగానే అందుకుని ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. అయిదో విజయంతో పది పాయింట్లకు చేరుకుంది.

భారీ లక్ష్య చేధనలో ఢిల్లీ ఆరంభంలో తడబడింది. కేఎల్ రాహుల్(9)ను అవుట్ చేసి వికెట్ల పతనానికి నాంది పలికిన అర్ష దీప్ సింగ్.. అదే ఊపులో సాహిల్ పారిఖ్(13)ను కూడా పెవిలియన్ పంపాడు. మరో ఎండ్‌లో అభిషేక్ పోరెల్(5)ను యష్ ఠాకూర్ క్లీన్ బౌల్డ్ చేయగా, ట్రిస్టన్ స్టబ్స్(13) కొన్నోలీ అద్భుత త్రోకు రనౌట్ అయ్యాడు. దీంతో ఢిల్లీ 74 రన్స్‌కే 4 వికెట్లు కోల్పోయింది, ఈ దశలో కెప్టెన్ అక్షర్ పటేల్(30 బంతుల్లో 56), డేవిడ్ మిల్లర్ (28 బంతుల్లో 51) ధాటిగా ఆడుతూ విజయానికి బాటలు వేశారు.చివర్లో అశుతోష్(24),మాధవ్ తివారీ(18) మెరుపు బ్యాటింగ్‌తో ఢిల్లీకి విజయాన్ని ఖాయం చేశారు.







టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్‌కు ఓపెనర్లు ప్రియాంన్ష ఆర్య(33 బంతుల్లో 56; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(18)అదిరే ఆరంభాన్ని ఇచ్చారు. ఇన్నింగ్స్ మొదటి ఓవర్ లోనే రెండు సిక్సర్లు, ఒక ఫోర్, 5 వైడ్లతో కలిపి ఏకంగా 22 పరుగులు రాబట్టారు. ఈ క్రమంలోనే పంజాబ్ కింగ్స్ కేవలం 2.4 ఓవర్లలోనే 50 పరుగుల మైలురాయిని అందుకుంది. ఇక క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే బాదుడు మొదలు పెట్టిన ప్రియాంష్ ఆర్య కేవలం 24 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేశాడు. ఓపెనర్లు అవుటైన తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(36 బంతుల్లో 59; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), కూపర్ కొన్నోలీ(38) ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 83 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని జోడించారు. కొన్నోలీ అవుటైన తర్వాత మార్కస్ స్టోయినిస్, శశాంక్ సింగ్‌లను స్టార్క్ వరుస బంతుల్లో అవుట్ చేశాడు.ఒకవైపు వికెట్లు పడుతున్నా శ్రేయస్ అయ్యర్ నిలకడగా ఆడి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. చివర్లో సూర్యాంశ్ షెడ్గ(8 బంతుల్లో 21) భారీ షాట్లతో విరుచుకుపడటంతో పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210కి చేరుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, మాధవ్ తివారీ తలో రెండు వికెట్లు తీసుకోగా, ముకేష్ కుమార్ ఒక వికెట్ పడగొట్టాడు.




## మార్కెట్లపై ప్రధాని మోడీ ప్రకటన ఒత్తిళ్లు

# జ్యుయెలరీ షేర్లు భారీ పతనం

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, మే 11:** ఇరాన్ శాంతిప్రతిపాదనలకు ట్రంప్ నో చెప్పడం, ప్రధాని మోడీ బంగారం కొనవద్దని, పెట్రోడీజిల్ వాడకం పొదుపు చేయాలని కోరుతూ చేసిన ప్రకటనలు స్టాక్ మార్కెట్లను ముంచేసాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1312.91 పాయింట్లు క్షీణించి 76,015.28 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ కూడా 360.30 పాయింట్లు క్షీణించి 23,815.85 పాయింట్ల వద్ద ట్రేడింగ్ ముగించింది మూడు ట్రేడింగ్ సెషన్లలోను సెన్సెక్స్ 2.5శాతం, నిఫ్టీ సూచీ 2.1శాతం క్షీణించింది. భారతి ఎయిర్‌టెల్ 4.18శాతం, రిలయన్స్ 3.31 శాతం, హెచ్‌డిఎఫ్‌సి 2.13శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఇలో ట్రేడింగ్ టర్నోవర్ ఒక్కరోజే ఆరులక్షలకోట్లు క్షీణించినట్లుతేలింది. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ కూడా 1.26శాతంక్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.96శాతం దిగజారింది.

మార్కెట్లపరంగా బిఎస్ఇలో కేవలం 1358 కంపెనీలు మాత్రమే పెరిగాయి.మూడువేల కంపెనీల షేర్లు క్షీణించాయి.192షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక డాలరుతో రూపాయి మారకం విలువలు 95.31వద్ద ముగిసింది.ముందురోజు చెలామణి 94.49వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ సెటిల్‌మెంట్లు రూ.1,51,975కి చేరాయి.కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు జులై సెటిల్‌మెంట్ దరలు 2.25 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 103.54 డాలర్లుగా కొనసాగింది. విదేశీ మార్కెట్లపరంగా ఎస్అండ్‌పి 500సూచీ 0.84శాతంపెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ 1.71శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 12.19 పాయింటు పెరిగింది. వ్యవసాయేతర ఉపాధి కొలువులు 1.15 లక్షలుగా ఉన్నట్లు తేలింది.55వేల వరకూ ఉంటాయన్న అంచనాలను అధిగమించింది. అమెరికా నిరుద్యోగిత రేటు 4.3శాతంగా ఉంది.

ఇక ప్రధానిమోడీ చేసిన ప్రకటనతో జ్యుయెలరీ షేర్లుభారీ పతనం చెందాయి. ఏడాదిపాటు బంగారం కొనవద్దంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలు జ్యుయెలరీ, బంగారం కంపెనీలపై భారీ ఒత్తిడిని తెచ్చాయి. కల్యాణ్ జ్యుయెలర్స్ 9.23శాతం, సెన్‌కో గోల్డ్ 8.61శాతం క్షీణిస్తే టైటాన్ కంపెనీ 6.83శాతం, స్కై గోల్డ్ అండ్ డైమండ్స్ 6.63శాతం క్షీణించాయి. తంగమయిల జ్యుయెలరీ 5.69శాతం, పిసి జ్యుయెలరీస్ 4.94 శాతం చొప్పున క్షీణించాయి. ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో స్టాక్ 4.94శాతం, స్పైస్‌జెట్ 4.72శాతం క్షీణించింది. ఎంసిఎక్స్ ఇండియా 2.92శాతం పెరిగింది.టాటాకన్స్యూమర్ ప్రొడక్ట్స్ 8.32శాతం, బిర్లా కార్పొరేషన్ 7.15శాతం, డ్రిండ్‌వెల్ నార్టన్ 6.61శాతం, కెనరాబ్యాంకు3.72శాతం, ఉత్కర్ష్ స్మాల్‌ఫైనాన్స్ 8.38శాతం చొప్పున క్షీణించాయి.బ్లూడార్ట్ ఎక్స్‌ప్రెస్ సైతం7.40శాతం,ఆర్తి సర్ఫాక్టెంట్ 10.82శాతం పతనం అయ్యాయి. బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.97శాతం పెరిగాయి.




## పెట్రోడీజిల్, గ్యాస్ ధరల పెంపు?

**ముంబయి, మే 11:** ఇంధనం, విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించుకోవాలని, ప్రజా రవాణాను, కార్ పూలింగ్‌ను ఉపయోగించుకోవాలని ప్రధాని మోడీ చేసిన సూచనలు ఇంధన ధరల పెంపును స్పష్టంచేస్తున్నాయి. వర్క్ ఫ్రమ్ హోం, ఆన్‌లైన్ మీటింగ్స్ పెట్టుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించుకోవాలని, కార్ల వినియోగం తగ్గించుకుని మెట్రో వంటి పబ్లిక్ రవాణా వ్యవస్థల్ని వాడుకోవాలని సూచించారు.మోడీ వ్యాఖ్యల నేపథ్యంలో దేశ ప్రజలకు పెట్రోల్, డీజిల్, గ్యా ధరలు పెరగబోతున్నాయని తెలిసింది. ఇక పశ్చిమాసియా యుద్ధం కారణంగా చమురు, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. చమురు సంస్థలకు రోజుకు వెయ్యి కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికే లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. దీంతో ధరలు పెంచాలని కేంద్రాన్ని ఒత్తిడి చేస్తున్నాయి. మంత్రిత్వ శాఖల మధ్య చర్చల నేపథ్యంలో ఇంధన ధరల పెంపు భారీగా ఉండొచ్చని వార్తలు వస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీలు) తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇంధన ధరల పెంపుపై ఆలోచనలు ప్రారంభించింది. ప్రస్తుతం ఈ త్రైమాసికంలో ఆయిల్ కంపెనీల అండర్ రికవరీలు రూ.2 లక్షల కోటకు చేరే అవకాశం ఉందని, అందులో సుమారు రూ.1 లక్ష కోట్ల నష్టం వచ్చే అవకాశముందని అంచనా వేస్తున్నారు. 24 గంటల్లోనే చమురు ధరలు పెరగవచ్చని వార్తలొస్తున్నాయి. ఆర్థిక, పెట్రోలియం మంత్రిత్వ శాఖలు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. ఈ పెంపు సమయం ప్రపంచ ముడి చమురు పోకడలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక ఒత్తిళ్లు, ఇంధన ధరలను సమతుల్యం చేయడానికి ప్రభుత్వం తీసుకునే విధానంపై ఆధారపడి ఉంటుందని వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ముడి చమురు, గ్యాస్, ఎల్‌పీజీలను అధిక ధరకు కొనుగోలు చేస్తున్నప్పటికీ, వినియోగదారులను ఆదుకునేందుకు తుది ఉత్పత్తులను తక్కువ ధరకు అమ్ముతున్నాయని దీనివల్ల రోజుకు రూ. 1,000 కోట్ల వరకు నష్టాలు వస్తున్నాయని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి అన్నారు. పెరుగుతున్న నష్టాలను పూడ్చుకోవడానికి ప్రభుత్వ రంగ ఇంధన విక్రయ సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే అవకాశం ఉందని అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి.

## 28 బోగస్ యాప్‌లు తొలగించిన గూగుల్

**ముంబయి, మే 11:** కాల్ హిస్టరీ వెల్లడిస్తామని, మీకు కాల్ చేసిన వ్యక్తుల వివరాలను అందిస్తామనే హామీతో ఈ స్పామ్ యాప్‌లను లక్షలాది మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ నకిలీ యాప్‌లకు కాల్ ఫాంటమ్ అని నామకరణం చేసారు.ఈ యాప్‌లు గూగుల్ ప్లే స్టోర్ నుంచి 73లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు నమోదు చేశాయి. ఈ28ఆండ్రాయిడ్ యాప్‌లు ఎలా మోసం చేశాయంటే వినియోగదారుడు ఇచ్చిన ఏ ఫోన్ నెంబర్ ప్రైవేటు కాల్స్, ఎస్సెమ్మెస్ రికార్డులు, వాట్సాప్ కాల్ హిస్టరీని అయినా ఇవ్వగలమని ఈ నకిలీ యాప్స్ నమ్మించాయి. వాస్తవానికి ఈ యాప్‌లు నకిలీ డేటాను సృష్టించి, కల్పిత ఫలితాలను అందిస్తూ, సబ్‌స్క్రిప్షన్ కోసం వినియోగదారుల నుంచి డబ్బులు కూడా వసూలు చేశాయి. భద్రతా పరిశోధక సంస్థ ఈఎస్ఈటీ వెల్లడించిన ప్రకారం,కాల్‌హిస్టరీ ఆఫ్ ఎనీ నెంబర్ అనే యాప్ గురించి రెడ్డిట్ పోస్టులో గుర్తించిన అనంతరం పూర్తి వివరాలు తెలుసుకోవడానికి విచారణ ప్రారంభించారు. ఇండియన్ గవర్నమెంట్.ఇన్ అనే డెవలపర్ పేరుతో ఈ పోస్టు ఉంది. దీని ప్రకారం వినియోగదారుడు అందించిన ఏ ఫోన్ నెంబర్ కాల్ హిస్టరీనైనా తిరిగి పొందవచ్చు. ఈ యాప్‌నకు భారత ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదు. ఇది అందించిన కాల్ హిస్టరీ డేటా పూర్తిగా కల్పితమని కూడా రీసెర్చర్స్ గుర్తించారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఇలాంటి మరో 27 యాప్‌లను పరిసోధకులు గుర్తించారు. 2025 డిసెంబర్ 16వ తేదీన ఈ యాప్‌ల గురించి గూగుల్‌కు నివేదించినట్లు ఈఎస్ఈటీ తెలిపింది.

## పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన 6.6శాతం వృద్ధి



**న్యూఢిల్లీ,మే 11:** దేశంలోని పట్టణ ప్రాంతాల్లో జనవరి మార్చి త్రైమాసికంలో 6.6శాతం ఉపాధిపెరిగిందని కేంద్ర అర్థగణాంక, పథక అమలు విభాగం సోమవారం ప్రకటించింది. అంతకుముందు త్రైమాసికంలో 6.7శాతం మాత్రమే ఉంది. రెగ్యులర్ వేతనం, లేదా నెలసరి జీతంతో కూడిన ఉపాధి గ్రామీణ ప్రాంతాల్లో భారీ వృద్ధితో ఉంది. 14.8శాతంనుంచి 15.5శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 15 ఏళ్లకుపైబడిన వారు ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నట్లు తేలింది. మాధ్యమిక, ప్రాదేశిక రంగాల్లో ఉపాధి కూడా గ్రామీణప్రాంతాల్లోనే ఎక్కువ ఉంది. 15 ఏళ్లకుపైబడిన వారి కార్మిక శక్తి భాగస్వామ్యం రేట్ జనవరి మార్చి త్రైమాసికంలో 55.5శాతంగా ఉంది. అంతకుముందు త్రైమాసికంలో 55.8శాతంకంటే స్వల్పంగా తగ్గింది. మోస్పి వివరాలను బట్టిచూస్తే మహిళల కార్మికశక్తి భాగస్వామ్యం 34.7శాతంగా ఉంది. పట్టణప్రాంతాల్లో వర్కర్ జనాభా నిష్పత్తి కూడా స్థిరంగా 46.9శాతం వద్దనే ఉంది. మంత్రిత్వశాఖ విడుదలచేస్తే పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే ప్రకారంచూస్తే 15 ఏళ్లకుపైబడిన వారంతా కూడా ఉపాధిరంగంలో చొచ్చుకుపోతున్నారని తెలుస్తోంది. 2024 జనవరి నెలనుంచి పిఎల్‌ఎఫ్ఎస్ సర్వేకు ప్రామాణికంగా మోస్పి ప్రకటించింది.


## మ్యూచువల్ ఫండ్స్‌లోకి 38వేల కోట్ల పెట్టుబడులు

**ముంబయి, మే11:**ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి గతనెలలో రూ.38,440.20 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.అదేమార్చిలో అయితే 40వేల 450.26కోట్లు రాగా ఏప్రిల్‌లో స్వల్పంగా తగ్గింది. మొత్తంగా మూచువల్ ఫండ్స్ రంగంలోకి రూ.3.22 లక్షలకోట్లు పెట్టుబడులు వచ్చాయని ఆంఫీ వెల్లడించింది. అదే మార్చిలో రూ.2.39 లక్షలకోట్లు మాత్రమే అందాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్ లోనికే ఎక్కువ పెట్టుబడులు రాగా లార్జ్ క్యాప్ ఫండ్స్ రూ.2524.61 కోట్లు వచ్చాయి. మిడ్‌క్యాప్ కేటగిరీలో 6551.40కోట్లు వచ్చాయి. స్మాల్‌క్యాప్‌ఫండ్స్ నికరంగా రూ.6885.90 కోట్లు పెట్టుబడులు ఏప్రిల్‌లోనేవచ్చాయని ఆంఫీ ప్రకటించింది. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌లోకి 10వేల 147.85 కోట్లవరకూ నిధులు వచ్చాయి. సెక్టోరల్, థెమాటిక్ ఫండ్స్ రూ.1949.36 కోట్లు వచ్చినట్లు మూచువల్‌ఫండ్స్ సంస్థల సంఘం ఆంఫీ తెలిపింది. డెట్స్ రంగంలోకి కూడా రూ.2.47 లక్షల కోట్లు ఏప్రిల్‌నెలలో పెట్టుబడులుగా వచ్చాయి. రాత్రికిరాత్రే రూ.31,420.45 కోట్లు వచ్చాయి. ఇక లిక్విడ్‌ఫండ్స్ రూ.1.65 లక్షలకోట్లు రాగా సిప్ పెట్టుబడులు రూ.31,115 కోట్లుగాఉ న్నాయి. ఇక హైబ్రిడ్ పాసివ్‌ఫండ్స్ రూ.20,565.24కోట్లుగా ఉన్నట్లు ఆంఫీ ప్రకటించింది. ఆర్బిటేజ్‌ఫండ్స్ రూ.12,378.46 కోట్లుగా ఉన్నాయి గోల్డ్ ఈటిఎఫ్‌లలోకి కూడా 3040.31కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చినట్లు తేలింది. ఇక కొత్తగా ఫండ్ ఆఫర్లు 11 వరకూ ఉన్నాయి. మొత్తం రూ.828 కోట్లు వచ్చాయి. ముందునెలతో పోలిస్తే అన్నివిభాగాల్లోను కొంతమేర తగ్గినట్లు తేలింది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన పొదుపు సూత్రాలు, ధరల పెంపు సంకేతాలతో పెట్టుబడులు కొంత మేర మార్చినెలతో పోలిస్తే సన్నగిల్లాయి. ఇక పసిడిఈటిఎఫ్‌లలోకి కూడా3040.3 కోట్ల పెట్టుబడులువచ్చాయి.ఫ్రిబవరిలో ఇన్వెస్టర్లు 2266 కోట్లు పెట్టుబడులుపెడితే, నికరంగా గోల్డ్ ఇటిఎఫ్‌లలో 34శాతంపెట్టుబడులు పెరిగాయి.



## 86% ఉద్యోగులు ఎఐ వినియోగిస్తున్నా రాబడి తక్కువే!

**ముంబయి, మే 11:** భారతదేశంలోని కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం గణనీయంగా పెరిగింది. దేశంలో దాదాపు 86 శాతం మంది ఉద్యోగులు తమ రోజువారీ పనిలో ఏఐని వాడుతున్నప్పటికీ, దానిపై పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి అంచనాలకు తగ్గట్టుగా ఉందని కేవలం 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ సగటు 22శాతం కంటే భారత్ మెరుగ్గా ఉండటం గమనార్హం. ఈ వివరాలను టెక్నాలజీ నిపుణుల సంస్థ ఇసాకా సోమవారం వెల్లడించింది.భారత్‌లోని 49శాతం సంస్థలు ఇప్పుడు పూర్తిస్థాయి, అధికారిక ఏఐ విధానాన్ని కలిగి ఉన్నాయి.2025లో ఇది 32 శాతంగా ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు 38 శాతంతో పోలిస్తే ఇది అధికం. అయినప్పటికీ దేశంలోని 23శాతం సంస్థలు పరిమిత విధానాలతోనే సరిపెడుతుండగా, 20 శాతం సంస్థల్లో అసలు ఎలాంటి ఏఐ పాలసీ లేకపోవడం గమనార్హం. రోజువారీ పనుల్లో ఏఐ భాగమైనప్పటికీ పాలన,కార్యాచరణ సంసిద్ధతలో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. రాబడి విషయంలో ఉద్యోగుల నుంచి మిశ్రమ స్పందనలు వచ్చాయి. 21 శాతం మంది రాబడి గురించి చెప్పడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందనిచెప్పారు. మరో 21 శాతం మంది ఇప్పటివరకు పరిమిత రాబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకో 18 శాతం మందికి రాబడిపై ఎలాంటి అవగాహన లేదని తేలింది. భారతీయ ఉద్యోగులు ప్రధానంగా ఉత్పాదకత పెంచుకోవడానికి 56శాతం, పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేయడానికి 55శాతం, కంటెంట్ రాసేందుకు 51శాతం, భారీ డేటాను విశ్లేషించడానికి 42శాతం ఏఐని ఉపయోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 82 శాతం మంది తమ వృత్తికి ఏఐ నైపుణ్యాలు చాలా అవసరమని భావిస్తున్నారు. రాబోయే 12 నెలల్లో తమ సంస్థలో ఏఐ సంబంధిత ఉద్యోగాలు పెరుగుతాయని 57 శాతం మంది అంచనా వేస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.